PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 143 విజయవాడ, బుధవారం 25 డిసెంబర్ 2024 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No Vijayawada, Wednesday 25 December 2024 Rs

హర్లిన్ డియోల్ సెంచరీ

వన్డేల్లో టీమిండియా రికార్డు స్కోరు సమం

రెండో వన్డేలో వెస్టిండీస్‌పై 115పరుగుల తేడాతో గెలుపు

సిరీస్ 2-0తో కైవసం 8

పాఠకులకు, శ్రేయోభిలాషులకు, ప్రకటన కర్తలకు, ఏజెంట్లకు

క్రిస్మస్ శుభాకాంక్షలు

- ఎడిటర్

శ్యామ్ బెనెగల్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న నటులు నసీరుద్దీన్ షా

సినీ దిగ్గజానికి తుది వీడ్కోలు

అధికారిక లాంఛనాలతో శ్యామ్ బెనెగల్ అంత్యక్రియలు

ముంబయి : భారతీయ సమాంతర సినిమా ఉద్యమానికి మార్గ దర్శకుడు శ్యామ్ బెనెగల్ అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో మంగళవారం నాడిక్కడి శివాజీ పార్క్ శ్మశాన వాటికలో నిర్వహించారు. ఈ అంత్యక్రియలకు కుటుంబ సభ్యులతోబాటు బాలీవుడ్‌కు చెందిన ప్రముఖులు, వివిధ రంగాలకు చెందిన ముఖ్యులు గుల్జార్, నసీరుద్దీన్‌షా, జావెద్ అక్తర్ , రంజిత్ కపూర్, కుల్‌భూషణ్ ఖర్బంద, ఇలా అరుణ్, రత్న పాఠక్ షా, అతని కుమారుడు వైవాన్ షా, దర్శకులు హన్సల్ మెహతా, దివ్య దత్తా, బోమన్ ఇరానీ, కునాల్ కపూర్, ఆనంద్ దేశాయ్ తదితరులు హాజరయ్యారు. బెనెగల్ తీసుకొచ్చిన విప్లవం ఎవరూ, ఎప్పటికీ పునరావృతం చేయలేరని గుల్జార్ వ్యాఖ్యానించారు. 'బెనెగల్ నిష్క్రమించలేదు. మేమే అతనికి దూరంగా వెళ్లాం, సినిమాల్లో మార్పు అనే విప్లవంతో బెనెగల్ ముందుకు వెళ్లారు. బెనెగల్ తెచ్చిన విప్లవాన్ని మళ్లీ తీసుకొచ్చే సామర్థ్యం ఎవరికీ లేదు. సుదీర్ఘకాలం మేం అతన్ని గుర్తుంచుకుంటాం' అని ఆయన అన్నారు. బెనెగల్ సెటైరికల్ సినిమా వెల్‌కమ్ టు సజ్జన్‌పూర్‌లో ప్రధాన పాత్ర పోషించిన శ్రేయాస్ తల్పాడే మాట్లాడుతూ 'శ్యా మ్ బెనెగల్ కారణంగా ఈ చిత్రం తనకు మరపురాని షూటింగ్ అనుభవాల్లో ఒకటిగా మిగిలిపోయింది' అని చెప్పారు. 'ఈ సినిమా షూటింగ్ తరువాత నేను పూర్తిగా మారిన వ్యక్తిని. మేం బెనెగల్ యొక్క సంభాషణలకు దూరమయ్యాయం. బెనెగల్ మాటలు మమ్మల్ని మంత్ర ముగ్ధుల్ని చేసేవి. వాటికి దూరం కావడం పెద్ద లోటు' అని తల్పాడే తెలిపారు.

భారతీయ సమాంతర సినిమా ఉద్యమానికి మార్గదర్శకులైన శ్యామ్ బెనెగల్ సోమవారం తుదిశ్వాస విడిచారు. ఈ నెల 14న 90 పుట్టిన రోజు నిర్వహించుకున్న బెనెగల్ ఊపిరి ఉన్నంతవరకు సినిమారంగంలో పనిచేస్తూనే ఉంటానని అన్నారు.

ఆగని కోత

కెరటాల తాకిడికి సముద్రంలో కలుస్తున్న గృహాలు • ఆందోళనలో మత్స్యకారులు

ఇటీవల అల్పపీడనం కారణంగా కెరటాల తాకిడి వల్ల కోతకు గురైన మత్స్యకారుల ఇళ్లు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

ఈ నెలలో వరుసగా వచ్చిన తుపానులతో కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ, అమీనాబాద్, కోనపాపపేటల్లో సముద్ర తీరం కోతకు గురైంది. 20కిపైగా ఇళ్లు సముద్రంలో కలిసిపోయాయి. ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కారణంగా కెరటాల తాకిడికి ఉప్పాడలో గరికిన రాము, కొవ్వూరి దాసు, కొవ్వూరి పోలేరు, సూరాడ గోపిల ఇళ్లునేలమట్టమయ్యాయి. తుపానులు వచ్చినప్పుడల్లా అలల తాకిడికి ఇలా కొన్నేళ్లుగా మత్స్యకారుల గ్రామాలు కోతకు గురై కుంచించుకుపోతున్నాయి. కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డు సైతం తరచూ శిథిలమవుతోంది. సముద్ర కోత నివారణ అనేది నాయకులకు ఎన్నికల హామీగానే మిగిలిపోతోంది. యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరం క్రమంగా కనుమరుగవుతోందని మత్స్యకారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పెథాయ్, తిత్లీ, ఫణి, హెలిన్ వంటి తుపానుల సమయంలో ఉప్పాడ, కోనపాపపేట, సూరాడపేట తదితర గ్రామాల్లో వందలాది ఇళ్లు నేలమట్టమయ్యాయి. గడిచిన 55 ఏళ్లలో ఇక్కడ సముద్ర తీరం కిలోమీటరు కంటే ఎక్కువగా ముందుకు చొచ్చుకొచ్చింది. దాదాపు 1,500 ఇళ్లు, పదుల సంఖ్యలో దేవాలయాలు, ప్రభుత్వ భవనాలు సైతం సముద్ర గర్భంలో కలిసిపోయాయి. 500 ఎకరాల పైబడి తీరాన్ని అనుకుని ఉన్న వ్యవసాయ భూమి పూర్తిగా సముద్రంలో కలిసిపోయినట్లు స్థానిక మత్స్యకార పెద్దలు చెబుతున్నారు. 2004 డిసెంబర్‌లో వచ్చిన సునామీ కారణంగా బీచ్ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో, రూ.14 కోట్లతో 1.53 కిలోమీటర్ల పొడవున 2007లో జియోట్యూబ్ టెక్నాలజీతో బీచ్ రోడ్డును పటిష్టం చేశారు. పర్యవేక్షణ కొరవడంతో నాలుగేళ్ల క్రితం జియో ట్యూబ్ పూర్తిగా ధ్వంసమైంది. ఫలితంగా కోత మళ్లీ పెరిగింది.

అమలు కాని హామీలు

కాకినాడ నుంచి ఉప్పాడ వరకు సుమారు 15 కిలోమీటర్ల పొడవున బీచ్ రోడ్డు ఉంది. మాయాపట్నం నుంచి కాకినాడ వైపు బీచ్ రోడ్డు గుండా సుమారు కిలోమీటరు పొడవున సమద్రకోత నివారణకు గతంలో అనేకసార్లు పెద్దపెద్ద బండరాళ్లను, సుమారు రెండు వేల సిమెంటు దిమ్మలను డంప్ చేశారు. అయినా సముద్ర కోత ఆగడం లేదు. ఈ ఏడాది ఏప్రిల్‌లో వారాహి విజయభేరి బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన వెంటనే సముద్రపు కోత నివారణకు శాశ్వత పరిష్కార మార్గాలను చూపుతామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలైంది. సముద్ర కోత నివారణకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని చెప్పారు తప్ప, నేటికీ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. తమ గృహాలు సముద్రంలో కలిసిపోతున్నాయని, ఆదుకునే నాధుడే కరువయ్యారని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న కాలనీకీ ముప్పు తప్పదా?

కాకినాడ-ఉప్పాడ మధ్య ప్రాంతంలో వైసిపి ప్రభుత్వం ఆధ్వర్యంలో జగనన్న కాలనీని మిగతా 7లో

భయం భయంగా జీవిస్తున్నాం

అనేకేళ్లుగా సముద్రపు కోత తీవ్రంగా ఉంటోంది. తుపాను వచ్చినప్పుడల్లా తీర ప్రాంతంలోని కొన్ని ఇళ్లు సముద్రంలో కలిసిపోతున్నాయి. ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని భయం భయంగా జీవించాల్సి వస్తోంది. నాలుగు నెలల క్రితం పవన్ కల్యాణ్... తీరప్రాంతానికి వచ్చి కోత నివారణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నేటికీ ఇందుకు సంబంధించి ఎటువంటి పనులూ చేపట్టడం లేదు.

- సూరాడ రాజు, ఇల్లు కోల్పోయిన బాధితుడు, ఉప్పాడ, యు.కొత్తపల్లి మండలం

బలపడిన అల్పపీడనం

- 3 రోజులు తేలికపాటి వర్షాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పశ్చిమ బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం అదే ప్రాంతంలో కొనసాగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇది పశ్చిమ-నైరుతి దిశగా కదులుతూ వచ్చే 24 గంటల్లో క్రమంగా బలహీనపడే అవకాశం ఉందన్నారు. రాగల మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. వర్షాల నేపథ్యంలో వ్యవసాయ పనుల్లో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డిసెంబరు 25న శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, అన్నమయ్య జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశముందని పేర్కొన్నారు. ఈ నెల 26న ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, పల్నాడు, కర్నూలు, వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ నెల 27న ప్రకాశం, నంద్యాల, వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని వివరించారు.

కోస్తా జిల్లాల్లో మోస్తరు వర్షం 2

మణిపూర్ గవర్నర్‌గా అమిత్ షా సన్నిహితుడు

- ఐదు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు
- ఒరిస్సాకు కంభంపాటి హరిబాబు, బీహార్‌కు అరిఫ్‌ఖాన్

న్యూఢిల్లీ : మణిపూర్ నూతన గవర్నర్‌గా కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి అజయ్ భల్లాను నియమించారు. ఐదు రాష్ట్రాలకు కొత్త గవర్నర్ల నియామకం, పునర్వ్యవస్థీకరణకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోద ముద్ర వేశారు. కేంద్ర మాజీ మంత్రి జనరల్ వికె సింగ్ (రిటైర్డ్)ను మిజోరం గవర్నర్‌గా నియమించారు. కేరళ ప్రస్తుత గవర్నర్ అరిఫ్ మహమ్మద్ ఖాన్‌ను బీహార్ గవర్నర్‌గా నియమించారు. బీహార్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లెకర్‌ను కేరళ గవర్నర్‌గా నియమించారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వానికి అరిఫ్ ఖాన్ క్రమం తప్పకుండా ఘర్షణలు సృష్టిస్తున్న సమయంలో ఈ చర్య ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుత మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబును ఒడిషా గవర్నర్‌గా నియమిం చారు. కేంద్ర హోం శాఖ కార్యదర్శిగా ఐదేళ్లకు పైగా బాధ్యతలు నిర్వహించిన అజయ్ భల్లా హోం మంత్రి అమిత్ షాకు అత్యంత సన్నిహితుడిగా పేరుంది. వివాదాస్పదమైన పౌరసత్వ (సవరణ) చట్టం, మూడు నూతన క్రిమినల్ చట్టాల రూపకల్పనలో అజయ్ భల్లా కీలక పాత్ర పోషించారు. 1984 బ్యాచ్ ఐఎఎస్ అధికారి అజయ్ భల్లా ఈ ఏడాది ఆగస్టు 22న పదవీ విరమణ చేశారు.

అధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఇళ్లకే పరిమితం కావద్దు

- మహిళలకు సిఎం సూచన
- 'కో వర్కింగ్ స్పేస్' విధానంతో కొత్త అవకాశాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహిళలు, ముఖ్యంగా చదువుకున్న మహిళలు ఇళ్లకే పరిమితం కాకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. మహిళలకు కొత్త ఉపాధి అవకాశాలపై మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవసరమైన శిక్షణ ఇచ్చి వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలని చెప్పారు. వర్క్ ఫ్రం హోమ్‌తో పాటు, కో వర్కింగ్ స్పేస్ (వివిధ కంపెనీలు, బృందాలకు చెందిన సిబ్బంది ఒకే కార్యాలయంలో కలిసి పనిచేసే స్థలం) వంటి విధానాలను అమలు చేయడం ద్వారా మహిళలకు విస్తృత అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అదే సమయంలో మానవ వనరుల సమర్థ వినియోగం కూడా సాధ్యమవుతుందని అన్నారు. గ్రామాల్లో, చిన్న పట్టణాల్లో ఉన్న చదువుకున్న మహిళలకు అవసరమైన శిక్షణ ఇవ్వాలని, వివిధ సంస్థల్లో వారు ఉపాధి అవకాశాలు పొందినా, ఒకే చోట పనిచేయడానికి అవకాశం కల్పించడం ద్వారా ఈ విధానాన్ని క్షేత్రస్థాయికి తీసుకుపోవచ్చని చెప్పారు. ఈ తరహా ఏర్పాటు కంపెనీలకు కూడా సౌలభ్యంగా ఉంటుం దని అన్నారు. కార్యాలయాల పేరిట అనవసర ఖర్చును నివారించే అవకాశం ఉండటంతో కంపెనీలు కొత్త ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని చెప్పారు. ఇప్పటికీ చదువుకున్న మిగతా 7లో

410 మంది ఫైబర్‌నెట్ ఉద్యోగుల తొలగింపు 5

ఐకమత్యంతోనే విజయం

- రైతు నాయకులు దల్లేవాల్
- క్షీణిస్తున్న ఆరోగ్యాన్ని లెక్క చేయకుండా దీక్ష కొనసాగింపు

వద్దని చెప్పినా థియేటర్‌కు ఎందుకొచ్చారు?

- అల్లు అర్జున్‌ను మరోసారి విచారించిన పోలీసులు
- భావోద్వేగంతో కంటతడి పెట్టిన బన్నీ? 5

సంక్షేమ పథకాల్లో కోతపెడితే

ప్రజలు సహించరు

- డేటా ప్రైవసీ యాక్టు తేవాలి
- అమిత్ షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా 30న నిరసన : వి శ్రీనివాసరావు



ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

బడ్జెట్‌ను మిగుల్చుకునేందుకు సంక్షేమ పథకాల్లో కొతపెడితే ప్రజలు సహించబోరని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. అనంతపురంలో రెండు రోజులుగా జరుగుతున్న సిపిఎం జిల్లా మహాసభకు మంగళవారం హాజరైన ఆయన ఎస్ఎన్ ఫంక్షన్ హాల్లో మీడియాతో మాట్లాడారు. అనర్హుల గుర్తింపు పేరుతో ప్రభుత్వం నిర్వహిస్తోన్న సర్వేను ఆయన తప్పుబట్టారు. బడ్జెట్‌ను మిగుల్చుకునే క్రమంలోనే సర్వే పేరుతో అర్హుల తొలగింపు కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందన్నారు. తొలగింపులతోపాటు రాజకీయ వేధింపులకూ పాల్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం కూడా ఇదే రకమైన చర్యలకు పాల్పడిందని గుర్తు చేశారు. సర్వే పేరుతో కుటుంబ సమాచారాన్ని మొత్తాన్ని సేకరించి బయట కంపెనీలకు అప్పగించే అవకాశాలూ ఉన్నాయన్నారు. డేటాను సేకరించడం, ప్రయివేటు సంస్థలకు అప్పగించి సొమ్ము చేసుకోవడం జరుగుతోందని తెలిపారు. డేటా ప్రైవసీ యాక్టును తేవాలని డిమాండ్ చేశారు. అమెరికా, యుకె ఎన్నికలను కూడా ఈ రకమైన డేటా ప్రభావితం చేసిందని వివరించారు. ప్రభుత్వాలు డేటాను సంరక్షించే చర్యలు ఇప్పటికైనా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన వ్యవసాయ రంగాన్ని ప్రయివేటుపరం చేయాలని చూస్తోందన్నారు. రైతులు పోరాడి తిప్పికొట్టిన మూడు వ్యవసాయ చట్టాలను దొడ్డిదారిన అగ్రికల్చర్ మార్కెటింగ్ రిఫార్సు పేరుతో దేశంలో అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని తెలిపారు. చట్టంతో పనిలేకుండా రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదంతో దొడ్డిదారిన అమలు చేయించే ప్రయత్నాలు జోరుగా చేస్తోందని వివరించారు. రైతులకు నష్టం చేకూర్చే ఈ నిర్ణయాన్ని మన రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించవద్దని కోరారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ నెల 30న దేశ వ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని నిర్ణయించినట్లు చెప్పారు. అందులో భాగంగా రాష్ట్రంలోనూ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎప్పుడూలేని విధంగా ట్రూ అప్ ఛార్జీల పేరుతో రూ.16 వేల కోట్లు భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. స్మార్టు మీటర్లు పెడితే ధ్వంసం చేయాలని ప్రతిపక్షంలో ఉండగా నారా లోకేశ్ చెప్పారని, అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లను యథావిధిగా అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రజలపై మోపిన భారాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విలేకర్ల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఒ.నల్లప్ప, ఎస్.నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

కోస్తా జిల్లాల్లో మోస్తరు వర్షం

ప్రజాశక్తి - యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం కోస్తాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడ్డాయి. శ్రీకాకుళం తీరప్రాంత మండలాలతో పాటు శ్రీకాకుళం డివిజన్‌లో తేలికపాటి వర్షం కురిసింది. మిగిలిన ప్రాంతాల్లో వాతావరణం పొడిగా ఉంది. తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పలుచోట్ల తేలికపాటి జల్లులు, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, కడియం మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడలో తేలికపాటి వర్షం కురిసింది. ఉప్పాడలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. కోనసీమ జిల్లా అమలాపురం, రాజోలు, సఖినేటిపల్లి, కొత్తపేట మండలాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. మిగిలిన అన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పలుచోట్ల ఉదయం నుంచి వర్షం పడుతూనే ఉంది. మధ్యాహ్నం నుంచి ఏలూరు, పాలకొల్లు, మొగల్తూరు, జీలుగుమిల్లి ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. సార్వా వరి మాసూళ్లు చివరి దశలో ఉండటంతో పెద్దగా నష్టం లేకపోయినా దాళ్వా నారుమడుల పనులకు వర్షం ఇబ్బందిగా మారిందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే వేసిన నారుమళ్లు వర్షాలకు దెబ్బతినే అవకాశం ఉందని, వర్షాల ప్రభావం మరింత పెరిగితే ఇబ్బంది తప్పదని వాపోతున్నారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో ముసురు పట్టింది. ఉదయం నుంచి చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, పల్నాడు, నెల్లూరులో తేలికపాటి వర్షాలు కురిశాయి.

బిఎల్‌ఒల గౌరవ వేతనం విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గత మూడేళ్లుగా బూత్‌లెవెల్ ఆఫీసర్లు (బిఎల్‌ఒ)కు రావాల్సిన గౌరవ వేతనాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు జిఓ ఆర్‌టి నెంబరు 2200ను మంగళవారం విడుదల చేసింది. మూడేళ్లుగా విధులు నిర్వహించిన ఒక్కొక్కరికి రూ.12,750లను ప్రభుత్వం చెల్లించనుంది. 2021-22 సంవత్సరం మూడో క్వార్టర్‌కు రూ.750, 2021-22లో నాలుగో క్వార్టర్‌కు రూ.1500, 2022-23 నాలుగు క్వార్టర్స్‌కు రూ.6 వేలు, 2023-24 సంవత్సరం నాలుగు క్వార్టర్స్‌కు రూ.4,500 ప్రభుత్వం విడుదల చేసింది. ఆయా మొత్తాలను జిల్లాల అధికారులు సంబంధిత బిఎల్‌ఒలకు అందజేస్తారని తెలిపారు. నిధులు విడుదల చేయడం పట్ల గ్రామ సచివాలయ ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

ఒక్క పూట ఉపశమనం ఆవిరి

- మార్కెట్లకు మళ్లీ నష్టాలు..
- నేడు సెలవు

ముంబయి : వరుసగా ఐదు సెషన్లలో భారీ నష్టాలు చవి చూసిన దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాలతో ముగియగా.. ఆ సంతోషం మరుసటి రోజే ఆవిరయ్యింది. రూపాయి పతనంతో పాటు అమ్మకాల ఒత్తిడితో మంగళవారం సూచీలు ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. ముఖ్యంగా లోహ, పిఎస్‌యుల్లో అమ్మకాలు చోటు చేసుకున్నాయి. దీంతో తుదకు బిఎస్‌ఇ సెన్సెక్స్ 67.30 పాయింట్లు కోల్పోయి 78,472.87కు పడిపోయింది. ఉదయం 78,707 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై.. ఇంట్రాడేలో 78,877.36 గరిష్టాన్ని తాకింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 25.80 పాయింట్లు తగ్గి 23,727.65 వద్ద ముగిసింది. దాదాపు 1,907 షేర్లు లాభపడగా.. 1,926 స్టాక్స్ ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. నిఫ్టీలో పవర్ గ్రిడ్ కార్ప్, జెఎస్‌డబ్ల్యు స్టీల్, ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్, టైటాన్ కంపెనీ, ఎస్‌బిఐ స్టాక్స్ అధిక నష్టాలను చవి చూడగా.. టాటా మోటార్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఐషర్ మోటార్స్, బిపిసిఎల్, ఐటిసి స్టాక్స్ అధిక లాభాలు నమోదు చేసిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మిడ్‌క్యాప్ సూచీ యథాతథంగా నమోదు కాగా.. స్మాల్ క్యాప్ సూచీ 0.3 శాతం పెరిగింది. క్రిస్మస్ సందర్భంగా బుధవారం స్టాక్ మార్కెట్లకు సెలవు. తిరిగి గురువారం తెరుచుకోనున్నాయి.

రాష్ట్రంలో బిపిసిఎల్ రూ.6,100 కోట్ల పెట్టుబడులు

- రిఫైనరీ, పెట్రోకెమికల్స్ కంప్లెక్స్ ఏర్పాటు

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని దిగ్గజ చమురు కంపెనీ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) ఆంధ్రప్రదేశ్‌లో రూ.6100 కోట్ల పెట్టుబడులను పెట్టనున్నట్లు ప్రకటించింది. గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీతోపాటు పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం జరిగిన ఆ కంపెనీ బోర్డ్ సమావేశంలో తీర్మానం చేసినట్లు బిపిసిఎల్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. ఈస్ట్‌కోస్ట్‌లో గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. ఇందుకోసం ముందస్తు ప్రాజెక్ట్ కార్యకలాపాలు ప్రారంభించినట్లు వెల్లడించింది. ప్రాథమిక అధ్యయనం, భూమి గుర్తింపు, సేకరణ, ఫీజుబులిటి రిపోర్ట్స్, పర్యావరణ ప్రభావం తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని పనులు చేపడుతున్నట్లు తెలిపింది. ఇంజనీరింగ్ ప్యాకేజీతోపాటు డిజైన్లు సైతం పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. మంగళవారం బిఎస్‌ఇలో బిపిసిఎల్ షేర్ 0.90 శాతం పెరిగి రూ.291.70 వద్ద ముగిసింది.

అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలి

- 30న దేశవ్యాప్త నిరసనలు
- జమిలి జిమ్మిక్కులతో ప్రజాస్వామ్యానికి విఘాతం
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు

విలేకరులతో మాట్లాడుతున్న బివి, రాఘవులు, పక్కన తమ్మినేని తదితరులు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ఇటీవల ముగిసిన పార్లమెంటు సమావేశాల్లో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ మీద కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అవమానకరమైన వ్యాఖ్యలు చేశారని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. అంబేద్కర్‌ను అభిమానించేవారిని ఎగతాళి చేస్తూ, అంబేద్కర్ జపం చేయడం ఫ్యాషన్‌గా మారిందనీ, ఆ జపం ఏదో దేవుడ్ని తలుచుకుంటే స్వర్గమన్నా వచ్చేదంటూ అత్యంత అవమానకర వ్యాఖ్యలు చేశారని చెప్పారు. దీన్ని సిపిఎం సహా దేశం యావత్తు ఖండించి, దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అయినా అమిత్‌షా, ప్రధాని మోడీ ఏమీ పట్టనట్టే ఉన్నారనీ, పైపెచ్చు ప్రధాని మోడీ...అమిత్‌షా వ్యాఖ్యల్ని సమర్థిస్తూ మాట్లాడుతున్నారని చెప్పారు. సంగారెడ్డి పట్టణంలో జరగనున్న నాల్గవ రాష్ట్ర మహాసభ లోగో, కరపత్రాన్ని మంగళవారం సిపిఎం రాష్ట్ర కార్యాలయం ఎంబి భవన్‌లో ఆయన ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు, టీ జ్యోతితో కలిసి ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగం గురించి పార్లమెంటులో చర్చ జరుగుతుండగా, ఆ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమానించడమంటే, ఆ రాజ్యాంగాన్ని అవమానించడం, పరోక్షంగా రాజ్యాంగాన్ని తిరస్కరించడమే అవుతుందని అన్నారు. మోడీ సర్కార్ ఓ వైపు రాజ్యాంగం గురించి నిత్యం జపం చేస్తూ, మరోవైపు అదే రాజ్యాంగానికి తూట్లు పొడిచే ప్రయత్నం చేస్తోందని వివరించారు. ఈ నేపథ్యంలోనే వామపక్షపార్టీలు డిసెంబర్ 22న సమావేశమై అమిత్‌షా వ్యాఖ్యల పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తూ, నిరసన కార్యక్రమాలు చేయాలని నిర్ణయించాయని తెలిపారు. దానిలో భాగంగా ఈనెల 30న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నామని చెప్పారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన 129వ రాజ్యాంగ సవరణ, కేంద్రపాలిత రాష్ట్రాల సవరణ బిల్లు ఒకే దేశం-ఒకే ఎన్నికను అమలు చేయడం కోసమేనని స్పష్టం చేశారు. ఇది చాలా ప్రమాదకరమైందనీ, 129వ రాజ్యాంగ సవరణలో రాష్ట్రాల అసెంబ్లీకు ఐదేండ్ల కాలపరిమితి తీరకున్నా, వాటిని రద్దుచేస్తామని పేర్కొంటున్నారనీ, ఇది పూర్తిగా అప్రజాస్వామికమనీ, ఫెడరల్ వ్యవస్థకు తీవ్రమైన నష్టమని చెప్పారు. కేంద్రంలో ప్రభుత్వం మూడేండ్లకే కూలిపోతే, అప్పుడు రాష్ట్రాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వం చెబుతున్నట్టు ఎన్నికల ఖర్చు తగ్గించడం దీని ఉద్దేశం కాదనీ, జమిలీ ఎన్నికల వెనుక దురుద్దేశం ఉందని ఆక్షేపించారు. ఎన్నికల సంఘం సిఫార్సు మేరకు కేంద్ర ప్రభుత్వం కాండాక్ట్ ఆఫ్ ఎలక్షన్ రూల్స్ పేరుతో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిబంధనల్ని మారుస్తూ నోటిఫికేషన్ ఇచ్చిందని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన వివరాలైన సీసీ టీవీ ఫుటేజ్, వెబ్‌కాస్టింగ్, ఇతర వివరాలను ఎవరైనా తీసుకోవచ్చని, కానీ తాజాగా ఈ నోటిఫికేషన్‌లో ఆ వివరాలు అందరికీ ఇవ్వాల్సిన అవసరం లేదంటూ, మినహాయింపు ఇస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని వివరించారు. ఈ ప్రతిపాదనల్ని ఎన్నికల కమిషన్ చేసిందని కేంద్రం చెప్తున్నదనీ, అయితే గతంలో ఇలాంటి మార్పులు చేయాలంటే, ఎన్నికల కమిషన్ మొదట రాజకీయపార్టీలను పిలిచి వారి అభిప్రాయాలను తీసుకునేవారని చెప్పారు. ఇప్పుడు అలాంటివేం లేవనీ, ప్రతిపాదనలు చేశారో లేదో కూడా తెలీదన్నారు.

పటిష్టంగా సిసిటిఎన్‌ఎస్ అమలు

- సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

క్రైమ్, క్రిమినల్ ట్రాకింగ్, నెట్‌వర్కు సిస్టమ్ (సిసిటిఎన్‌ఎస్)ను పటిష్టంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు. సచివాలయంలో తన అధ్యక్షతన మంగళవారం జరిగిన సిసిటిఎన్‌ఎస్ రాష్ట్రస్థాయి అపెక్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నియమ నిబంధనలు, మార్గదర్శకాలకు లోబడి అవసరమైన సాఫ్ట్‌వేర్, ఇతర పరికరాలు సమకూర్చుకోవాలని ఆదేశించారు. 2025 జనవరి 31న సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం జరగనుందన్నారు. అంతకుముందు సిసిటిఎన్‌ఎస్, ఐసిజెఎస్ ప్రాజెక్టుపై నోడల్ అధికారి, విజయవాడ నగర సిపి రాజశేఖర్‌బాబు వివరిస్తూ.. ప్రాజెక్టుల అమలుకు రూ.238 కోట్ల అంచనాలతో కేంద్రానికి కార్యాచరణ ప్రణాళిక సమర్పించగా, రూ.88 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో అవసరమైన పరికరాలను సమకూర్చుకున్నామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా వివిధ శాఖలు, ఏజెన్సీలకు డేటా షేరింగ్ జరుగుతుందన్నారు. సమావేశంలో న్యాయశాఖ కార్యదర్శి జి ప్రతిభాదేవి, సిఐడి ఐజి వినీత్ బ్రిజ్‌లాల్, ఎపిఐఐసి విసి అండ్ ఎండి అభిషిక్త్ కిషోర్, హోం, ఆర్థికశాఖల కార్యదర్శులు విజయకుమార్, కె ఆదినారాయణ, వర్చువల్‌గా డిజిపి ద్వారకా తిరుమలరావు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి : సిఎస్

అగ్రిగోల్డ్ బాధితులకు సకాలంలో న్యాయం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశించారు. సచివాలయంలో ఈ అంశంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. అగ్రిగోల్డ్ బాధితులు పోగొట్టుకున్న ఆస్తులను సకాలంలో వారికి తిరిగి చేర్చే విధంగా కేసుల సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఎపి సిఐడి, ఇతర విభాగాల అధికారులను ఆదేశించారు. సిఐడి ఐజి వినీత్ బ్రిజ్‌లాల్ మాట్లాడుతూ ఇందుకు సంబంధించి మొత్తం 23 ఉత్తర్వులు విడుదల చేశామన్నారు. కేసు 9 రాష్ట్రాలతో ముడిపడి ఉందని, సంస్థ అన్ని రాష్ట్రాల్లో కలిపి 19,18,865 మంది డిపాజిట్‌దార్ల నుంచి మొత్తం రూ.6,380 కోట్లు వరకూ వసూలు చేసి, డిపాజిట్‌దార్లను మోసగించిందన్నారు.

చెవిరెడ్డి పిటిషన్‌పై తీర్పు రిజర్వు

ప్రజాశక్తి-అమరావతి

అత్యాచార బాధితురాలిని పరామర్శిస్తే తనపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయడం అన్యాయమంటూ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. జనవరి 10న తీర్పు వెలువరిస్తామని జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ ప్రకటించారు. తిరుపతి జిల్లా యర్రవారిపాలెం పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలని ఆయన తరపున న్యాయవాది పి వీరారెడ్డి వాదించారు. ఫిర్యాదుదారు కుమార్తెను పరామర్శించేందుకు పిటిషనర్ ఆస్పత్రికి వెళ్లారని తెలిపారు. ఆమెపై అత్యాచారం జరిగిందని పిటిషనర్ మీడియాకు చెప్పారంటూ పోలీసులు తప్పుడు కేసు నమోదు చేశారన్నారు. ఫిర్యాదుదారు తరపున న్యాయవాది ఆనంద్‌కుమార్ ప్రతివాదన చేస్తూ, పోలీసులు తెల్ల కాగితాలపై చెవిరెడ్డితో సంతకాలు తీసుకున్న మాట నిజమేనని చెప్పారు. ఆ కాగితంపైనే ఫిర్యాదు రాశారన్నారు. కేసు నమోదు చేశాక దర్యాప్తులో ఫిర్యాదుదారు పాత్ర ఉండదన్నారు. దీనిపై జనవరి 10న హైకోర్టు తీర్పు చెప్పనుంది.

విక్రాంత్ రెడ్డిపై కఠిన చర్యలొద్దన్న ఉత్తర్వులు పొడిగింపు

కాకినాడ డీప్ వాటర్ పోర్టు వాటాల కొనుగోళ్లకు సంబంధించిన సిఐడి కేసులో నిందితునిగా ఉన్న వై విక్రాంత్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవద్దన్న గత ఉత్తర్వులను మంగళవారం హైకోర్టు మరోసారి పొడిగించింది. విచారణను ఈ నెల 31కు వాయిదా వేసింది. ముందస్తు బెయిల్ ఇవ్వాలన్న విక్రాంత్‌రెడ్డి పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయాలని సిఐడిని ఆదేశించింది. తనను ప్రతివాదిగా చేర్చాలన్న ఫిర్యాదుదారు కెవి రావు అనుబంధ పిటిషన్‌ను అనుమతించింది.

రెప్పపాటులో ఘోరం

- కరెంటు స్తంభాన్ని ఢీకొట్టిన కారు
- ముగ్గురు దుర్మరణం.. మరో ముగ్గురికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - కంచిలి (శ్రీకాకుళం)

ప్రమాద స్థలంలో కారులో ఇరుక్కున్న బాధితులు , ఇన్‌సెట్‌లో మృతులు సోమేశ్వరరావు, తల్లి కూతురు లావణ్య , నేహా

కారు అదుపుతప్పి కరెంటు స్తంభాన్ని ఢీకొట్టడంతో ముగ్గురు దుర్మరణం చెందారు. మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన శ్రీకాకుళం జిల్లా మండలంలోని చిన్న కొజ్జిరియా వద్ద జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం... విశాఖ సీతమ్మధారకు చెందిన ముత్తా వెంకట రంగ రాజేష్ గుప్తా ఒక్కగానొక్క కుమార్తెకు పాట్నా ఐఐటిలో సీటు వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులతో విశాఖ బీచ్‌లో కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్నారు. ఈ నేపథ్యంలో రాజేష్, ఆయన భార్య లావణ్య (43), తల్లి సుబ్బలక్ష్మి, కుమిర్తె నేహా గుప్తా (19), తోడల్లుడు తెలంగాణ రాష్ట్రం భద్రాచలానికి చెందిన కదిరిశెట్టి సోమేశ్వరరావు (49), మరదలు రాధికతో కలిసి ఒడిశాలోని జాజ్‌పూర్ తరిణిమాత ఆలయానికి విశాఖ నుంచి తన కారులో మంగళవారం వేకువజామున బయలుదేరారు. కంచిలి మండలం చిన్న కొజ్జిరియా వద్దకు వచ్చేసరికి డ్రైవింగ్ చేస్తున్న రాజేష్‌కు నిద్రమత్తులో కనురెప్పలు పడడంతో వారు ప్రయాణిస్తున్న కారు జాతీయ రహదారి పక్కన కరెంటు స్తంభాన్ని ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే లావణ్య మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తీవ్ర గాయాలపాలైన నేహా గుప్తా, సోమేశ్వరరావును సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా వారిద్దరూ కూడా మరణించారు. రాధిక పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాకుళం మెడికవర్‌కు తరలించారు. సుబ్బలక్ష్మి, రాజేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. తన కళ్లెదుటే భార్య, కుమార్తె కన్నుమూయడంతో రాజేష్ గుండెలు బాదుకుని విలపిస్తున్నారు. రాజేష్ విశాఖపట్నంలో జెసిబి స్పేర్ పార్టుల వ్యాపారం చేస్తుండగా, ఆయన తోడల్లుడు సోమేశ్వరరావు భద్రాచలంలో ఉద్యోగం చేస్తున్నారు. సోమేశ్వరరావుకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనాస్థలిని కాశీబుగ్గ డిఎస్‌పి వెంకట అప్పారావు, సిఐ మంగరాజు, ఎస్ఐ పారినాయుడు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

మంత్రి అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి..

ఈ రోడ్డు ప్రమాదంపై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించాలని అధికారులకు ఆదేశించారు.

రూ.727 కోట్లతో కరకట్ట విస్తరణ

- తొలిదశలో ఉండవల్లి నుంచి ఉద్దండ్రాయునిపాలెం రోడ్డు
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన సిఆర్‌డిఎ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి పనుల్లో భాగంగా అత్యంత కీలకమైన సీడ్ యాక్సెస్ రోడ్డు పొడిగింపు పనులు వేగం పుంజుకున్నాయి. కనెక్టివిటీ రోడ్డు కావడంతో దీన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులు ఆలోచన చేస్తున్నారు. ప్రస్తుతం రాజధానికి వెళ్లేందుకు పశ్చిమ బైపాస్ రోడ్డును ప్రధాన లింకుగా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. అయితే రాజధాని నుంచి బయటకు వెళ్లే మార్గాలకు ప్రస్తుత పశ్చిమ జాతీయ రహదారి అడ్డంకిగా ఉన్న ఆరుచోట్ల అండర్‌పాస్‌లు వేయాలని నిర్ణయించారు. దీనికి కేంద్రం నుంచి ఆమోదం కూడా లభించింది. దీంతోపాటు విజయవాడ నుండి అత్యంత కీలకమైన కనెక్టివిటీగా ఉన్న కరకట్టను విస్తరించాలని గతంలోనే ప్రతిపాదించినా అమలుకు నోచలేదు. ప్రస్తుతం ప్రపంచ బ్యాంకు రుణాలు ఇస్తుండటంతో పూర్తిస్థాయిలో నాలుగు లైన్లుగా మార్చాలని నిర్ణయించారు. కరకట్ట నుండి నేరుగా వెలగపూడి సచివాలయానికి చేరుకునే విధంగా అనుబంధ రోడ్డునూ విస్తరించనున్నారు. తొలిదశలో ఉండవల్లి నుండి ఉద్దండ్రాయునిపాలెం వరకూ కరకట్టను నాలుగులైన్లు చేయనున్నారు. అక్కడ నుండి సెక్రటేరియట్ కనెక్టివిటీని పెంచనున్నారు. దీనికోసం కరకట్టకు రూ.488.16 కోట్లు, అక్కడ నుండి ఎన్11, ఎన్13 రోడ్లను విస్తరించేందుకు రూ.239.16 కోట్లను కేటాయించారు. వీటికి ఈ నెలలోనే టెండర్లు పిలుస్తామని, జనవరి నెలాఖరు నుండి పనులు ప్రారంభించనున్నామని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణ ప్లానులో ఈ రోడ్డు కూడా కీలకం కానుందని అధికారులు ప్రకటించారు. అయితే రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలం విషయంలో పెనుమాక, ఉండవల్లి రెవెన్యూ పరిధిలో కొంత స్థలాన్ని సేకరించేందుకు ప్రకటనలు ఇచ్చినా ఇటీవల మంత్రి నారాయణ ఆయా భూములకు చెందిన రైతులతో నేరుగా మాట్లాడారు. ఎక్కువ మంది పూలింగు పద్ధతిలో ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. దీంతో పెనుమాక పరిధిలో ఉన్న కొంత సమస్య కూడా పరిష్కారం అయినట్లయింది. ఈ క్రమంలో మొత్తం రోడ్డు విస్తరణకు కావాల్సిన ప్రణాళికను ఇంజినీరింగ్ విభాగం వారు రూపొందించారు. ఇందులో కరకట్టను బోరుపాలెం, హరిశ్చంద్రపురం వరకూ విస్తరించాల్సి ఉంది. మాస్టర్ ప్లాను ప్రకారం లింగాయపాలెం రెవెన్యూ పరిధిలో కొంత భాగం కృష్ణానది లోపలకు ఒంపు తిరుగుతుంది. నదుల విషయంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పులు ప్రత్యేకంగా ఉండటంతో అక్కడ రోడ్డు అంశంపై సిఆర్‌డిఎ అధికారులు ఆలోచనలో పడ్డారు. దీంతో కరకట్టను కృష్ణా నదిలోకి ఒంపు తిరగనంత వరకూ విస్తరించి మిగిలిన అంశాన్ని తరువాత పరిశీలన చేయాలని నిర్ణయించారు.

నిరసన తెలుపుతున్న లాయర్లు

అమిత్ షా వ్యాఖ్యలపై లాయర్ల నిరసన

ప్రజాశక్తి- విజయవాడ

పార్లమెంట్‌లో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా బాధ్యతారహితంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం విజయవాడ బార్ అసోసియేషన్ ఎదుట, కోర్టు గేటు వద్ద లాయర్లు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ నాయకులు, బెజవాడ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.రాజా, కార్యదర్శి క్రాంతికుమార్, ఐలు నాయకులు వేము కోటేశ్వరరావు, సంపర శ్రీనివాసరావు, ఆలూరి సుధాకర్‌రావు, సుబ్రమణ్యేశ్వరరావు, వి రాజా రత్నం, ఆవుల వెంకటరావు, వడ్లమూడి రామకృష్ణ, నామాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పెంపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి పరీక్ష ఫీజు సకాలంలో చెల్లించని విద్యార్థుల కోసం తత్కాల్ పథకంలో గడువు పొడిగించినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కెవి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. రూ.వెయ్యి ఆలస్యపు రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ నెల 27 నుంచి 2025 జనవరి పదో తేదీ వరకూ అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్ష ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు ప్రభుత్వ పరీక్షల విభాగం వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

ప్రయివేటుకు 'ఉక్కు' సిఐఎస్‌ఎఫ్ అగ్నిమాపక విభాగం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం కుట్రలను ఆపడం లేదు. ప్లాంట్ రక్షణ విభాగంలో కీలకంగా ఉన్న సిఐఎస్‌ఎఫ్‌ను నిర్వీర్యం చేసేందుకు తాజాగా పన్నాగాలు పన్నుతోంది. తొలుత సిఐఎస్‌ఎఫ్‌లోని అగ్నిమాపక విభాగాన్ని ప్రయివేటుకు అప్పగించేందుకు పూనుకుంటోంది. ఈ క్రమంలోనే సిఐఎస్‌ఎఫ్ ఫైర్ వింగ్‌ను బయట వారికి అప్పగించేందుకు ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ పేరిట మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయాలని కొన్ని సంవత్సరాలుగా ప్రయత్నిస్తోన్న కేంద్ర ప్రభుత్వం తాజాగా రక్షణ విభాగాన్ని ప్రయివేటుకు అప్పగించనుంది. ఇప్పటికే స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం విశాఖ ఉక్కు రక్షణ బాధ్యత కోసం రాష్ట్ర పోలీసులను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో మొదటిగా సిఐఎస్‌ఎఫ్ నుంచి అగ్నిమాపక విభాగాన్ని తొలగిస్తోంది. తర్వాత సిఐఎస్‌ఎఫ్‌ను కూడా స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగం నుంచి తొలగించనున్నట్టు తెలుస్తోంది.

ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్‌లో సుమారు 200 మంది రక్షణ సిబ్బంది పనిచేస్తున్నారు. స్టీల్ ప్లాంట్ ఆస్తులు, మిషనరీలను సిఐఎస్‌ఎఫ్ కీలకంగా రక్షిస్తోంది. ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికులను రక్షించేందుకు శిక్షణ పొందిన, నిపుణులైన సిఐఎస్‌ఎఫ్ సిబ్బంది ఎప్పుడూ ప్లాంట్‌లో కాపలాగా ఉంటారు. వారి వద్ద అవసరమైన రక్షణ సామగ్రి ఉంటుంది. ఫైర్ ఇంజన్లు సిద్ధంగా ఉంటాయి. అదే ప్రయివేటు సంస్థ అయితే ఈ భద్రత లోపిస్తుందని కార్మికులు అంటున్నారు.

దుర్మార్గమైన చర్య

స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్

స్టీల్‌ప్లాంట్‌కు 40 సంవత్సరాలుగా సేవలందిస్తోన్న సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్‌ను తొలగించి ప్రయివేటు సెక్యూరిటీ సంస్థను ఏర్పాటు చేయడం దుర్మార్గం. దీని కోసం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ పేరుతో యాజమాన్యం విడుదల చేసిన నోటిఫికేషన్ దారుణమైనది. సిఐఎస్‌ఎఫ్ వంటి రక్షణ సంస్థను నిర్వీర్యం చేయడం తగదు.

సిఐడి మాజీ ఎడిజిపి సంజయ్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిఐడి మాజీ ఎడిజిపి ఎన్ సంజయ్‌పై ఎసిబి కేసు నమోదు చేసింది. వైసిపి ప్రభుత్వ హయాంలో అగ్నిమాపకశాఖడిజి, సిఐడి ఎడిజిపిగా పనిచేసిన ఎన్ సంజయ్ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇచ్చిన నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం ఎసిబి అధికారులు ఎఫ్ఐఆర్ 05/ఆర్‌సిఓ/సిఐయు/ఎసిబి/2024 కింద కేసు నమోదు చేశారు. ఇందులో ఐపిసి 409, 420, 477ఎ, ఆర్/డబ్ల్యు 120బి, ఇండియన్ పీనల్ కోడ్ 1860 ప్రకారం కేసు నయోదు చేశారు. దీంతో పాటు ప్రివెన్సన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ సెక్షన్ 13(1)(ఎ), ఆర్/డబ్ల్యు 13(2) సెక్షన్ 7 ఆఫ్‌ది ప్రివెన్సన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ -1988 (అమెండ్‌మెంట్ 2018) ప్రకారం కేసు నమోదు చేశారు. ఇటీవల అవినీతి నిరోధక శాఖ చట్టంలోని సెక్షన్ 17ఎ కింద అనుమతి కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఎసిబి అధికారులు లేఖ రాశారు. సిఎస్ అనుమతి లభించిన నేపథ్యంలో సంజయ్‌పై కేసు నమోదైంది. ఇందులో ఎవన్‌గా సంజయ్, ఎ2గా సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ (ప్రసాదంపాడు), ఎ3గా క్రిత్వ్యాప్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ (ద్వారకాపురి కాలనీ, హైదరాబాద్) పై ఎసిబి అధికారులు కేసు నమోదు చేశారు. రూ.1,75,86,600 ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అయినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. అగ్నిమాపక శాఖలో నిరభ్యంతర పత్రాలు (ఎన్‌ఓసి)లు ఆన్‌లైన్‌లో జారీ చేసేందుకు అగ్ని -ఎన్‌ఓసి వెబ్‌సైట్, మొబైల్‌యాప్ అభివృద్ధి, నిర్వహణ, 150 ట్యాబ్‌ల సరఫరా కాంట్రాక్టును సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థకు సంజయ్ అప్పగించారు. ఎలాంటి పనులు జరగకపోయినా రూ.59.93 లక్షలు చెల్లించారు. క్రిత్వ్యాప్ సంస్థలు అసలు సదస్సులు నిర్వహించకపోయినా బిల్లులు చెల్లించారు. సిఐడి తరపున ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ నిరోధక చట్టంపై దళితులు, గిరిజనులకు అవగాహన సదస్సులు కాంట్రాక్టు నిర్వహణను క్రిత్వ్యాప్ టెక్నాలజీస్‌కు రూ.1.19 కోట్లు చెల్లించారు. ఈ మేరకు ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించారని పేర్కొన్నారు.

వినియోగదారుల హక్కుల చట్టంపై అవగాహన తప్పనిసరి : నాదెండ్ల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వినియోగదారుల హక్కుల చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని, ఈ చట్టంపై వినియోగానికి సాంకేతిక పరిజ్ఞానం జోడించాల్సి ఉందని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వినియోగదారుల హక్కుల చట్టంపై మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వినియోగదారులకు హక్కులతో పాటు సౌకర్యాల గురించి అవగాహన తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ఇబ్బందులను గుర్తించి వాట్సాప్ ద్వారా రైతుల నుంచి 22,80,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 48 గంటల్లో నగదు వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. జిల్లాల్లో ఫుడ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ముఖ్యమంత్రితో చర్చించి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఫుడ్ కమిషన్ ఛైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద, బలహీన తరగతులను ఆదుకునేలా వినియోగదారుల చట్టంలో మార్పులను పొందుపరిచామన్నారు. పౌరసరఫరాలశాఖ కమిషనరు వీరపాండియన్ మాట్లాడుతూ.. ప్రతి ఏడాది వినియోగదారుల హక్కులపై అవగాహన కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వినియోగదారుల ఫోరం ఛైర్మన్ చిరంజీవి మాట్లాడుతూ.. వినియోగదారుల హక్కులతోపాటు బాధ్యతలు కూడా తీసుకోవాలన్నారు. రెండున్నరేళ్లలో రూ.7 కోట్ల పరిహారాన్ని అందించామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు, కన్స్యూమర్ వాలంటరీ ఆర్గనైజేషన్ సభ్యులకు మంత్రి అవార్డులు, మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిధి మీనన్, బిఐఎస్ జెడి రమాకాంత్, సివిల్ సప్లైస్ అధికారులు పాపారావు, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పిఎసిఎస్‌లలో రికార్డుల డిజిటలైజేషన్

- 25 లక్షల అకౌంట్లకు ఆధార్‌తో ఇకెవైసి లింక్
- నెలరోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్లకు సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పిఎసిఎస్) ఖాతాదారుల అకౌంట్లన్నీ ప్రభుత్వం డిజిటలైజేషన్ చేయనుంది. ఖాతాదారుల సేవింగ్ అకౌంట్‌తో ఆధార్‌ను లింక్ చేయడంతోపాటు నెలరోజుల సమయంలోగా ఇకెవైసి చేయాలని ప్రభుత్వానికి నాబార్డు సూచించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పిఎసిఎస్‌లలో నమోదైన 25 లక్షల మంది ఆధార్, సేవింగ్ అకౌంట్‌తో లింక్ చేయడంతోపాటు ఇకెవైసి చేయాలని ప్రభుత్వం ఆయా జిల్లాల కలెక్టర్లకు సూచించింది. కంప్యూటరీకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు పిఎసిఎస్ సిబ్బందితో పాటు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని ఉపయోగించుకోవాలని ప్రభుత్వం పేర్కొంది. పిఎసిఎస్ అకౌంట్లతో ఆధార్ మ్యాచ్ కాని వారివి నూతనంగా ఇకెవైసి చేయించాలని, ఇప్పటి వరకు అకౌంట్లు లేని కొత్తవారికి నూతనంగా సేవింగ్ అకౌంట్లు తెరిపించాలని స్పష్టం చేసింది. సరిపోని అకౌంట్ దారుల వివరాలు డాష్‌బోర్డులో పొందుపరచాలని సూచించింది. ఇకెవైసి పనితీరును ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేసేందుకు జిల్లాస్థాయి కమిటీతోపాటు గ్రామ, వార్డు సచివాలయాలశాఖ పర్యవేక్షించాలని పేర్కొంది. ఇకెవైసి డ్రైవ్‌లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు జిల్లా స్థాయి టీమ్‌లు కృషి చేయాలని కో-ఆపరేషన్ కమిషనరు బాబు ఎ పేర్కొన్నారు.

న్యాయం కోసం కోర్టుకెక్కిన షికారీలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల పాపవినాశనంలో వ్యాపారం చేసుకునే షికారీలు న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించారు. ఫారెస్టు, టిటిడి అధికారులు తమ పట్ల వ్యవహరించిన తీరును మానవహక్కుల సంఘం దృష్టికి తీసుకెళ్లినట్లు షికారీలు రమేష్, కందన్ 'ప్రజాశక్తి'కి తెలిపారు. పాపవినాశనంలో గత 75 ఏళ్లుగా చిరు వ్యాపారాలు చేసుకుంటున్న షికారీలపై 'మతముద్ర' వేసి 27 షాపులను రెండు నెలల క్రితం ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. తమకు న్యాయం చేయాలని గత రెండు నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతునే ఉన్నారు. అధికారుల నుంచి స్పందన కరువవడంతో హైకోర్టును, మానవహక్కుల సంఘాన్నీ ఆశ్రయించారు.

హామీలు విస్మరించి కక్షసాధింపు : సజ్జల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన ప్రత్యర్థులపై కక్ష సాధింపుతో టిడిపి కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయిస్తోందని వైసిపి రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. వివిధ కేసుల్లో నిందితుడుగా ఉన్న మాజీ ఎంపి నందిగం సురేష్ ఇటీవల అరెస్టు అయి గుంటూరు జైలులో ఉన్నారు. సురేష్‌తో మంగళవారం సజ్జల ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మాజీ ఎంపి సురేష్‌పై పోలీసులు అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. జైలులో మాజీ ఎంపికి కనీసం నీళ్ల బాటిల్‌ను కూడా అనుమతి ఇవ్వడం లేదన్నారు. 'మీ కంటే బలంగా కొట్టగలిగే శక్తి వైసిపికి ఉంది' అని అన్నారు. చంద్రబాబు వ్యవహారం చూస్తుంటే ఎలా వేధించాలనేది తమకు నేర్పిస్తున్నట్లుగా ఉందని పేర్కొన్నారు. తాము అలాగే తప్పుడు కేసులు పెట్టి ఉంటే 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే చంద్రబాబు జైలుకు వెళ్లి ఉండేవారని పేర్కొన్నారు. ఒకే వ్యక్తిపై రాష్ట్ర వ్యాప్తంగా ఫిర్యాదులు ఇప్పించి అన్ని చోట్ల అరెస్టు చేయడం కొత్త ట్రెండ్‌ను టిడిపి కూటమి ప్రభుత్వం నేర్పిస్తోందన్నారు. భవిష్యత్తులో అధికారంలోకి వస్తే తాము ఎలా వ్యవహరించాలో రాసిపెట్టుకోమని తమకు సూచించినట్టుగా అర్థమవుతోందని పేర్కొన్నారు. రాష్ట్రానికి సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు తన కుటుంబానికి, తన వర్గానికి సంపద పెంచుతున్నారని ఆరోపించారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, వైసిపి నాయకులు నూరిఫాతిమా, డైమండ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి టికెట్లకు అనూహ్య స్పందన

ప్రజాశక్తి - తిరుమల

వైకుంఠ ఏకాదశి శ్రీవారి దర్శన టికెట్లకు ఆన్‌లైన్‌లో అనూహ్య స్పందన లభించింది. పది రోజుల వైకుంఠ ద్వార దర్శనం రూ.300 టికెట్ల కోటా విడుదలైన 25 నిమిషాల వ్యవధిలోనే 1.40 లక్షల టికెట్లను యాత్రికులు బుక్ చేసుకున్నారు. జనవరి 10-19 వరకూ వైకుంఠ ద్వార దర్శనాన్ని టిటిడి కల్పించింది. 10, 11 తేదీల్లో వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజుల్లో 10 వేల చొప్పున, మిగిలిన ఎనిమిది రోజుల్లో రోజుకు 15 వేల టికెట్లను టిటిడి విడుదల చేసింది. టికెట్ల కోసం 14 లక్షల హిట్స్ వచ్చినట్లు టిటిడి పేర్కొంది.

పోరాటాలతోనే పార్టీ విస్తరణ

- మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడాలి : వి శ్రీనివాసరావు
- ముగిసిన సిపిఎం అనంతపురం జిల్లా 14వ మహాసభ

మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

ప్రజా సమస్యలపై పోరాటాలు సాగిస్తూనే పార్టీ విస్తరణకు కృషి చేయాలని సిపిఎం నాయకులు, కార్యకర్తలకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అనంతపురంలోని ఎస్ఎస్.ఫంక్షన్ హాలులో రెండు రోజులుగా జరిగిన సిపిఎం అనంతపురం జిల్లా మహాసభ మంగళవారం సాయంత్రం ముగిసింది. ఆఖరి రోజు మహాసభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు పరిశీలకులుగా హాజరయ్యారు. రెండు రోజులుగా వివిధ అంశాలపై జరిగిన చర్చలను వారు నిశితంగా పరిశీలించారు. గడిచిన మూడేళ్లలో పార్టీ చేపట్టిన కార్యక్రమాలు, విజయాలపై మహాసభలో చర్చ జరిగింది. అనంతరం భవిష్యత్తు కార్యాచరణ రూపొందించారు. పలు అంశాలపై తీర్మానాలు చేశారు. రైతాంగ, సాగునీటి సమస్యలపైనా ప్రధాన దృష్టి సారించాలని ఈ మహాసభలో నిర్ణయించారు. రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు దిశానిర్దేశం చేశారు. మోడీ పాలనలో దేశంలో మతతత్వ ప్రమాదం మరింతగా ముంచుకొస్తోందన్నారు. ఇది మన రాష్ట్రంలోనూ విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మత, విభజన రాజకీయాలను తిప్పికొట్టి మతాలకతీతంగా విశాల ఐక్యతను తీసుకొచ్చే కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో చేపట్టాలని సూచించారు. స్థానిక సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. టిడిపి కూటమి నేతలు గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రూ అప్ పేరుతో విద్యుత్ భారాలను అధికంగా వేసిందని తెలిపారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలను పోరాటానికి సన్నద్ధం చేయాలని సూచించారు. వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గడిచిన మూడేళ్లలో జిల్లాలో సిపిఎం అనేక కార్యక్రమాలు చేపట్టిందని, ప్రజాసంఘాలను ఏర్పాటు చేసుకుని వీటిని మరింత ముందుకెళ్లాల్సిన అవసరముందని అన్నారు. అనంతరం 26 మందితో సిపిఎం జిల్లా నూతన కమిటీ, తొమ్మిదిమందితో కార్యదర్శివర్గం ఎన్నికైంది.

సీనియర్లకు సన్మానం

మహాసభలో సిపిఎం సీనియర్ నాయకులను సన్మానించారు. పామిడికి చెందిన సిపిఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డిని వి.శ్రీనివాసరావు, గార్లదిన్నెకు చెందిన నాగమ్మను వై.వెంకటేశ్వరరావు శాలువ కప్పి సన్మానించి వారు చేసిన ప్రజా పోరాటాలను కొనియాడారు.

ప్రతి కిలోమీటరుకు అండర్ పాస్

- రాజధానిలో రహదారులను పరిశీలించిన కేంద్ర మంత్రి పెమ్మసాని

బైపాస్ రహదారి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పెమ్మసాని చంద్ర శేఖర్, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి-తుళ్లూరు (గుంటూరు జిల్లా)

గత ప్రభుత్వ విధానాల వల్ల రాజధానికి అనుసంధానంగా ఉన్న విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు నిర్మాణంలో మరింత జాప్యం జరిగే పరిస్థితులు ఏర్పడ్డాయని కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు పనుల పురోగతిని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌తో కలిసి మంగళవారం తుళ్లూరు మండలం వెంకటపాలెం వద్ద ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...విజయవాడ బైపాస్ పనులకు సంబంధించి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధన ప్రకారం ప్రతి రెండు కిలోమీటర్లకు అండర్ పాస్ మార్గాలు వేయాల్సి ఉండగా, అమరావతి మహానగర నిర్మాణం జరుగుతున్నందున్న ప్రజా రవాణా సౌకర్యార్థం ప్రతి ఒక కిలోమీటర్‌కు ఒక అండర్‌పాస్ ఉండేలా 2014-19 మధ్యలో టిడిపి ప్రభుత్వం నేషనల్ హైవే నుంచి అనుమతులు పొందిందని చెప్పారు. అంతర్గత రహదారులకు కనెక్టివిటీ బాగుండే విధంగా, ప్రజా రవాణా సౌకర్యం కోసం ప్రతి కిలోమీటర్‌కు ఒక అండర్ పాస్ ఉండాలని టిడిపి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, సిఆర్‌డిఎ అదనపు కమిషనర్ జి సూర్య సాయి ప్రవీణ్ చంద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యాక్టిస్ ఫార్మాలో కార్మికునికి గాయం

- వరుస ప్రమాదాలతో భయాందోళనలు

ప్రజాశక్తి - పరవాడ (అనకాపల్లి)

అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలోని రాంకీ ఫార్మా సిటీలో రక్షిత్ ఫార్మా కంపెనీలో విషవాయువు లీకై ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురైన ఘటన మరువకముందే మంగళవారం మరో ప్రమాదం చోటుచేసుకుంది. యాక్టిస్ జనరిక్ ఫార్మాలో విధి నిర్వహణలో ఉన్న మణిశంకర్ (29) కంటిలో మెటల్ పడింది. దీంతో ఆయనను విశాఖ ఎల్‌వి ప్రసాద్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఆగస్టు నుంచి ఫార్మాలో వరుసగా చోటుచేసుకుంటున్న ప్రమాదాలతో కార్మికులు భయాందోళనకు గురవుతున్నారు. తాజా ఘటనలపై ఫార్మా సిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. ఫార్మా పరిశ్రమల్లో జరుగుతున్న వరుస ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలన్నారు. తాజా ప్రమాదాల వివరాలను ఆయన వెల్లడించారు. ఠాగూర్ లేబొరేటరీ, విజయ శ్రీ ఫార్మా, స్మైల్ ఎక్స్ ఫార్మా, ఆల్కలీ మెటల్ ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాలు చోటుచేసుకుని ఇటీవల కార్మికులు మృతిచెందారని, పలువురు గాయపడ్డారని తెలిపారు. యాజమాన్యాల నిర్లక్ష్యం వల్ల కార్మికుల ప్రాణాలు గాలిల్లో కలిసిపోతున్నాయన్నారు. ప్రమాదాలను అరికట్టడానికి ప్రభుత్వం నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైఎస్ఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ముఖ్యమంత్రి జగన్

ఇడుపులపాయలో క్రిస్మస్ ప్రార్థనలు

- వేడుకల్లో పాల్గొన్న మాజీ సిఎం

ప్రజాశక్తి - వేంపల్లె

వైఎస్ఆర్ జిల్లా ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో జరిగిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి తన బంధువులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ వేడుకల సందర్భంగా జిల్లాలో నాలుగు రోజుల పర్యటన కోసం మంగళవారం బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రానికి ఆయన చేరుకున్నారు. తండ్రి సమాధి వద్ద నివాళులర్పించిన అనంతరం ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న ఓపెన్ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. విజయమ్మకు జగన్ ఎదురుపడడంతో అక్కున చేర్చుకొని ఆమె ఆశీర్వదించారు. ప్రార్థనలు అనంతరం విజయమ్మ, తన సతీమణి భారతి, బంధువులతో కలిసి జగన్ విందు భోజనం చేశారు. అనంతరం కడప వైసిపి నాయకులతో సమావేశమయ్యారు. ముందస్తు క్రిస్మస్ ప్రార్థనల్లో కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి, సుధీకర్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రమేష్ యాదవ్, రామచంద్రారెడ్డి, నాయకులు మల్లికార్జునరెడ్డి, సతీష్‌రెడ్డితో పాటు వైఎస్ఆర్ బంధువులు, వైసిపి నేతలు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు తదితరులు

మొండి వైఖరి ఆమోదయోగ్యం కాదు

- పేపర్‌మిల్లు యాజమాన్యంపై మంత్రి దుర్గేష్ ఆగ్రహం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

పేపరు మిల్లు యాజమాన్యం మొండి వైఖరి ఆమోదయోగ్యం కాదని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కార్మిక శాఖ జాయింట్ లేబర్ కమిషనర్ అధ్వర్యంలో కలెక్టర్ ప్రశాంతి అధ్యక్షతన పేపరు మిల్లు యాజమాన్యం, 2020, 2023 వేతన సవరణ విషయంపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని మాట్లాడారు. నాలుగు నెలలు క్రితం నిర్వహించిన సమావేశంలో ఆమోదయోగ్యమైన పరిష్కారం లభించే విధంగా వేతన సవరణ చేస్తామని పేపరు మిల్లు యాజమాన్యం హామీ ఇచ్చిందని, కాని అమలు చేయలేదన్నారు. పేపరు మిల్లు యాజమాన్యం కార్మికుల సంక్షేమాన్ని పరిరక్షించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ.. యాజమాన్యం తీరు అసంతృప్తికరంగా ఉందని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను పేపరుమిల్లు యాజమాన్యం పాటించడం లేదన్నారు. నగరపాలక సంస్థకు బకాయి పడ్డ మొత్తాన్ని చెల్లించాలని కోరారు. రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ.. ప్రతి మూడేళ్లకు ఒకసారి వేతన సవరణ చేయాల్సి ఉన్నా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేపరు మిల్లు ఉపయోగించే గోదావరి నీటి వినియోగంపై కూడా ఆడిటింగ్ చేయాలని సూచించారు. రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ పేపరు మిల్లు యాజమాన్యం నిబంధనలు ఉల్లంఘించడంపై విచారణ చేపట్టాలన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ... విభజించు పాలించు తరహాలో పేపర్ మిల్లు యాజమాన్యం వ్యవహరిస్తోందన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్ మాట్లాడుతూ.. కార్మికుల వేతనాల విషయంలో యాజమాన్యం వైఖరి సరైంది కాదని తెలిపారు. తక్షణమే గత వేతన ఒప్పందం రూ.తొమ్మిది వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏడేళ్లుగా వేతన ఒప్పందం చేయలేదని, ఈ ఏడేళ్ల కాలంలో రూ.1,500 కోట్ల ఆదాయం యాజమాన్యం ఆర్జించిందన్నారు. సమ్మె అనంతరం యాజమాన్యం రాతపూర్వక హామీ ఇచ్చిందని, ఆరు నెలలుగా అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని తెలిపారు. కార్మికుల వేతనాలపై తప్పుడు ప్రచారానికి పాల్పడుతోందన్నారు. ఇటువంటి వైఖరి సరైంది కాదన్నారు. ఈ విషయమై మంత్రి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు సిఎంను కలిసి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, రాజమహేంద్రవరం కమిషనర్ కేతన్‌గార్గ్, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, పేపర్ మిల్లు అసోసియేట్ డైరెక్టర్ అక్కినేని జయకృష్ణ, పేపరుమిల్లు మేనేజర్ బాగ్లే, కార్మిక సంఘాల నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, ఎ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంటలోపు దర్శనంపై అధ్యయనం

- యాత్రికుల నుంచి ఫీడ్‌బ్యాకుకు ఏర్పాటు
- స్విమ్స్ జాతీయ హోదాకు సిఫార్సు
- టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు వెల్లడి

పాలకమండలి నిర్ణయాలను వెల్లడిస్తున్న టిటిడి బోర్డు ఛైర్మన్ బిఆర్ నాయుడు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

యాత్రికులకు గంటలోపు శ్రీవారి దర్శనం అయ్యేలా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ ద్వారా అధ్యయనం చేస్తున్నామని టిటిడి బోర్డు ఛైర్మన్ బిఆర్ నాయుడు వెల్లడించారు. యాత్రికుల నుంచి టిటిడి సేవలపై ఫీడ్‌బ్యాక్ మేనేజ్‌మెంట్ సిస్టం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తిరుమల అన్నమయ్య భవన్‌లో టిటిడి ఛైర్మన్ అధ్యక్షతన 68 అజెండాలపై సుదీర్ఘంగా చర్చించి, నిర్ణయాలు చేశారు. అనంతరం మీడియాతో ఛైర్మన్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు టిటిడి ఆలయాలు, ఆస్తుల గ్లోబల్ ఎక్స్‌పాన్షన్‌కు అవసరమైన సూచనల కోసం నిపుణుల కమిటీ ఏర్పాటుకు ఆమోదముద్ర లభించిందన్నారు. దేశంలో వివిధ ప్రాంతాల్లో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాలను ఏర్పాటు చేసేందుకు కమిటీలను ఏర్పాటు చేశామని చెప్పారు. స్విమ్స్ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు జాతీయ హోదా కోసం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని తెలిపారు.

కాలినడకన వచ్చే యాత్రికులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అత్యాధునిక వైద్యం అందుబాటులో ఉంచామన్నారు. తిరుమలలోని బిగ్ , జనతా క్యాంటీన్ల నిర్వహణ, మరింత నాణ్యతగా ఆహార పదార్థాలు తయారు చేసేందుకు దేశంలోని ప్రముఖ సంస్థలకు క్యాంటీన్ల నిర్వహణ లైసెన్సుల జారీలో నూతన విధానం అమలుకు ఆమోదం పొందామని తెలిపారు. తిరుమల అన్నప్రసాద విభాగంలో మరింత నాణ్యతగా అన్నప్రసాదాలు అందించేందుకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన వివిధ విభాగాలలో 258 మంది సిబ్బందిని తీసుకునేందుకు ఆమోదం లభించిందని చెప్పారు. కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహిస్తోన్న సంప్రదాయ పాఠశాలకు ఎస్‌వి విద్యాదాన ట్రస్టు నుంచి రూ.రెండు కోట్లు ఆర్థిక సాయం ఇవ్వనున్నామని చెప్పారు. శ్రీవారి దర్శనానికి విచ్చేసే యాత్రికుల ఆరోగ్యం దృష్ట్యా ఆహార పదార్థాలను తనిఖీ చేసేందుకు టిటిడిలో ఫుడ్ సేఫ్టీ విభాగం ఏర్పాటుతో పాటు అందుకు అనుగుణంగా సీనియర్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పోస్టును ఎస్‌ఎల్‌ఎస్‌ఎంపిసి కార్పొరేషన్ ద్వారా భర్తీ చేయనున్నామని తెలిపారు. శ్రీవారి దర్శనానికి సర్వదర్శనం క్యూలైన్లలో వేచి ఉండే యాత్రికుల సౌకర్యార్థం రూ.3.36 కోట్లతో ఆరు టాయిలెట్ బ్లాకులను నిర్మించనున్నామన్నారు. ఒంటిమిట్ట కోదండ రామాలయంలో విమాన గోపురానికి రూ.43 లక్షలతో బంగారు కలశం ఏర్పాటు చేయనున్నామని, ముంబయిలో శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ నిర్మాణానికి స్థానిక సిడ్కో కేటాయించిన 3.60 ఎకరాల స్థలానికి నిర్ణయించిన రూ.20 కోట్లకు పైగా ఉన్న లీజు ధరను తగ్గించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయనున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి, జెఇఒలు గౌతమి, వీరబ్రహ్మం, సివిఎస్‌ఒ శ్రీధర్ పాల్గొన్నారు.

ఆగని రూపాయి పతనం

- డాలర్‌తో 85.20కు క్షీణత

ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ పతనం కొనసాగుతోంది. మంగళవారం అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ 9 పైసలు క్షీణించి 85.20 కనిష్ట స్థాయికి దిగజారింది. ఇది రూపాయి చరిత్రలోనే అత్యంత పేలవ విలువ. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో రూపాయి విలువ 85.10 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 85.21 కనిష్ట స్థాయిని తాకి.. తుదకు 85.20 స్థాయిలో ముగిసింది. దేశ ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకుంటున్న అత్యంత బలహీనమైన గణంకాలు, స్టాక్ మార్కెట్ల వరుస పతనం, విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోవడం, ఎగుమతుల పతనం, వాణిజ్య లోటు పెరగడం తదితర పరిణామాలు రూపాయి విలువను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తోన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. రూపాయి విలువ పడిపోవడంతో దిగుమతులు భారం కావడంతో పాటు విదేశీ అప్పులపై అధికంగా చెల్లింపులు చేయాల్సి వస్తుంది. ఇప్పటికే భారత ఆర్థిక వ్యవస్థలో ప్రమాదకర ఘంటికలు మోగుతోన్న వేళ.. రూపాయి పతనం మరిన్ని చిక్కులను తెచ్చిపెట్టనుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పదేళ్లలో 39 రెట్లు పెరిగిన డిమ్యాట్ ఖాతాలు

న్యూఢిల్లీ : దేశీయ స్టాక్ మార్కెట్లు, మ్యూచువల్ పండ్స్‌ల్లో పెట్టుబడులపై ఇన్వెస్టర్లలో ఆసక్తి పెరుగుతోంది. ఈ క్రమంలోనే గడిచిన పదేళ్లలో డిమ్యాట్ ఖాతాల సంఖ్య 39 రెట్లు పెరిగిందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఓ నివేదికలో తెలిపింది. 2024 అక్టోబర్ నాటికి డిమ్యాట్ ఖాతాలు 17.76 కోట్లకు చేరాయి. ఈ ఏడాదిలో కొత్త డీమ్యాట్ ఖాతాల సంఖ్య నాలుగు కోట్లు దాటొచ్చని ఎస్‌బిఐ అంచనా వేసింది. 2021 ఏడాది నుంచి ఏటా దాదాపు మూడు కోట్లకు పైగానే కొత్త డిమ్యాట్ ఖాతాలు తెరువబడుతున్నాయి. 2024 మార్చి ముగింపు నాటికి ఈ సంఖ్య 15.02 కోట్లుగా ఉంది. ప్రతీ నలుగురిలో ఒక్క మహిళా ఇన్వెస్టర్ ఉన్నారు. మార్కెట్‌లో ఇన్వెస్టర్ల సంఖ్య పెరగడంతో 2013-14 ఆర్థిక సంవత్సరం నుంచి నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ మార్కెట్ క్యాపిటల్ ఆరు రెట్లు పెరిగింది. 2013-24లో ఎన్ఎస్ఇ మార్కెట్ క్యాపిటల్ రూ.73,000 కోట్లు కాగా.. 2024-25 నాటికి అది రూ.441 లక్షల కోట్లకు పెరిగింది. 2013-14లో ప్రతి పెట్టుబడిదారుడు సగటున రూ.19,460 పెట్టుబడి పెట్టగా.. ఇప్పుడు అది 2024-25లో రూ.30,742కి ఎగిసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు మొత్తం 4.85 కోట్ల కొత్త సిప్ ఖాతాలు తెరవగా.. 2017-18లో వారి సంఖ్య 1.16 కోట్లుగా ఉంది.

ఏడాదిలో ఎంఎఫ్ ఆస్తులు 35 శాతం వృద్ధి

మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల్లో భారీ వృద్ధి చోటు చేసుకుంది. 2024 నవంబర్ నాటికి ఈ పరిశ్రమ అసెట్ అండర్ మేనేజ్‌మెంట్ (ఎయుఎం) రూ.68.08 లక్షల కోట్లకు చేరింది. 2023 ముగింపు నాటికి రూ.50.24 లక్షల కోట్లుగా ఉంది. దీంతో పోల్చితే 35.5 శాతం వృద్ధి నమోదయ్యింది. 2024లో కొత్తగా 174 ఎపెన్ ఎండెడ్ స్కీమ్స్ నమోదయ్యాయి. జనవరిలో మొత్తంగా 1,378 స్కీమ్స్ ఉండగా..నవంబర్ ముగింపు నాటికి 1,552 స్కీమ్స్‌కు చేరాయి.

బజాజ్ ఫిన్‌సర్వ్ నుంచి ఇఎల్‌ఎస్‌ఎస్ టాక్స్ సేవర్ ఫండ్

న్యూఢిల్లీ : బజాజ్ ఫిన్‌సర్వ్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా బజాజ్ ఫిన్‌సర్వ్ ఇఎల్‌ఎస్‌ఎస్ టాక్స్ సేవర్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ ఒపెన్ ఎండెడ్ ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్‌లో సెక్షన్80సి కింద ఆదాయపు పన్ను ఆదాను పొందవచ్చని తెలిపింది. ఈ కొత్త ఫండ్ సబ్‌స్క్రిప్షన్ తెరిచామని.. జనవరి 22తో ముగియనుందని ఆ సంస్థ పేర్కొంది. దీంతో పన్ను ఆదా, సంపదను పోగు చేసుకోవడానికి వీలు కల్పిస్తుందని పేర్కొంది. ఇందులో కనీస పెట్టుబడి రూ.500గా నిర్ణయించింది.

దీక్షల్లో కూర్చున్న ఉక్కు కార్మికులు

ఉక్కు కార్మికులకు జీతాలు చెల్లించకపోవడం దారుణం

ప్రజాశక్తి - ఉక్కు నగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ కార్మికులకు మూడు నెలలుగా పూర్తి జీతాలు చెల్లించకపోవడం దారుణమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కెఎం శ్రీనివాస్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1412వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ కొద్ది నెలలుగా జీతాలు ఇవ్వకపోయినప్పటికీ కార్మికులు అకుంఠిత దీక్షతో స్టీల్‌ప్లాంట్‌ను లాభాల బాటలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. జీతాలు ఇవ్వకుంటే కార్మికులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. కార్మికులను అర్థాకలితో అలమటింపజేస్తున్న స్టీల్‌ప్లాంట్ యాజమాన్య వైఖరిని ఖండించారు. పోరాట కమిటీ ఛైర్మన్ డి ఆదినారాయణ, నాయకులు వి.రమణ, డిసిహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తిని తగ్గించి కర్మాగారాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు. దానికి వ్యతిరేకంగా సుదీర్ఘకాలంగా పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులు ఉద్యమిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో వారిని ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తూ ప్రభుత్వం పలు చర్యలకు దిగుతోందన్నారు. ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

డెడ్‌బాడీ పంపడం వెనుక ఆంతర్యమేమిటి?

- రహస్య ప్రదేశంలో శ్రీధర్‌వర్మ విచారణ..!

ప్రజాశక్తి - కాళ్ల, ఉండి

డెడ్‌బాడీ డోర్ డెలివరీ కేసులో ప్రధాన నిందితుడు తిరుమాని శ్రీధర్‌వర్మను పోలీసులు అదుపులోకి తీసుకొని పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఓ రహస్య ప్రాంతానికి తరలించి విచారిస్తున్నట్లు సమాచారం. కృష్ణా జిల్లా బంటుమిల్లి ప్రాంతంలో పోలీసులకు పట్టుబడిన శ్రీధర్‌వర్మను మంగళవారం ఉదయమే భీమవరం తీసుకొచ్చారు. అక్కడి నుంచి రహస్య ప్రాంతానికి తరలించి విచారిస్తున్నారు. ప్రధానంగా డెడ్‌బాడీ డోర్ డెలివరీ కేసులో శ్రీధర్‌వర్మ పాత్ర, డెడ్‌బాడీ ఎవరిది, డెడ్‌బాడీ పంపడం వెనుక ఆంతర్యం, డెడ్‌బాడీ వచ్చాక ఎందుకు పరారయ్యారు, ఎక్కడెక్కడ తిరిగారు, డెడ్‌బాడీ పార్శిల్ పెట్టెను ఆటోడ్రైవర్‌కు అప్పగించిన మహిళ ఎవరా, మూడు పెళ్లిళ్ల వ్యవహారం తదితర అంశాలపై ప్రశ్నించడంతో పాటు ఆధారాలు సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమైనట్లు సమాచారం. బర్రె పర్లయ్యను హత్య చేయడానికి సహకరించిందెవరూ తదితర అంశాలపై ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. దీనిపై పోలీసు అధికారులు ఎవరూ నోరు మెదపడం లేదు. గురు, శుక్రవారాల్లో ప్రధాన అనుమానితుడు శ్రీధర్‌వర్మను కోర్టులో హాజరుపర్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

నిందితులను కఠినంగా శిక్షించాలి

బర్రె పర్లయ్యను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మృతుని సోదరుడు బర్రె నరసింహస్వామి డిమాండ్ చేశారు. పర్లయ్య ఎవరికీ ఎటువంటి హాని చేసేవాడు కాదని, మద్యానికి బానిసై ఎవ్వరు ఏ పని చెబితే ఆ పని చేసి ఆ రోజు గడిపేవాడని తెలిపారు.

సెబీ చీఫ్‌కు లోక్‌పాల్ నోటీసులు

న్యూఢిల్లీ : సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ బోర్డు ఇండియా (సెబీ) ఛైర్‌పర్సన్ మాధాబి పూరీ బుచ్‌ను అవినీతి నిరోధక దర్యాప్తు సంస్థ లోక్‌పాల్ విచారణకు హాజరు కావాలని ఆదేశించింది.

మాధాబితో పాటు తృణమూల్ కాంగ్రెస్ ఎంపి మహువా మొయిత్రాతోపాటు ఫిర్యాదు దారులు హాజరు కావాలని స్పష్టం చేసింది. మాధాబి పరస్పర విరుద్ధ ప్రయోజనాలు, అక్రమాలకు పాల్పడుతున్నారన్న అమెరికా షార్ట్ షెల్లింగ్ కంపెనీ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణల నేపథ్యంలో లోక్ పాల్ విచారణకు ఆదేశించింది. జనవరి 28న విచారణకు రావాలని ఆదేశించింది. మాధాబి అక్రమాలపై మహువాతో పాటు మరో ఇద్దరు లోక్‌పాల్‌కు ఫిర్యాదు చేశారు.

ఫారం A
బహిరంగ ప్రకటన
(ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఇన్‌సాల్వెన్సీ రీజొల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పొరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్, 2016 యొక్క రెగ్యులేషన్ 6 క్రింద)

యునైటెడ్ స్టీల్ బిల్డింగ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌యొక్క రుణదాతలు శ్రద్ధ వహించుటకు

సంబంధిత వివరాలు		
1.	కార్పొరేట్ రుణగ్రహీత పేరు	యునైటెడ్ స్టీల్ బిల్డింగ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్
2.	కార్పొరేట్ రుణగ్రహీత యొక్క విలీనం తేది	29/07/2009
3.	కార్పొరేట్ రుణగ్రహీత అధికారం క్రింద విలీనం/ నమోదు చేయబడింది	ఆర్‌ఓసి చెన్నై
4.	కార్పొరేట్ రుణగ్రహీత యొక్క కార్పొరేట్ గుర్తింపు నంబర్/లిమిటెడ్ లయబిలిటీ గుర్తింపు నంబర్	U28111TN2009PTC072418
5.	కార్పొరేట్ రుణగ్రత యొక్క నమోదిత కార్యాలయం మరియు ప్రధాన కార్యాలయం (ఏదైనా) చిరునామా	న్యూ నెం.4, (ఓల్డ్ నెం.9) ఫ్లాట్ నెం.ఏ, బిగ్ స్ట్రీట్ కిల్‌పాక్ గార్డెన్ కాలనీ, కిల్‌పాక్ చెన్నై, తమిళనాడు - 600010
6.	కార్పొరేట్ రుణగ్రతకి సంబంధించి దివాలా ప్రారంభమైన తేది	18.12.2024 (21.12.2024న వెబ్‌సైట్‌లో ఆర్డర్ కాపీ అప్‌లోడ్ చేయబడింది)
7.	దివాలా తీర్మానం ప్రక్రియ మూసివేసే అంచనా తేది	16.06.2025
8.	వృత్తిసంబంధమైన తీర్మానం మధ్యంతరంగా వ్యవహరించే వృత్తిసంబంధమైన దివాలా పేరు మరియు నమోదు సంఖ్య	రమేల రంగసామి IBBI/IPA-002/IP-N00506/2017-2018/11700
9.	బోర్డ్‌తో నమోదుకాబడిన మధ్యంతర వృత్తిసంబంధమైన తీర్మానం చిరునామా మరియు ఇ-మెయిల్	ఏ6, ఆర్య హార్మోనీ అపార్ట్‌మెంట్, పోలీస్ కందసామి స్ట్రీట్, ఒలింపస్, రామనాథపురం, కోయంబత్తూరు, తమిళనాడు-641045 Emal: rum_jai@yahoo.com
10.	మధ్యంతర వృత్తిసంబంధమైన తీర్మానంతో ఉత్తర ప్రత్యుత్తరాలకు ఉపయోగించుటకు చిరునామా మరియు ఇ-మెయిల్	ఏఏఏ హౌస్, 64, ఓఖ్లా ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఓఖ్లా ఫేజ్ 3, మోడీ మిల్ దగ్గర, న్యూఢిల్లీ-110020 Email: unitedsteelbuilding.ibc@gmail.com
11.	దావాలు దాఖలు చేయుటకు చివరి తేది	04.01.2025
12.	రుణదాతల తరగతులు, ఏవైనా, మధ్యంతర తీర్మానం వృత్తిసంబంధమైన వాటి ద్వారా తెలిసినవి, సెక్షన్ 21 యొక్క సబ్-సెక్షన్ (6ఎ) యొక్క క్లాజ్ (బి) క్రింద	వర్తించదు
13.	క్లాస్‌లో రుణదాతల అధీకృత ప్రతినిధిగా వ్యవహరించి దివాలా నిపుణులుగా గుర్తించిన పేర్లు (ప్రతి తరగతి కొరకు మూడు పేర్లు)	వర్తించదు
14.	(ఎ) సంబంధిత ఫారాలు మరియు (బి) అధీకృత ప్రతినిధులు వద్ద అందుబాటులో ఉండే వివరాలు :	వెబ్‌లింక్: https://ibbi.gov.in/home/downloads వర్తించదు

ప్రకటన ఇవ్వడమేమనగా **18.12.2024**న **"యునైటెడ్ స్టీల్ బిల్డింగ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్"** యొక్క కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిజల్యూషన్ ప్రాసెస్ ప్రారంభమైనదిగా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, చెన్నై డివిజన్ బెంచ్ కోర్టు ఆదేశించింది. (21.12.2024న వెబ్‌సైట్‌లో ఆర్డర్ కాపీ అప్‌లోడ్ చేయబడింది).

యునైటెడ్ స్టీల్ బిల్డింగ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క క్రెడిటర్లను రుజువులతో వారి క్లెయింలను **04.01.2025**న లేదా ముందుగా ఎంట్రీ నెం.10లో పేర్కొన్న చిరునామాలో ఇంటిరిమ్ రిజల్యూషన్ ప్రొఫెషనల్‌కు దాఖలుచేయవలెనని తెలియజేయడమైనది.

ఫైనాన్షియల్ క్రెడిటర్లు రుజువులతో వారి క్లెయింలను ఎలక్ట్రానిక్ విధానం ద్వారా మాత్రమే దాఖలుచేయాలి. అందరు ఇతర క్రెడిటర్లు రుజువులతోవారి క్లెయింలను నేరుగా, పోస్టుద్వారా లేదాఎలక్ట్రానిక్ విధానం ద్వారా దాఖలుచేయాలి.

తప్పుడు లేదా తప్పుత్రోవ పట్టించు క్లెయిం దాఖలుచేయుట జరిమానాలు విధించబడతాయి.

సం/-
రమేల రంగసామి
ఇంటిరిమ్ రిజల్యూషన్ ప్రొఫెషనల్
Reg. No.: IBBI/IPA-002/IP-N00506/2017-2018/11700
ఏఎఫ్ఏ 31.12.2025 వరకు చెల్లుబాటు

తేది: 24-12-2024
ప్రదేశం: చెన్నై

సంపాదకీయం

వెండితెరకు వెలుగు

మట్టి మనుషుల జీవిత గాథలతో వెండితెరకు కొత్త సొబగులు అద్దిన శ్యామ్ బెనెగల్ మరణంతో భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ఒక అధ్యాయం ముగిసింది. కమర్షియల్ హంగులతో ఆకాశపు హద్దులు దాటే బాలీవుడ్ చిత్రాలను నేలకు దించి సామాన్యుల చెంత నిలపడమే కాకుండా, వారి జీవితాలనే వెండి తెరకు నిలువెత్తు కాన్వాస్‌గా మలచిన ఘనత శ్యామ్ బెనెగల్‌ది! అంకుర్, నిశాంత్, మంథన్, భూమిక, సుస్మన్, మండి...ఇలా చెప్పుకుంటూ పోతే సామాన్యుడికి పట్టం కట్టిన ఆయన సినిమాలు ఎన్నో! శ్యామ్ పూర్తి పేరు బెనెగళ్ల శ్యామసుందర రావు. కర్ణాటకకు చెందిన ఆయన తండ్రి బెనెగళ్ల శ్రీధర్ హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. అలా తెలుగువాడైన శ్యామ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఎకనామిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందారు. చిన్నతనం నుండి ఆయన సినిమాల మీద, సామాజిక సమస్యల మీద ఆసక్తి చూపేవారు. సినీ రంగ ప్రవేశం తరువాత కూడా ఆయన సామాజిక సమస్యలనే తన కథా వస్తువులుగా మార్చుకున్నారు. జిలుగు వెలుగుల బాలీవుడ్ మాయాజాలానికి కొత్త గ్రామర్ నేర్పారు. మానవ సంబంధాల గాథలతో వెండితెరకు కొత్త గ్లామర్‌ను జోడించారు. అందుకే ఆయన సినిమాలు సామాజిక వివక్షలో కూరుకుపోయిన నిస్సహాయులకు గొంతుగా మారాయి. వాటిలో తెలంగాణ ఆత్మ కనిపించింది. అవి గుజరాత్ రైతుల గౌరవ పోరాట వేదికలయ్యాయి. మహిళల, దళితులతోపాటు ఎందరో బాధా సర్ప ద్రష్టల గాథలకు దృశ్యరూపమయ్యాయి. వెరసి అసలు, సిసలు భారతీయతను ఆవిష్కరించాయి.

ఫ్రెంచ్, ఇటాలియన్ నియో రియలిస్టిక్ సినిమాలతో స్ఫూర్తి పొందిన శ్యామ్ బెనెగల్ భారతీయ గ్రామీణ జీవితాన్ని తన సినిమా సృజనకు ఆలంబన చేసుకున్నారు. అప్పటివరకు దృశ్యరూపం ఇవ్వడానికి ఎవరూ సాహసించని ఫ్యూడల్ వ్యవస్థ వికృత రూపాన్ని, నిర్బంధ వెట్టి చాకిరీని, కులరక్కసి వికృత కోరలను తనదైన శైలిలో శ్యామ్ సినిమాలుగా తీయడం కలకలం రేపింది. ఒక్కసారిగా సామాజిక వాస్తవికతను చర్చనీయాంశం చేసింది. అంకుర్ (1974) చిత్రం ద్వారా షబానా అజ్మీని ఆయన వెండితెరకు పరిచయం చేశారు. తెలంగాణలోని ఫ్యూడల్ పరిస్థితులు, దోపిడిపై తీసిన చిత్రమిది. సినిమా చిత్రీకరణ కూడా తెలంగాణ జిల్లాలోనే ఎక్కువ భాగం సాగింది. ఈ సినిమా జాతీయ ఉత్తమ ద్వితీయ చిత్రంగా ఎంపికైంది. షబానా అజ్మీకి ఉత్తమ నటి పురస్కారం దక్కింది. ఇలా అనంత్ నాగ్, నసీరుద్దీన్ షా, స్మితా పాటిల్, ఓంపురి, కుల్‌భూషణ్ ఖర్బందా, అమ్రీష్ పురి వంటి నటులను కూడా ఆయన తీర్చిదిద్దారు.

గుజరాత్‌లో పాడి పరిశ్రమ అభివృద్ధి చెందిన తీరు గురించి తీసిన సినిమా మంథన్ (1976). ఈ చిత్ర కథ విన్న గుజరాత్ రైతులు దాదాపు ఐదు లక్షల మంది తలో రెండు రూపాయల వంతున ఈ సినిమాకు పెట్టుబడి పెట్టారు. అలా అంతమంది రైతుల ప్రత్యక్ష భాగస్వామ్యంతో రూపుదిద్దుకున్న సినిమా బహుశా ఇదొక్కటే కావచ్చు. భూమిక చిత్రంలో మహిళ యొక్క అంతర్గత కల్లోలాన్ని అనితరసాధ్యమన్న రీతిలో శ్యామ్ బెనెగల్ తెరకెక్కించారు. స్మితా పాటిల్‌కు ఈ చిత్రం ద్వారా తొలిసారి జాతీయ అవార్డు లభించింది. సుభాష్ చంద్రబోస్ గురించి 2005లో, బంగ్లాదేశ్ తొలి అధ్యక్షుడు షేక్ ముజిబుర్ రెహ్మాన్ గురించి 2023లో తీసిన సినిమాలు కూడా విమర్శకుల ప్రశంసలు పొందాయి. అదే ఆయన చివరి సినిమా! ఇలా 1970లలో ఆయన చేసిన సినీరంగ ప్రవేశం భారతీయ చలనచిత్ర చరిత్రలో కొత్త అధ్యాయాన్ని నెలకొల్పింది. అప్పటి నుండి సోమవారం సాయంత్రం కన్ను మూసేంత వరకు ఆయనది అదే ఒరవడి. తనకు 90 ఏళ్లు వచ్చాయని, ఆరోగ్యంగానే ఉన్నానని, శరీరం, మనసు సహకరించినంత కాలం సినిమాలు తీయాలన్నదే తన కోరికని ఈ నెల 14వ తేదీన తన పుట్టినరోజు సందర్భంగా ఆయన చెప్పారు. ఈ మాటలు చెప్పి పది రోజులు గడవకుండానే మన మధ్య లేకుండా పోవడం బాధాకరం! అవినీతి, సనాతన ధర్మం, ఆధునికత, మహిళా విముక్తి తదితర అంశాలను తన రచనలు, సినిమాల ద్వారా శ్యామ్ బెనెగల్ చర్చకు పెట్టి సమాంతర సినిమాకు గుర్తింపు తీసుకువచ్చారు. సమాజం పట్ల ఉన్న నిబద్ధతను ప్రతి సినిమాలోనూ చాటుకున్నారు. భారత చలన చిత్ర రంగానికి సరికొత్త దశను దిశను నిర్దేశించిన పురోగామిగా ఆయనను భావి తరాలు గుర్తుంచుకుంటాయి.

మహనీయుల మాట



విప్లవానుభవాన్ని గురించి రాసినప్పటి కంటే కూడా దాన్ని అనుభవించినప్పుడే ఆహ్లాదకరంగానూ, ఉపయుక్తంగానూ వుంటుంది.

- వి.ఐ. లెనిన్

ప్రజలను శక్తివిహీనులుగా చేయడం...

అన్ని ఫాసిస్టు ప్రభుత్వాలూ ప్రజల్ని శక్తి విహీనులుగా చేయాలనే లక్ష్యంతో పని చేస్తాయి. మోడీ ప్రభుత్వం కూడా ఇందుకు మినహాయింపు కాదు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్) గ్రామాల్లో ప్రతీ ఇంటిలోనూ కనీసం ఒకరికి ఉపాధి కల్పించడానికి, అదీ ఒక ఏడాదిలో కనీసం 100 రోజులపాటు కల్పించడానికి గ్యారంటీ ఇచ్చింది. ఆ విధంగా ఎందరు కోరితే అందరికీ ఉపాధి కల్పించే పథకమిది. ఆ విధంగా ఒక పరిమితమైన అర్థంలో ఆ చట్టం ఉపాధి హక్కు కల్పించింది. అందరికీ ఉపాధి కల్పించకపోవచ్చు. ఏడాది పొడవునా ఉపాధి కల్పించలేకపోవచ్చు. అయినప్పటికీ పరిమితంగానైనా అది ఉపాధి హక్కు కల్పించింది. ఇది నయా ఉదారవాద విధానాలకు పొసగని ఒక హక్కు. కాని వామపక్షాల మద్దతు మీద కేంద్రంలో ఉన్న ప్రభుత్వం ఆధారపడక తప్పని పరిస్థితుల్లో ఆ వామపక్షాలు తెచ్చిన ఒత్తిడి ఫలితంగా ఆ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తెచ్చింది. అప్పటి నుంచీ ఏదో ఒక సాకుతో, ఏదో ఒక విధంగా ఆ చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నాలు కొనసాగుతూనే వున్నాయి. ప్రస్తుతం ఫాసిస్టు బిజెపి ప్రభుత్వ హయాంలో ఈ ప్రయత్నాలు తారాస్థాయికి చేరాయి. సాక్షాత్తూ ప్రధానమంత్రే ఈ పథకాన్ని వ్యతిరేకించారు.

ప్రభాత్ పట్నాయక్

చాలా ఇతర రాజకీయ పార్టీల మాదిరిగానే బిజెపి కూడా మహిళల ఓట్లు కొల్లగొట్టడం కోసం వారికి నగదు బదిలీ చేయడాన్ని బలపరుస్తుంది. నిజానికి అటువంటి నగదు బదిలీలే ఇటీవల బిజెపి కూటమి మహారాష్ట్ర ఎన్నికల్లో విజయం సాధించడానికి ప్రధాన కారణం. అయితే, అదే బిజెపి ఉపాధి హామీ పథకాన్ని మాత్రం దెబ్బ తీయడానికి పూనుకుంటోంది. ఈ రెండు పథకాలకూ మధ్య ఉన్న తేడా ఏమిటి? నగదు బదిలీ అనేది లబ్ధిదారుల పట్ల దయతో ఇచ్చేది. ఆ లబ్ధి పొందినవారు కృతజ్ఞతను చూపుతారు. అదే ఉపాధి హామీ పథకం అనేది ఒక హక్కు. దాని వలన లబ్ధి పొందినవారు తాము చేసిన పనికి ప్రతిఫలం పొందుతారు. అందుచేత వారు ఎవరి పట్లా కృతజ్ఞత చూపనవసరం లేదు. ఈ విధమైన హక్కు పౌరుల ఆత్మగౌరవాన్ని పెంచుతుంది. ఇది బిజెపికి ఎంతమాత్రమూ నచ్చదు. ఉపాధి హామీ పథకం ఒక విధమైన సాధికారతను కల్పిస్తుంది. అదే నగదు బదిలీ ఎటువంటి సాధికారతనూ కల్పించదు. ఆ నగదు బదిలీని ప్రభుత్వం తనకు తోచినప్పుడు నిలిపివేయవచ్చు. ప్రజల వద్ద ఏ అధికారమూ ఉండడం ఫాసిస్టు శక్తులకు ఎంతమాత్రమూ నచ్చదు. అందుకే ఇప్పుడు ఉపాధి హామీ పథకం మీద దాడి జరుగుతోంది.

ఈ దాడి అయిదు తరహాలుగా జరుగుతోంది. **మొదటిది:** ప్రభుత్వం జాతీయ మొబైల్ పర్యవేక్షణ వ్యవస్థ ద్వారా ఈ పథకాన్ని అమలు చేయాలని పట్టుబడుతోంది. ఆ విధానం ప్రకారం పని చేసిన కూలీ తాము పని చేస్తున్న స్థలంలో పని చేస్తున్న సమయంలో తీసిన ఫోటోలను మొబైల్ ఫోనులో అప్‌లోడ్ చేయాలి. తాము ఆ రోజు పని చేసినట్టు రుజువు చూపడం కోసం ఈ విధంగా చేయాలని కేంద్రం ఆదేశిస్తోంది. అదే విధంగా ఆధార్ కార్డు ప్రాతిపదికన వేతనం చెల్లించే వ్యవస్థను ప్రవేశపెట్టింది. ఇందుకోసం కూలీల బ్యాంక్ అకౌంట్లను ఆధార్ కార్డులకు అనుసంధానం చేయాలి. ఈ రెండు పద్ధతులనూ పాటించడం కూలీలకు చాలా కష్టం. మన గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక ప్రాంతాలు ఇంటర్నెట్‌తో అనుసంధానం కాలేదు. అందువలన చాలామంది కూలీలు చేసిన పనికి కూలీ పొందే అర్హతను కోల్పోతున్నారు. లిబ్ టెక్ ఇండియా అనే ఒక స్వచ్ఛంద సంస్థ సర్వే ప్రకారం ఆధార్‌తో బ్యాంక్ అకౌంట్లు అనుసంధానం కానందువలన 6 కోట్ల 70 లక్షల మంది కూలీలు ఉపాధి హామీ పథకానికి అర్హత కోల్పోయారని న్యూస్ క్లిక్‌లో వార్తా కథనం వచ్చింది.

> **నిజానికి అటువంటి నగదు బదిలీలే ఇటీవల బిజెపి కూటమి మహారాష్ట్ర ఎన్నికల్లో విజయం సాధించడానికి ప్రధాన కారణం. అయితే, అదే బిజెపి ఉపాధి హామీ పథకాన్ని మాత్రం దెబ్బ తీయడానికి పూనుకుంటోంది. ఈ రెండు పథకాలకూ మధ్య ఉన్న తేడా ఏమిటి? నగదు బదిలీ అనేది లబ్ధిదారుల పట్ల దయతో ఇచ్చేది. ఆ లబ్ధి పొందినవారు కృతజ్ఞతను చూపుతారు. అదే ఉపాధి హామీ పథకం అనేది ఒక హక్కు. దాని వలన లబ్ధి పొందినవారు తాము చేసిన పనికి ప్రతిఫలం పొందుతారు. అందుచేత వారు ఎవరి పట్లా కృతజ్ఞత చూపనవసరం లేదు. ఈ విధమైన హక్కు పౌరుల ఆత్మగౌరవాన్ని పెంచుతుంది. ఇది బిజెపికి ఎంతమాత్రమూ నచ్చదు. ఉపాధి హామీ పథకం ఒక విధమైన సాధికారతను కల్పిస్తుంది. అదే నగదు బదిలీ ఎటువంటి సాధికారతనూ కల్పించదు. ఆ నగదు బదిలీని ప్రభుత్వం తనకు తోచినప్పుడు నిలిపివేయవచ్చు. ప్రజల వద్ద ఏ అధికారమూ ఉండడం ఫాసిస్టు శక్తులకు ఎంతమాత్రమూ నచ్చదు. అందుకే ఇప్పుడు ఉపాధి హామీ పథకం మీద దాడి జరుగుతోంది.**

రెండవది: ఉపాధి హామీ పథకానికి మంజూరు చేసిన నిధులు అవినీతి పాలయ్యాయని ఆరోపిస్తూ కొన్ని రాష్ట్రాలకు కేంద్రం ఉపాధి హామీ నిధులను విడుదల చేయకుండా తొక్కిపెడుతోంది. ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలను కేంద్రం లక్ష్యంగా చేసుకుంది. పశ్చిమ బెంగాల్ ఆ విధంగానే ఒక ప్రధాన బాధిత రాష్ట్రంగా ఉంది. ఉపాధి హామీ పథకంలో అవినీతి చోటు చేసుకుంటే దానిని అరికట్టడానికి సోషల్ ఆడిట్ విధానం అనేది ఉంది. అటువంటి సోషల్ ఆడిట్‌ను రాష్ట్రాలు నిర్వహించడం లేదంటూ కేంద్రం రాష్ట్రాలను తప్పుబడుతోంది. ఐతే సోషల్ ఆడిట్ చేసే బృందాలకు వేతనాలను కేంద్రమే చెల్లించాలి. ఆ వేతనాలను కేంద్రం చాలా కాలం నుంచీ చెల్లించడం లేదు. ఒకవేళ వాస్తవంగా రాష్ట్ర ప్రభుత్వానిదే తప్పయినా అందుకు శిక్ష కూలీలకు విధించడం ఏవిధంగా సరైనది? ఉపాధి హామీ నిధులు మొత్తంగా కేంద్రమే భరించాలి. ఆ విధంగా చేయకుండా దీనిని ఒక సాకుగా చూపించి పథకాన్ని నీరుకారుస్తోంది.

వేతన బకాయిలను ఎప్పటికప్పుడు చెల్లించకుండా నిలిపివేయడం **మూడవ పద్ధతి.** ఇటీవల ఢిల్లీలో ఉపాధి హామీ కూలీల నిరసన ప్రదర్శన జరిగింది. అక్కడకు వచ్చిన కూలీలు తమకు మూడేళ్ళ క్రితం నాటి వేతనాలను ఇప్పుడు చెల్లించారంటూ వాపోయారు. చట్టం ప్రకారం ఒకవేళ కూలీలకు వేతనాల చెల్లింపులో జాప్యం జరిగితే అప్పుడు ఆ కూలీలకు పరిహారం చెల్లించాలని, ఒకవేళ కూలీలకు పని కల్పించలేకపోతే నిరుద్యోగ భృతి చెల్లించాలని ఉంది. కాని ఇంతవరకూ పరిహారం కాని, నిరుద్యోగ భృతి కాని ఆ కూలీలకు చెల్లించలేదు. ఇది చట్టాన్ని దారుణంగా అతిక్రమించడమే. కాని ఆ అతిక్రమణకు ఇంతవరకూ ఎవరికీ శిక్ష పడనే లేదు. ఎప్పుడైతే వేతనాల చెల్లింపులో విపరీతమైన జాప్యం చోటుచేసుకుంటోందో అప్పుడు ఉపాధి హామీ పనుల పట్ల ఆ కూలీలలో విముఖత పెరుగుతుంది. తద్వారా ఆ పథకం దెబ్బతిని పోతుంది.

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి సరిపడా నిధులను కేటాయించకపోవడం **నాలుగో పద్ధతి.** దాని కారణంగానే కూలీలకు సకాలంలో వేతనాలు అందడం లేదు. ఈ తప్పుడు పద్ధతి నిజానికి యుపిఎ-2 ప్రభుత్వం కాలంలోనే మొదలైంది. అప్పటి ఆర్థికమంత్రి పి.చిదంబరం ఎప్పుడూ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో తక్కువ కేటాయింపులే చేశారు. దానిని ప్రశ్నించినప్పుడు ఆ పథకం ఎటుదిరిగీ పనులు కోరినవారందరికీ పనులు కల్పించాల్సిందే కనుక బడ్జెట్‌లో కేటాయింపులు చేయకపోయినా, అవసరం మేరకు నిధులు విడుదల చేస్తామనంటూ సమాధానం చెప్పేవారు. ఇందులో ఉన్న ఇబ్బంది ఏమిటంటే, వేతనాలు చెల్లించాల్సి వచ్చేనాటికి నిధులు అయిపోతే మళ్ళీ కేటాయించడానికి కొంత సమయం పడుతుంది. దాని కారణంగా వేతనాల చెల్లింపు ఆలస్యం అవుతుంది. దాని పర్యవసానంగా ఉపాధి హామీ పనులకు రావడానికి కూలీలు విముఖత చూపుతారు. ఆ విముఖతను సాకుగా చూపించి తర్వాతి ఏడాది బడ్జెట్‌లో నిధులకు మరింత ఎక్కువ కోతలు పెడతారు. ఈ తప్పుడు విధానాన్ని బిజెపి పతాక స్థాయికి తీసుకుపోయింది.

2024-25లో ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో రూ.86,000 కోట్లు కేటాయించినట్టు చూపారు. చెల్లించవలసిన వేతన బకాయిలను అందులో నుంచి మినహాయిస్తే ఆ ఏడాది పనుల కోసం మిగిలేది సుమారు రూ.60,000 కోట్లు మాత్రమే. ఇది చాలా తక్కువ. దీని వలన ఈ ఏడాది చెల్లించవలసిన వేతన బకాయిలు ఇంకా ఎక్కువగా పేరుకుపోతాయి. ఇలా వేతన బకాయిలు పెరుగుతూ పోవడం వలన ఉపాధి హామీ పనుల కోసం సిద్ధపడే కూలీల సంఖ్య తగ్గిపోతోంది. కరోనా లాక్‌డౌన్ కాలంలో పట్టణాల నుండి కార్మికులు స్వగ్రామాలకు కాలినడకన తిరుగు ప్రయాణం కట్టారు. తమ తమ గ్రామాల్లో ఆ కాలంలో వారు ఉపాధి హామీ పనులకు పూనుకున్నారు. ఆ ఏడాది ఉపాధి హామీ పనుల కోసం విడుదల చేసిన నిధులు రూ.1,13,000 కోట్లు. ఆ విధంగా ఉపాధి హామీ పథకం వారికి ఆ కాలంలో ప్రాణాధారం అయింది. కోవిడ్ ముప్పు తొలగిపోయిన తర్వాత కూడా గ్రామాల నుండి పట్టణాలకు తిరిగి పోవడం అనేది జరగలేదు. అంటే ఇప్పుడు ఉపాధి హామీకి కోవిడ్ కాలంలో చెల్లించిన మొత్తానికి దరిదాపు సమానంగా కేటాయింపులు ఉండాలి. కాని అందులో సగం మాత్రమే (పాత బకాయిలు పోతే మిగిలినది రూ.60,000 కోట్లే) కేటాయించారు. అంటే ఉపాధి హామీ పనులు చేస్తే కూలీ డబ్బులు ఓ పట్టాన చెల్లించరు అన్న భావన కూలీలలో అంతకంతకూ బలపడేలా కేంద్రం కేటాయింపులు ఉంటున్నాయి. వాస్తవానికి ఉపాధి హామీ కూలీలు డిసెంబర్ 6న ఢిల్లీలో జరిపిన నిరసన కార్యక్రమంలో ఉపాధి హామీ పథకానికి ఏడాదికి రూ.2,50,000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. దీనిని బట్టి ఈ పథకం ఆవశ్యకత ఎంతగా ఉందో స్పష్టం అవుతోంది.

కూలీ రేట్లను ఎప్పటికప్పుడు సవరించకుండా అతి తక్కువ స్థాయిలోనే కొనసాగించడం **ఐదవ పద్ధతి.** గ్రామీణ ప్రాంతాల్లో కనీస స్థాయిలో అందవలసిన పౌష్టికాహారం 2200 క్యాలరీల శక్తిని ఇచ్చేది అయివుండాలని ప్లానింగ్ కమిషన్ నిర్ధారించింది. ఆ మేరకు ఒక వ్యక్తికి పౌష్టికాహారం అందాలంటే ఒక వ్యక్తికి కనీసం రూ.82 ఖర్చు అవుతుంది. ఒక ఇంట్లో సగటున అయిదుగురు వ్యక్తులు (భార్య, భర్త, ఇద్దరు పిల్లలు, ఒక వృద్ధులు) ఉంటారు. అంటే వారికి కనీస పౌష్టికాహారం అందాలంటే కనీసం రోజు వేతనం రూ.410 ఉండాలి. వాస్తవానికి అంతకన్నా కూడా ఎక్కువ ఉండాలి. ఎందుకంటే తిండి ఖర్చుతోబాటు విద్య, వైద్యం వంటి ఖర్చులు కూడా ఉంటాయి. వాటిని ప్రైవేటీకరించడం వలన ఆ ఖర్చులు సైతం బాగా పెరిగిపోయాయి.

ఈ కేంద్ర ప్రభుత్వమే నియమించిన నిపుణుల కమిటీ కూడా ఇటీవల ఉపాధి హామీలో కనీస వేతనం రూ.375 ఉండాలని సిఫార్సు చేసింది. కాని ఉపాధి హామీ కూలీ వేతనాలు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా చాలా వ్యత్యాసాలతో ఉన్నాయి. ఎక్కడా రూ.375 చొప్పున చెల్లించడం లేదు. హర్యానా, కేరళ, కర్ణాటక, పంజాబ్ రాష్ట్రాలలో మాత్రమే రోజు కూలీ ఉపాధి హామీలో రూ.300 కన్నా ఎక్కువ ఉంది. తక్కిన రాష్ట్రాలలో రూ.200-300 మధ్య మాత్రమే ఉంది. ఈ అతి తక్కువ వేతనాలను సైతం నెలల తరబడి చెల్లించకుండా బకాయిలు పెడుతున్నారు. కూలీలు ఈ పథకం పట్ల విముఖత పెంచుకోడానికే ఇది దారి తీస్తోంది.

ఇన్ని విధాలుగా ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం హక్కుల ప్రాతిపదికన అమలు జరగవలసిన ఒక పథకాన్ని దెబ్బ తీస్తోంది. స్వాతంత్ర్యానంతర కాలంలో చాలా ప్రభావ వంతమైన ఒక చట్టం ద్వారా ఈ పథకం ఉనికిలోకి వచ్చింది. దానిని దెబ్బ తీసి ప్రజలు నగదు బదిలీల కోసం దేబిరించేటట్లు వారిని దిగజార్చుతోంది బిజెపి ప్రభుత్వం. ఫాసిస్టు శక్తులతో నిండిన ఒక ప్రభుత్వం నుంచి ఇంతకన్నా ఏం ఆశించగలం?

(స్వేచ్ఛానుసరణ)

అంబేద్కర్‌ను గౌరవిద్దామిలా

బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమానించిందని మీరంటే మీరంటూ వైరిపక్షాలు జాతీయ స్థాయిలో తలపడుతున్నాయి. అయితే ఆయన్ని ఈ కింది విధానాల ద్వారా గౌరవించవచ్చని సూచన.

- అన్ని ఊళ్లలో గ్రంథాలయాలు నెలకొల్పాలి. అధ్యయనం ఎంత అవసరమో ఆయన చెప్పినందుకు.
- ఉచితమైన, నాణ్యమైన విద్య అందరికీ అందించాలి. విద్య ఒక్కటే అసలైన ఆయుధమని అన్నందుకు.
- బ్యాక్ లాగ్ పోస్టులన్నీ భర్తీ చెయ్యాలి. కోట్లాది మంది అర్హులైన నిరుద్యోగులు ఉన్నప్పుడు, లక్షలాది ఉద్యోగాలు భర్తీ కాకపోవడం నేరం.
- ఆహార భద్రత అందరికీ అందించాలి. దేశంలో సరిపడా ఆహారం ఉన్నా కాలే కడుపులు గణనీయంగా ఉండడం సిగ్గుచేటు. పిల్లల ఎదుగుదల లోపాలు దేశంలో ఎక్కువే.
- సంపద పంపిణీలో న్యాయం ఉండాలి. ఆదాయం, సంపద అతి తక్కువ మంది చేతిలో పడి, అత్యధిక శాతం మంది పేదరికంలో మగ్గుతున్నారు. ప్రజానీకం ఆత్మగౌరవంతో ఆర్థికంగా బలపడేలా విధానాలు ఉండాలి.
- చట్టం ముందు అందరూ సమానులే అన్నది పాటించాలి. తప్పు చేసింది తమ వాడైనా నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. ముఖ్యంగా మహిళలు, అణగారిన వర్గాల హక్కులు కాపాడే విషయంలో.
- కుల రహిత సమాజం కల సాకారమయ్యే రోజు కనుచూపు మేరలో లేదు. కులాలు, మతాల మధ్య దూరాలు పెరగకుండా, సాన్నిహిత్యం పెరిగేలా చూడాలి.
- న్యాయ వ్యవస్థలో అందరికీ ప్రాతినిధ్యం ఉండేలా న్యాయ సంస్కరణలు, రాజకీయ స్వాతంత్ర్యం పట్టాలు తప్పకుండా చూసే ఎన్నికల సంస్కరణలు, అత్యధిక శాతం ప్రజలు తమ కాళ్లపై తాము నిలబడేలాగా ఆర్థిక విధానాల కల్పన చేయాలి. 'అధ్యయనం, ఆత్మగౌరవం, శీలం..ఈ మూడు నాకు ముఖ్యం' అన్నారు అంబేద్కర్. శీలం ఉంటేనే మిగతా రెండూ సాధ్యమయ్యేవి. వ్యక్తికైనా, వ్యవస్థకైనా.

-డా॥డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, విజయనగరం.

సమస్య

ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని కాపాడుకోవాలి

> **దేశవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు, రైతు సంఘాలు, వినియోగదారులు, వామపక్ష పార్టీలు, కొన్ని ప్రాంతీయ పార్టీలు చేస్తున్న పోరాట ఫలితంగా పార్లమెంటులో విద్యుత్ సవరణ చట్టాన్ని గత పది సంవత్సరాలుగా చేయలేక పోయింది మోడీ ప్రభుత్వం. అయితే రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా...అందులో ఉన్న డిస్ట్రిబ్యూషన్, ట్రాన్స్‌మిషన్, జనరేషన్ సంస్థలను ప్రైవేట్ కార్పొరేట్లకు అప్పగించే ప్రతిపాదనలను వేగంగా అమలు చేయిస్తున్నది. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులతో ఎన్నికలకు ముందు ఒప్పందాలు చేసుకుని, ఎన్నికల తర్వాత ప్రైవేటీకరణ ప్రయత్నాలు చేయడమంటే ప్రజలను, విద్యుత్ ఉద్యోగులను ప్రజలను మోసం చేయడం తప్ప మరొకటి కాదు.**

ఆధునిక సమాజంలో విద్యుత్ ఒక నిత్యావసర సరుకుగా మారింది. కార్పొరేట్ సేవలో మునిగి తేలుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం దీన్ని ఒక ఫక్తు వ్యాపార సరుకుగా మార్చేసి, సిరులు సృష్టించే సంస్థలుగా విద్యుత్ సంస్థలను తయారు చేస్తోంది. దీనికనుగుణంగా చట్టాలను సైతం మార్చేయడానికి శత విధాలా ప్రయత్నిస్తోంది. తన కార్పొరేట్ అనుకూల సంస్కరణలు చేపట్టాలని రాష్ట్రాలపై ఒత్తిడి తెస్తోంది.

దేశమంతా ఒకే చట్టం తీసుకొచ్చి మొత్తం విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ల చేతుల్లో పెట్టడం కోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వాలతో డిస్ట్రిబ్యూషన్ కంపెనీలను, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, ట్రాన్స్‌మిషన్ లైన్స్‌ను పూర్తిగా దేశ విదేశీ కార్పొరేట్ శక్తులకు అప్పగించాలని, సోలార్ విద్యుత్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వాలతో తప్పుడు ఒప్పందాలు చేయించి, కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయాలని చూస్తోంది. అదానీ విద్యుత్ కుంభకోణం నేపథ్యంలో నేడు విద్యుత్ రంగం, ఒప్పందాలు మరోసారి చర్చనీయాంశం అయ్యాయి.

విద్యుత్ రంగంపై కేంద్రానికి పూర్తి నియంత్రణ, ప్రైవేటీకరణ లక్ష్యాలతో మోడీ ప్రభుత్వం విద్యుత్ చట్టం 2003కు సవరణలు చేయడానికి గత నాలుగేళ్లుగా శతవిధాలా ప్రయత్నాలు చేస్తోంది. విద్యుత్ ఉద్యోగులు, రైతుల పోరాటం, వామపక్షాల వ్యతిరేకతతో ఇది చట్ట రూపం దాల్చలేదు. అయితే కేంద్ర కనుసన్నలలో మన రాష్ట్రంతో పాటు మరికొన్ని బిజెపి పాలిత రాష్ట్రాలు ఈ దిశలో విద్యుత్ రంగంలో పూర్తి ప్రైవేటీకరణ విధానాల అమలుకు పూనుకున్నాయి.

తాజాగా అన్ని విధాలా అత్యుత్తమ సామర్థ్యం కలిగిన చండీగఢ్ విద్యుత్ సంస్థను కారు చౌకగా రూ.174.63 కోట్లకు వేలం పాట పెట్టారు. సంస్థ భూములను, ఆస్తులను నెలకు ఒక్క రూపాయి అద్దెగా చెల్లించి వాడుకోవడానికి అనుమతి ఇస్తున్నారు. విద్యుత్ పంపిణీలో ఏ మాత్రం అనుభవంలేని ఎమినెంట్ ఎలక్ట్రిసిటీ లిమిటెడ్ (ఇ.ఇ.డి.యల్)కు ధారాదత్తం చేయడానికి పూనుకుంది. ఈ కంపెనీ ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బిజెపి కి కోట్లాది రూపాయలు విరాళంగా ఇచ్చింది. ఇది ప్రజలను దోచుకునే పన్నాగమని గ్రహించిన చండీగఢ్ విద్యుత్ రంగ కార్మికులు జరగనున్న నష్టాన్ని తెలియ చేసేందుకు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆందోళనను ఉధృతం చేశారు. ప్రభుత్వం ఆందోళన చేస్తున్న కార్మికుల మీద 'ఎస్మా' చట్టాన్ని ప్రయోగించింది. అయినా బెదరక కార్మికులు పోరాటాన్ని కొనసాగిస్తున్నారు.

ఉత్తరప్రదేశ్‌లో ఆగ్రా, వారణాసి డిస్కంలను ప్రైవేటీకరించే ప్రయత్నాలు మొదలయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం దక్షిణ హైదరాబాద్ సర్కిల్ విద్యుత్ పంపిణీ సేవలను అదానీ గ్రూప్‌కు కట్టబెట్టడానికి చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా గత కొన్ని నెలలుగా ఉద్యోగులు, కార్మికులు పోరాడుతున్నారు.

మూడేళ్ళ క్రితం ఉత్తరప్రదేశ్ విద్యుత్ ఉద్యోగులు స్ఫూర్తిదాయక పోరాటం చేసి, యోగి ఆదిత్యనాద్ ప్రభుత్వ ప్రైవేటీకరణ కుట్రలను నిలవరించారు. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి బిజెపి ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా, చివరికి ఐక్య సంఘటనలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ కార్మిక బిఎంఎస్ కూడా భాగస్వామిగా ఉండి ఐక్య ఉద్యమాన్ని బలపరచవలసి వచ్చింది. రైతు సంఘాలు, వినియోగదారు సంఘాల మద్దతుతో విద్యుత్ ప్రైవేటీకరణ ప్రతిపాదనలను వెనక్కి నెట్టారు. గతంలో కాశ్మీర్, పాండిచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతంలో ఇటువంటి ప్రతిపాదనలతో కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచన వచ్చిన వెంటనే ఆ యా రాష్ట్రాలలో విద్యుత్ ఉద్యోగులు ఐక్యంగా తిప్పి కొట్టారు.

మోడీ ప్రభుత్వ కనుసన్నలలో వివిధ రాష్ట్రాలలో జరుగుతున్న ఈ కుట్రలను తిప్పికొట్టడానికి దేశవ్యాప్తంగా 27 లక్షల మంది ఉద్యోగులకు నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్ అండ్ ఇంజనీర్స్ వివిధ రూపాలలో సంఘీభావ ఆందోళనలకు పిలుపునిచ్చింది.

నేడు మన రాష్ట్రంలో కూడా ఇవే విధానాలు కొనసాగుతున్నాయి. పాతికేళ్ళ క్రితం దేశంలోనే మొదటిసారిగా విద్యుత్ రంగంలో ప్రపంచ బ్యాంకు ఆదేశిత సంస్కరణలకు శ్రీకారం చుట్టిన చంద్రబాబు నేడు అధికారంలో ఉన్నారు. అధికారంలో పార్టీలు ఏవైనా విధానంలో మాత్రం మార్పు లేదు. కేంద్ర ప్రభుత్వం ఆదేశిత విధానాలను అమలు చేస్తూ విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేయడం ఒక్కటే పనిగా అడుగులు వేస్తున్నారు. అన్ని విభాగాలను ప్రైవేటీకరణ చేయడం కోసం సకల ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు తగలబెట్టండని పిలుపునిచ్చి, నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత అదానీ స్మార్ట్ మీటర్లు బిగించడానికి ఆదేశాలు ఇచ్చింది టిడిపి. మరో పక్క సోలార్ విద్యుత్ ఒప్పందంలో అవినీతి, అక్రమాలు జరిగాయని అమెరికా కోర్టులో కేసు ద్వారా బహిర్గతమైంది. గత ప్రభుత్వం అదానీతో కుదుర్చుకున్న ఒప్పందంలో జరిగిన అవినీతిపై అంతర్జాతీయంగా, దేశీయంగా ఇంత పెద్ద ఎత్తున చర్చ జరుగుతుంటే, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యయనం చేస్తామంటూ కాలయాపన చేస్తూ ఆ ఒప్పందాలను రద్దు చేయకుండా విద్యుత్ రంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరణ చేసే దిశగా పయనిస్తున్నారు.

దేశవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు, రైతు సంఘాలు, వినియోగదారులు, వామపక్ష పార్టీలు, కొన్ని ప్రాంతీయ పార్టీలు చేస్తున్న పోరాట ఫలితంగా పార్లమెంటులో విద్యుత్ సవరణ చట్టాన్ని గత పది సంవత్సరాలుగా చేయలేక పోయింది మోడీ ప్రభుత్వం. అయితే రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా...అందులో ఉన్న డిస్ట్రిబ్యూషన్, ట్రాన్స్‌మిషన్, జనరేషన్ సంస్థలను ప్రైవేట్ కార్పొరేట్లకు అప్పగించే ప్రతిపాదనలను వేగంగా అమలు చేయిస్తున్నది. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులతో ఎన్నికలకు ముందు ఒప్పందాలు చేసుకుని, ఎన్నికల తర్వాత ప్రైవేటీకరణ ప్రయత్నాలు చేయడమంటే ప్రజలను, విద్యుత్ ఉద్యోగులను మోసం చేయడం తప్ప మరొకటి కాదు.

ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా ఉన్న విద్యుత్ రంగమంతా ప్రజల డబ్బుతో నిర్మించినదే. ఈ ప్రజల ఆస్తిని ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నం కేంద్రంలోని నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం, బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు, దానికి మద్దతిస్తున్న ప్రభుత్వాలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా వివిధ తరగతుల ప్రజలు, రైతు సంఘాలు, వినియోగదారుల సంఘాలు, కేంద్ర కార్మిక సంఘాలు, మేధావుల విశాల ఐక్యత ద్వారా మాత్రమే విద్యుత్ రంగాన్ని కాపాడుకోగలం.

- జి.ఎ. సూరి, విజయనగరం.

★

ఐకమత్యంతోనే విజయం

- రైతు నాయకులు దల్లేవాల్
- క్షీణిస్తున్న ఆరోగ్యాన్ని లెక్క చేయకుండా దీక్ష కొనసాగింపు

న్యూఢిల్లీ : యుద్ధంలో విజయం కోసం ఐకమత్యంతో పోరాటం చేయాలని రైతు నాయకులు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ పిలుపునిచ్చారు. ఖనౌరీ సరిహద్దు ప్రాంతంలో దల్లేవాల్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్ష మంగళవారం 29వ రోజుకు చేరుకుంది. తన ఆరోగ్యం క్షీణిస్తున్నా రైతు నాయకుడు దల్లేవాల్ తమ డిమాండ్ల సాధన కోసం దీక్షను కొనసాగిస్తున్నారు. ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో ప్రత్యేక వేదిక నుంచి రైతులనుద్దేశించి రెండు నిమిషాల పాటు దల్లేవాల్ ప్రసంగించారు. మోర్చా రైతు నాయకులు అభిమన్యు కోహర్ సాయంతో మాట్లాడుతూ 'నేను బాగానే ఉన్నాను అని మీ అందరికీ చెప్పాలనుకుంటున్నాను' అని దల్లేవాల్ తెలిపారు. చాలా బలహీనమైన స్వరంతో మాట్లాడుతూ తన దీక్షకు మద్దతు ఇస్తున్న వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 'ఈ యుద్ధంలో మనం గెలవాలి. దేశం మొత్తం ఐక్యంగా పోరాడితేనే ఈ యుద్ధంలో గెలుస్తాం' అని అన్నారు. 'ప్రభుత్వం మమ్మల్ని ఇక్కడ నుంచి తొలగించాలని కోరుకుంటోంది. అలా తరిమి కొట్టకపోతే మనం గెలుస్తాం లేదా చనిపోతాం. ఈ రెండింటిలో ఒకటి జరుగుతుంది' అని అన్నారు. దల్లేవాల్ ప్రసంగానికి తరువాత అభిమన్యు కోహర్ మాట్లాడుతూ 'తాను బాగానే ఉన్నానని దల్లేవాల్ చెప్పడం, అతను శారీరకంగా క్షీణిస్తున్నా అతని స్పిరిట్ గొప్పగా ఉందని అర్థం' అని వివరణ ఇచ్చారు. ఎంఎస్‌పికి చట్టబద్ధత, రైతులకు రుణ మాఫీ, రైతులు, వ్యవసాయ కార్మికులకు పెన్షన్ వంటి డిమాండ్లతో నవంబర్ 26 నుంచి దల్లేవాల్ నిరాహార దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే. దల్లేవాల్‌ను పరీక్షిస్తున్న వైద్యులు అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని చెబుతున్నారు. దల్లేవాల్ దీక్ష విరమించేవిధంగా చర్యలు తీసుకోవాలని పంజాబ్, కేంద్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం [illegible]. దల్లేవాల్ కూడా డిమాండ్లు సాధించేవరకూ దీక్ష విరమించేది లేదని స్పష్టం చేస్తున్నారు. కాగా, మార్చ్ టూ ఢిల్లీని భద్రతా దళాలు అడ్డగించిన తరువాత ఫిబ్రవరి 13 నుంచి పంజాబ్, హర్యానా సరిహద్దులోని శంభు, ఖనౌరీ ప్రాంత వద్ద సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చా బ్యానర్ కింద రైతులు ఆందోళన చేస్తున్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దల్లేవాల్

410 మంది ఫైబర్‌నెట్ ఉద్యోగుల తొలగింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపి ఫైబర్‌నెట్ లిమిటెడ్ సంస్థలో అవసరం లేకున్నా అపాయింట్‌మెంట్ లెటర్ కూడా లేకుండానే వందలాది మంది ఉద్యోగులను గత ప్రభుత్వం నియమించిందని, అలాంటి వారిలో 410 మందిని గుర్తించి, విధుల నుంచి తొలగిస్తున్నామని ఆ సంస్థ ఛైర్మన్ జివి రెడ్డి తెలిపారు. విజయవాడ ఫైబర్ నెట్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఐదేళ్లలో అవసరానికి మించి ఎక్కువ మంది ఉద్యోగులను ఏ విధమైన నియామక ఉత్తర్వులు లేకుండానే, కనీసం విచారణ లేకుండానే నేతలు వాట్సాప్ మెసేజ్ పెడితే అటువంటి వారికి ఉద్యోగాలిచ్చారన్నారు. వీరిలో అత్యధిక మంది శాసన సభ్యుల ఇళ్లలో వంట మనుషులు, ఎంపిల ఇళ్లలో డ్రైవర్లుగా పనిచేస్తూ ఫైబర్‌నెట్‌లో జీతాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఉద్యోగుల్లో ఇంకా అనర్హులుంటే వారిని తొలగిస్తామన్నారు. సంస్థకు 70-75 శాతం మంది అవసరం లేకున్నా ఉద్యోగులను తీసుకున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటువంటి వారి వల్ల సంస్థ నెలకు రూ.4 కోట్లు చెల్లించాల్సి రావడంతోపాటు దివాలా అంచున ఉందన్నారు. గత ప్రభుత్వం ఎపిఎస్‌ఎఫ్‌ఎల్‌కు రూ.1,200 కోట్లు అప్పులు చేయడంతో పాటు రూ.900 కోట్లు బకాయిలు పెట్టిందన్నారు. ఉద్యోగులను నియమించిన ఎండీ, లీగల్ నోటీసులిచ్చి వివరణ కోరుతామన్నారు.

వద్దని చెప్పినా థియేటర్‌కు ఎందుకొచ్చారు?

- అల్లు అర్జున్‌ను మరోసారి విచారించిన పోలీసులు
- భావోద్వేగంతో కంటతడి పెట్టిన బన్నీ?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంధ్య థియేటర్ కేసులో సినీనటుడు అల్లు అర్జున్ మరోసారి చిక్కడపల్లి పోలీసుల ఎదుట హాజరయ్యారు. తన తండ్రి, నిర్మాత అల్లు అరవింద్, మామ చంద్రశేఖర్‌రెడ్డిలతో కలిసి మంగళవారం ఉదయం 11.05 గంటలకు చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. సుమారు నాలుగు గంటలపాటు పోలీసులు ఆయనను విచారించారు. ఈ నెల నాలుగున సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటన, తదనంతర పరిణామాలపై పోలీసులు ప్రశ్నించారు. తొక్కిసలాట ఘటనపై ఇటీవల విడుదల చేసిన పది నిమిషాల వీడియోను అల్లు అర్జున్‌కు చూపించారు. దాని ఆధారంగా సెంట్రల్ జోన్ డిసిపి ఆకాంక్ష్ యాదవ్, చిక్కడపల్లి ఏసిపి రమేష్, ఇన్‌స్పెక్టర్ రాజునాయక్‌లు అల్లు అర్జున్‌ను ప్రశ్నించినట్లు సమాచారం. ఈ సమయంలో అల్లు అర్జున్ భావోద్వేగానికి గురై కన్నీటి పర్యంతమైనట్లు తెలిసింది. అల్లు అర్జున్ ప్రెస్‌మీట్‌లో ప్రస్తావించిన అంశాలపైనా పోలీసులు ఆరా తీసినట్టు సమాచారం. పోలీసు కస్టడీలో సంధ్య థియేటర్ సీనియర్ మేనేజర్ నాగరాజు వెల్లడించిన అంశాల ఆధారంగా అల్లు అర్జున్ నుంచి వివరాలు రాబట్టేందుకు ప్రయత్నించారు. పుష్ప-2 ప్రీమియర్ షోకు అల్లు అర్జున్ సహా ఇతర నటీనటుల రాకకు పోలీసులు అనుమతి తిరస్కరించిన విషయాన్ని నాగరాజు మీకు చెప్పారా? లేదా? అనే విషయంపై అల్లు అర్జున్‌ను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. థియేటర్ యాజమాన్యం నుంచి సమాచారం అందిందా? లేదా? అందినప్పటికీ ప్రీమియర్ షోకు వచ్చారా? అనే అంశంపై ప్రశ్నలు అడిగినట్లు విశ్వసనీయ సమాచారం. విచారణ అనంతరం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో అల్లు అర్జున్ నేరుగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి వెళ్లిపోయారు.

స్పృహలోకి బాలుడు శ్రీతేజ్

సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్ స్పృహలోకి వచ్చినట్టు ఆయన తండ్రి భాస్కర్ మంగళవారం తెలిపారు. ఐసియు నుంచి ప్రత్యేక గదికి బాలుడిని మార్చినట్లు చెప్పారు. అయితే, శ్రీతేజ్ తమను గుర్తుపట్టడం లేదన్నారు. పూర్తిగా కోలుకోవడానికి కొంత సమయం పడుతుందని వైద్యులు చెప్పారని ఆయన విలేకరులకు తెలిపారు.

వృద్ధి రేటు క్షీణతపై కలవరపాటు

- ప్రముఖ ఆర్థిక నిపుణులతో ప్రధాని మోడీ భేటీ

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కసరత్తు జరుగుతున్న నేపథ్యంలో దేశ వృద్ధి రేటు అంచనాలను చేరుకోకపోవడం మోడీ సర్కారును కలవరపాటుకు గురిచేస్తోంది. ఈ క్రమంలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మంగళవారం పలువురు ప్రముఖ ఆర్థికవేత్తలు, నిపుణులతో భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. మోర్గాన్ స్టాన్లీకి చెందిన రిధమ్ దేశాయ్, వ్యవసాయ ఆర్థికవేత్త అశోక్ గులాటి, మాజీ ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుర్జిత్ భల్లా, క్రిసిల్‌కు చెందిన డి.కె.జోషి ప్రభృతులు మోడీతో భేటీ అయిన వారిలో వున్నారు. ఇటీవల ఒక త్రైమాసికంలో వృద్ధి రేటు 5.4 శాతానికి పడిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై చర్చించినట్లు తెలిసింది. వ్యవసాయం, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, తయారీ రంగంతో సహా పలు కీలక రంగాలపై దృష్టి సారించాలని ఆర్థిక వేత్తలు నొక్కి చెప్పినట్లు సమాచారం.

మళ్లీ మైనింగ్ ప్రకంపనలు

- 28న మరోసారి పబ్లిక్ హియరింగ్
- క్వార్ట్జైట్ తవ్వకాలను గతంలో మాదిరిగానే వ్యతిరేకిస్తామంటున్న కుశలవాడ పంచాయతీ ప్రజలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం కుశలవాడ పంచాయతీ పరిధిలోని తెల్ల కొండలలో క్వార్ట్జైట్ తవ్వకాలకు తెరతీసిన విశ్వ నెక్ ఇన్‌ఫ్రా టెక్నాలజీస్ సంస్థ గతంలో చేసిన ప్రయత్నాలు విఫలమైనా మళ్లీ తన ప్రయత్నాలను మొదలు పెట్టింది. ఇందుకు సంబంధించి మరోసారి ఈ నెల 28న పబ్లిక్ హియరింగ్‌ను అధికారులు నిర్వహిస్తున్నారు. దీంతో, ఈ పంచాయతీ పరిధిలోని ప్రజల్లో మళ్లీ మైనింగ్ ప్రకంపనలు ప్రారంభమయ్యాయి. ఈసారి కూడా పార్టీలకతీతంగా అడ్డుకుని తీరుతామని ప్రజలు తేల్చి చెప్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు 28న తెల్లకొండల్లో క్వార్ట్జైట్ మైనింగ్ కోసం విశ్వ నెక్ ఇన్‌ఫ్రా టెక్నాలజీస్ సంస్థ తరపున అధికార యంత్రాంగం పబ్లిక్ హియరింగ్ నిర్వహించింది. ఈ సందర్భంగా బ్లాస్టింగ్, డ్రిల్లింగ్‌తో ఎదురయ్యే పరిస్థితులపై [illegible] కుశలవాడ, చిన్నయ్యపాలెం, రేగానిపాలెం, గొల్లలపాలెం, జగ్గయ్యపాలెం గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. దీంతో, పబ్లిక్ హియరింగ్‌ను రద్దు చేస్తున్నట్లు వేదికపై జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, అప్పట్లో ప్రకటించారు. మళ్లీ అదే సంస్థ గుట్టుచప్పుడు కాకుండా ఈ నెల 28న అదే వేదికలో పబ్లిక్ హియరింగ్‌కు అనుమతులు తెచ్చుకుంది. సర్వే నెంబర్ 104లోగల 20 ఎకరాల్లో విస్తరించి ఉన్న కుసులవాడలోని తెల్ల కొండపై క్వార్ట్జైట్ నిక్షేపాలు ఉన్నాయి. చాలా కఠినమైన ఈ శిలను వెలికి తీయడానికి బ్లాస్టింగ్, డ్రిల్లింగ్ తప్పనిసరని నిపుణులు చెప్తున్నారు. ఈ కొండపై ఆధారపడి ఆవులు, గొర్రెలు, మేకల పెంపకందారులు, గిరిజనులు బతుకుతున్నారు. తవ్వకాల వల్ల వీరు జీవనోపాధి కోల్పోతారు. మామిడి, జీడి తోటలు, [illegible] పువ్వుల తోటలు ఈ పరిధిలో ఉన్నాయి. తవ్వకాలతో వెలువడే కాలుష్యం వల్ల వీటికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది, తాగునీరు, వాతావరణం కాలుష్యం అవుతుందని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పబ్లిక్ హియరింగ్‌పై ఆనందపురం తహశీల్దారు వివరణ కోరగా తనకు దీనిపై ఇంతవరకూ సమాచారం లేదని మంగళవారం సాయంత్రం చెప్పారు. ఈ నెల 28న పబ్లిక్ హియరింగ్ జరుగుతుందని దండోరా వేయించాలని తనకు ఆదేశాలు వచ్చాయని కుశలవాడ పంచాయతీ సచివాలయ కార్యదర్శి తెలిపారు.

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India

గవర్నర్‌పేట బ్రాంచి (01451)
డి.నెం.27-18-85, హోటల్ రాజ్ టవర్స్ దగ్గర, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, విజయవాడ-520002.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు/కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు: 1) శ్రీ అంజనీవేలి రతీష్ కుమార్, డి.నెం.29-27-40/1, సూర్యనారాయణ వీధి, సూర్యారావుపేట, విజయవాడ-520002. **2) భవానీ అంజనవేలి,** డి.నెం.29-27-40/1, సూర్యనారాయణ వీధి, సూర్యారావుపేట, విజయవాడ-520002. **3) సుబ్బారావు పిల్లిబోయిన,** నెం 61-31/3-7, గీతానగర్, కృష్ణలంక, విజయవాడ-520002.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట బ్రాంచి (01451) వారికి శ్రీ అంజనివేలి రతీష్ కుమార్ & భవానీ అంజనవేలి మరియు సుబ్బారావు పిల్లిబోయిన కి చెందిన బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను/బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.01-08-2024** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.28-11-2024** న అధీకృత అధికారి లాంఛనాత్మక స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట బ్రాంచి (01451)** కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.01-08-2024** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం విముక్తి హక్కు అందుబాటులో ఉంది.

షెడ్యూల్ ఆస్తి

షెడ్యూల్-ఏ: కృష్ణాజిల్లా, కంకిపాడు మండలం, ఈడుపుగల్లు, ఆర్.ఎస్.నెం. 101/2, దగ్గరి డోర్.నెం.2-214, మొత్తం 13225.30 చ.గ.లలో 36 చ.గ.ల అవిభక్త వాటా గల ఆస్తికి హద్దులు **తూర్పు:** వేమూరి కృష్ణ కుమారి గారికి చెందిన భూమి, **దక్షిణం:** నీటిబోదే, **పడమర:** ఈడుపుగల్లు నుంచి ఉప్పులూరు ఆర్ అండ్ బి రోడ్డు, **ఉత్తరం:** పర్వతనేని నాగేశ్వరరావు గారికి చెందిన భూమి.

షెడ్యూల్-బి: షెడ్యూల్-ఏ కింద చూపిన స్థలంలో నిర్మాణంలో ఉన్న "విజయసాయి ఎన్‌క్లేవ్" ఏ-బ్లాక్, నాల్గవ అంతస్తులో 756 చ.అ.ల ప్లింత్ ఏరియా మరియు 126 చ.అ.ల కామన్ ఏరియాతో గల ఫ్లాట్ నెం.508 ఆస్తికి హద్దులు **తూర్పు:** శూన్యాకాశము, **దక్షిణం:** ఫ్లాట్ నెం.507, **పడమర:** కారిడార్, **ఉత్తరం:** శూన్యాకాశము.

తేది: 21-12-2024 — **అధీకృత అధికారి**
ప్రదేశము: విజయవాడ — **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

TATA — టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ — డిమాండ్ నోటీసు

సంప్రదించాల్సిన చిరునామా : 11వ అంతస్తు, టవర్ ఎ, పెనిన్సుల బిజినెస్ పార్క్, గణపత్‌రావు కదం మార్గ్, లోయర్ పారెల్, ముంబాయి 400013. సంప్రదించాల్సిన నం. (022) 66069383

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("రూల్స్") యొక్క రూల్ 3తో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 ("యాక్ట్") యొక్క సెక్షన్ 13(2) క్రింద.

ఏదైతే దిగువసంతకందారు అయిన **టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (టిసిహెచ్‌ఎఫ్‌ఎల్)** యొక్క ఆధీకృత అధికారి చట్టం క్రింద మరియు రూల్స్ యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద అధికారాలను అధ్యయనం చేస్తూ రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీతల(లు)/హామీదారు(లు) (ఒక్కరు లేదా "పత్రం రాసి ఇచ్చినవారిని పరిగణించే వారందరిని)/చట్టబద్ధవారసు(లు)/చట్టబద్ధప్రతినిధు(లు) జాబితా దిగువ ఇవ్వడమైనది, సంబంధిత డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తం చెల్లించుటకు, సంబంధిత నోటీసు యొక్క తేది నుండి 60 రోజులలోగా, వివరాల ప్రకారం దిగువన ఇవ్వడమైనది. సదరు నోటీసుల కాపీలు రిజిస్టర్డ్ పోస్ట్ ఎ.డి. ద్వారా పంపించడం జరిగింది మరియు దిగువసంతకందారుడుతో అందుబాటులో ఉంటుంది మరియు సదరు బాండ్ రాసి ఇచ్చినవారసు(లు)/చట్టబద్ధవారసుడు(లు)/చట్టబద్ధ ప్రతినిధి(లు), కాబట్టి వారి కోరిక మేరకు, సాధారణ కార్యాలయ వేళలో దిగువ సంతకందారుడి నుండి సంబంధిత కాపీని పొందవచ్చు.

పైదానికి అనుసందానంగా, ఇక్కడ నోటీసు ఇవ్వడమేమనగా, మరొక సారి, సదరు బాండ్ రాసి ఇచ్చినవారు(లు)/చట్టబద్ధవారసుడు(లు)/చట్టబద్ధ ప్రతినిధి(లు) లోను అగ్రిమెంట్ మరియు ఇతర డాక్యుమెంట్‌లు/వ్రాతపూర్వాకాలు చదువుతూ, చెల్లింపులు మరియు/లేదా తెలుసుకున్న తేది నుండి దిగువ కాలమ్ (డి) లో పేర్కొన్న సంబంధిత తేది నుండి దిగువ వివరించిన వడ్డీతో కలపుకొని సంబందిత పేర్లకు ఎదురుగా దిగువ గుర్తించిన మొత్తాన్ని సంబంధిత నోటీసు/లు తేది నుండి 60 రోజులలోగా **టిసిహెచ్‌ఎఫ్‌ఎల్**కు చెల్లించవలెను, ఒకవేళ, సదరు లోన్ అగ్రిమెంట్ మరియు ఇతర డాక్యుమెంట్లు రాసి ఇచ్చినవారు(లు) ద్వారా అమలు జరిగినట్లయితే. లోను తిరిగిచెల్లించుటకు బకాయిల కొరకు సెక్యూరిటీగా ఉంచబడింది, సదరు బాండ్ రాసి ఇచ్చినవారు(లు) చే టిసిహెచ్‌ఎఫ్‌ఎల్‌కు దిగువ సెక్యూర్డ్ ఆస్తు(లు) తాకట్టుపెట్టబడింది.

క్ర. సం.	లోన్ అకౌంట్ నం.	ఆబ్లిగేటర్ (లు) / చట్టబద్ధ వారసు(లు) / చట్టబద్ధ ప్రతినిధు(లు) పేరు	దిగువ తేదీ ప్రకారం ఉన్న మొత్తం బకాయిలు (రూ)	డిమాండ్ నోటీసు తేది మరియు ఎన్‌పిఎ తేది
2.	10006329.	శ్రీ పంచదార్ల రాజు (రుణగ్రహీత) శ్రీమతి పంచదార్ల సన్యాసమ్మ (సహ రుణగ్రహీత)	19.12.2024 నాటికి రూ.17,94,177/- (పదిహేడు లక్షల తొంభై నాలుగు వేల ఒక వందా డెభై ఏడు రూపాయలు మాత్రమే)	19.12.2024 & 08.12.2024
ఆస్తి షెడ్యూల్: షెడ్యూల్-ఎ : కృష్ణాజిల్లా, విజయవాడ, ఎస్ఆర్ఓ పటమట, పెనమలూరు మండలం, యనమలకుదురు గ్రామం, ఆర్.ఎస్.నం.47/2 లో సైట్ పరిధి 300 చ.గ.లు. లేదా 250.83 చ.మీ.లు. మరియు క్రింది విధమైన **హద్దులు : తూర్పు** : 24.0 అ.లు. వెడల్పు రోడ్డు 45.0 అ.లు., **దక్షిణం** : వెలగపుడి నారాయణరావు ఆస్తి 60.0 అ.లు., **పడమర** : హోసన్న మినిస్ట్రీ ఆస్తి 45.0 అ.లు., **ఉత్తరం** : కసాని వెంకట నరేంద్ర ఆస్తి (నరేంద్ర అవెన్యూస్). **షెడ్యూల్-బి** : షెడ్యూల్-ఎలో నిర్మించబడిన శ్రీ పంచదార్ల రాజు పేరు మీద ఉన్న వైడ్ సెటిల్‌మెంట్ డీడ్ నం.3783/2013 "షణీంద్ర అవెన్యూ" యొక్క 1వ అంతస్తు, ఫ్లాట్ నం.ఎఫ్‌ఎఫ్-3లో అవిభక్త ఉమ్మడి వాటా 20 చ.గ.లు. లేదా 16.72 చ.అ.లు. తో పాటు కామన్ ఏరియా, బాల్కానీ, 60 చ.అ.లు. కార్ పార్కింగ్ తో దానికి జోడించబడిన మరియు సౌలభ్య హక్కులు. క్రింది విధమైన **సరిహద్దులు : తూర్పు** : ఓపెన్ టు స్కై, **దక్షిణం** : ఓపెన్ టు స్కై, **పడమర**: మెట్లకేస్ మరియు కామన్ కారిడార్, **ఉత్తరం** : ఈ మరియు ఫ్లాట్ నం.ఎఫ్‌ఎఫ్-4 మధ్య ఉమ్మడి గోడ.				
5.	9565723	శ్రీ ఖాజా అబ్దుల్ మజీద్ షేక్ (రుణగ్రహీత) శ్రీమతి షేక్ మస్తాన్ బీబి (సహ రుణగ్రహీతలు)	16-12-2024 నాటికి రూ. 22,88,555/- (ఇరవై రెండు లక్షల ఎనభై ఎనిమిది వేల ఐదు వందల యాభై ఐదు రూపాయలు మాత్రమే)	16.12.2024 & 08.12.2024
ఆస్తి షెడ్యూల్: గుంటూరు జిల్లా, నల్లపాడు ఉపజిల్లా, పేరేచెర్ల గ్రామ పంచాయతీ ఏరియా, పేరేచెర్ల గ్రామం, ఫ్లాట్ నం.లు. 16పి మరియు 29పి శ్రీ భీమవరపు లక్ష్మీనారాయణ పేరు మీద ఉన్న వైడ్ రిజిస్టర్డ్ సేల్ డీడ్ నం.873/2016 మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ సైట్ విభజించబడని మరియు పేర్కొనబడని వాటా 43 చ.గ.లు. 'ఎ' షెడ్యూల్ ఆస్తి అభిప్రాయంలో "సాయి కృప ఎన్‌క్లేవ్" యొక్క రెండవ అంతస్తులో ఉన్న ఫ్లాట్ ప్లింత్ ఏరియా 1025 చ.అ.లు. (కామన్ ఏరియాలు మరియు ఒక కార్ పార్కింగ్ ఏరియా) మరియు క్రింది విధమైన **హద్దులు : 'ఎ' షెడ్యూల్ తూర్పు** : 60' వెడల్పు రోడ్డు, **దక్షిణం** : ఫ్లాట్ నం.29బి మరియు 17ఎ మిగిలిన భాగం, **పడమర** : 40' వెడల్పు రోడ్డు, **ఉత్తరం** : అనుబంధన ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఆస్తి. ఈ సరిహద్దుల సైట్ అవిభక్త మరియు పేర్కొనబడని వాటా కొలత 43 చ.గ.లు. సైట్ మొత్తం విస్తీర్ణం 2057 చ.గ.లు. **"బి" షెడ్యూల్** : "సాయి కృప ఎన్‌క్లేవ్" యొక్క రెండవ అంతస్తులో ఉన్న ఒక సెమీ ఫినిష్డ్ ఫ్లాట్ బేరింగ్ నం.304 తో ప్లింత్ ఏరియా 1025 చ.అ.లు. (కామన్ ఏరియా మరియు ఒక కార్ పార్కింగ్ ఏరియాతో సహా) మరియు అన్నీ సౌకర్యాలు మరియు సాధారణ మరియు ఉమ్మడి హక్కులతో పాటు దాని అనుబంధమైన సౌలభ్య హక్కులు మొదలైనవి. ఉన్న **హద్దులు : తూర్పు** : గ్రౌండ్ లో ఓపెన్ ఏరియా, **దక్షిణం** : గ్రౌండ్ లో ఓపెన్ ఏరియా, **పడమర** : కామన్ మెట్లకేస్ మరియు కామన్ కారిడార్, **ఉత్తరం** : ఓపెన్ టు స్కై.				

*తదుపరి వడ్డీతో, అదనంగా వడ్డీ సంబంధిత డిమాండ్ నోటీసులో తెలిపిన మరింత ప్రత్యేకంగా వివరించిన రేటు వద్ద, అదనపు వ్యయాలు, ఖర్చులు, చార్జీలు వగైర చెల్లించవలసిన మరియు/లేదా తెలిసినమేర తేదివరకు అనుభవించినవి. ముందు చెప్పి టిసిహెచ్‌ఎఫ్‌ఎల్‌కు చెల్లించుటకు బాండ్ రాసి ఇచ్చినవారసు(లు) విఫలంచెందినట్లయితే, సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద పై సెక్యూర్డ్ అస్సెట్(లు)/స్థిరాస్తు(లు) ఎదురుగా టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ తదుపరి చర్యలు సిద్ధమవుతుంది మరియు ఖర్చులు మరియు తదుపరి పర్యావసనాలకు బాండ్ రాసి ఇచ్చినవారసు(లు)/చట్టబద్ధవారసు(లు)/చట్టబద్ధప్రతినిధు(లు) వర్తించే నియమాలకు మొత్తం బాధ్యత వహిస్తారు.

బాండ్ రాసి ఇచ్చినవారసు(లు)/చట్టబద్ధవారసు(లు)/చట్టబద్ధప్రతినిధు(లు) టిసిహెచ్‌ఎఫ్‌ఎల్ వారి ముందస్తు అనుమతి లేకుండా ఏవిధంగాను అమ్ముట, విక్రయించుట లేదా ఇతర ఏ రకంగాను ముందు చెప్పిన సెక్యూర్డ్ అస్సెట్(లు)/స్థిరాస్తు(లు) బదిలీ చేయడం చట్టం క్రింద నిషేదించబడింది. చట్టం యొక్క నిబంధనలను లేదా దానిపై చేసిన నిబంధనలను ఉల్లంఘించే లేదా ప్రోత్సహించే ఏ వ్యక్తి అయినా చట్టం ప్రకారం అందించిన విధంగా జైలు శిక్ష మరియు/లేదా జరిమానా విధించబడతాయి.

ప్రదేశం : ముంబై — సం/- అధీకృత అధికారి
తేది : 25.12.2024 — టాటా క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ కొరకు

Chola Enter a better life — చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

కార్పొరేట్ ఆఫీసు : "చోల క్రెస్ట్" సి54&55, సూపర్ బి-4, తిరు వి క ఇండస్ట్రీయల్ ఎస్టేట్, గ్యూండీ, చెన్నై- 600032.
బ్రాంచి చిరునామా : 1వ & 4వ అంతస్తు, శాంతి ప్లాజా, డోర్ నం.59-14-2ఎ, గాయత్రి నగర్, బెంజ్ సర్కిల్, విజయవాడ-520008.
బ్రాంచి చిరునామా : 1వ & 2వ అంతస్తు, డోర్ నం.44-65/1ఎ, టౌన్ వార్డు నం.18, బ్లాక్ నం.2, టి.ఎస్.నం.1847, ఎస్‌ఎల్‌వి ఆర్కేడ్, కొల్ల ఫారం సెంటర్, చంద్రమౌళి నగర్ ఎక్స్‌టెన్షన్, గుంటూరు (ఆం.ప్ర)-522007.

ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు.

జోనల్ ఆఫీసు, విజయవాడ, 1వ అంతస్తు, ఇన్ఫినిటీ ప్లాజా, డోర్ నం.59ఎ-21-7/3, హైస్కూల్ రోడ్, పటమట, విజయవాడ, ఆం.ప్ర-520007, టెలి: 0866-2431225.

AX76/Vijayawada/SARFAESI/2024-25

పక్షపాతంలేకుండా
అక్నాలెడ్జిమెంట్ ద్వారా/ హ్యాండ్ డెలివరీతో స్పీడ్ పోస్టు
(రూల్ 8(1)) స్వాధీనతా ప్రకటన

[illegible]

3. కంభ సత్యనారాయణ యజమానియైన, గుంటూరు, నరసరావుపేట, బిసి కాలనీ, ఉప్పల పాడు గ్రామం, ప్లాట్ నం.31లోగల డోర్ నం.93&95లో 239.08చ.గ.ల విస్తీర్ణంతోనివాస ఆస్తి యొక్క ఈక్విటేబుల్ తాకట్టు. సెర్సాయి అసెట్ ఐడి: 200060250665. ఉత్తరం వైపు: ప్లాట్ నం.30 సైటు 52.04అ.లు, తూర్పు వైపు: చింతగుంట రామ గోపాల్ రెడ్డి సైటు 43.00అ.లు, పడమర వైపు: 20 అ.లు వెడల్పు రోడ్డు 43.00అ.లు, దక్షిణం వైపు: ప్లాట్ నం.32 సైటు 47.09అ.లు.

తేది:23.12.2024 చీఫ్ మేనేజర్, & అధీకృత అధికారి,
ప్రదేశం: గుంటూరు విజయవాడ జోన్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర.

బహిరంగ ప్రకటన

ICICI Bank శాఖ కార్యాలయం : ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హొసూర్ మెయిన్ రోడ్డు బెంగళూరు-560068

క్రింది రుణగ్రహీతలు మరియు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ (దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ ద్వారా ఐసిఐసిఐ బ్యాంక్‌కు కేటాయించబడిన అంతర్లీన సమూహంపై)ల మధ్య కుదిరిన రుణ ఒప్పందానికి అనుగుణంగా గృహ రుణ సదుపాయానికి సంబంధించి భద్రత అమలుకు సంబంధించి వారు సెక్యూర్డ్ క్రెడిటార్ నుండి పొందిన రుణాల సదుపాయం యొక్క అసలైన మరియు వడ్డీని తిరిగి చెల్లించడంలో డీఫాల్ట్ అయ్యారు మరియు రుణాలు పని చేయని ఆస్తులు (ఎన్‌పిఎ) గా వర్గీకరించబడ్డాయి. సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్-2002, సెక్షన్ 13(2) క్రింద వారికి నోటీసు జారీ చేయబడింది, వారి చివరిగా తెలిసిన చిరునామాలపై అది అందించబడలేదు అందువల్ల ఈ పబ్లిక్ నోటీసు ద్వారా వారికి తెలియజేయడమైంది.

క్ర సం.	రుణగ్రహీతలు/సహ రుణగ్రహీతలు/హామీదారుల యొక్క పేర్లు మరియు చిరునామా (డిహెచ్ఎఫ్ఎల్ పాత లాన్ మరియు ఐసిఐసిఐ కొత్త లాన్)	అమలు చేయబడిన అసెట్ / సెక్యూర్ అసెట్ ఆస్తి చిరునామా	నోటీసు పంపిన తేది / నోటీసు తేది నాటికి బకాయి మొత్తం	ఎన్‌పిఎ తేది
1.	సిరాజ్ సింగరాయకొండ / వజిర షేక్ / 7-23 సెంటర్, పేరేచెర్ల, గుంటూరు, పేరేచెర్ల, గుంటూరు-522005 / QZGTR00005036171	నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, ఫిరంగిపురం ఉపజిల్లా, ఫిరంగిపురం గ్రామ పంచాయతీ మరియు గ్రామం లో డో.నం.408 విస్తీర్ణం ఎ.లు. 0.76 సెంట్లు. మింజుమల్ 16వ బ్లాక్, వసంత్ నగర్, డో.నం.15 **హద్దులు : తూర్పు :** రేపుడి నాగేశ్వరరావు ఆర్‌సిసి దాబా ఇల్లు 52 అ.లు., **దక్షిణం :** పంచాయతీ బజారు 21 అ.లు., **పడమర :** రేపుడి మోయుజు స్థలం 52 అ.లు., **ఉత్తరం :** రేపుడి మోయుజు స్థలం 21 అ.లు. ఈ పై సరిహద్దుల సైట్ పరిధి ఎ.లు. 0.02 1/2 సెంట్లు. లేదా 121 చ.గ.లు. లేదా 101.156 చ.మీ.లు. ఆర్‌సిసి దాబా ఇంటి ఏరియా నిర్మాణం లేదా 817 చ.అ.లు. టాయిలెట్ మరియు బాత్రూము ఏరియా 63 చ.అ.లు. సర్వీస్ నం.4217 మరియు దాబా ఇంటికి కేటాయించబడిన ఇతర చెందిన సైట్ అనగా తలుపులు, కిటికీలు మొదలైనవి.	23/10/2024 Rs. 13,57,036.22/-	09/04/ 2024

నోటీసు యొక్క ప్రత్యామ్నాయ సేవ కోసం చర్యలు తీసుకోబడుతున్నాయి. పై రుణగ్రహీతలు/మరియు/లేదా వారి హామీదారులు (వర్తించే విధంగా) ఈ నోటీసును ప్రచురించిన తేదీ నుండి 60 రోజుల వ్యవధిలోపు బకాయి ఉన్న చెల్లించాలని సూచించారు. లేకపోతే సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్-2002 నిబంధన ప్రకారం తదుపరి చర్యలు తీసుకోబడతాయి.

అధీకృత అధికారి
తేది : 24 డిసెంబరు, 2024, ప్రదేశం : విజయవాడ ఐసిఐసిఐ బ్యాంక్ టీమ్

ప్రజాశక్తి
www.prajasakti.com

సొమ్మొకడిది...సోకొకడిది

- బ్యాంకుల్లో పెరిగిపోతున్న పారు బకాయిలు
- వాటి రద్దుతో లాభపడుతోంది కార్పొరేట్ శక్తులే
- 'దివాలా' పేరుతో బ్యాంకులకు టోకరా
- మోసగాళ్లందరూ పాలకుల సన్నిహితులే

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ తొలి పది సంవత్సరాల పాలనలో దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థ అక్షరాలా రూ.16.11 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసింది. మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో రద్దు చేసిన బ్యాంకు రుణాల విలువ రెండు లక్షల కోట్ల రూపాయలు మాత్రమే. ఈ మాత్రానికే యూపీఏ-2 ప్రభుత్వం పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిందంటూ అప్పటి ప్రతిపక్ష ఎన్డీఏ నానా యాగీ చేసింది. 2008లో యూపీఏ ప్రభుత్వం అరవై వేల కోట్ల రూపాయల వ్యవసాయ రుణాలను మాత్రమే రద్దు చేసింది. దీనికే ఆ నాడు ఎన్డీఏ, దానికి బాకా ఊదిన కొన్ని పత్రికలు పెద్ద ఎత్తున గగ్గోలు పెట్టాయి. ఇది ప్రజాకర్షక దుష్ప్రవర్తన అంటూ నిందలు వేశాయి.

అయితే ఇప్పుడు ఎన్డీఏ ప్రభుత్వం రద్దు చేసిన రుణాలు అప్పుల ఊబిలో కూరుకుపోయిన అన్నదాతలవి కావు. బడా కార్పొరేట్ శక్తులు, మోసగాళ్లవి. వీరిలో అనేక మంది మోడీకి సన్నిహితులని తెలుస్తోంది. మోడీ ప్రభుత్వం రద్దు చేసిన రూ.16.11 లక్షల కోట్ల రుణాలతో ఆ పది సంవత్సరాల కాలంలో బడ్జెట్లలో విద్యకు కేటాయించిన మొత్తాన్ని పోల్చి చూస్తే అందులో 40 శాతం కంటే తక్కువగానే ఉంది. ఆరోగ్య రంగానికి జరిపిన కేటాయింపులైతే రుణ మాఫీ మొత్తంలో సగమే. ఈ నేపథ్యంలో దేశంలోని బ్యాంకులు అందించిన రుణాలు, వాటిలో పారు బకాయిలపై కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి, ప్రసారభారతి మాజీ సీఈఓ, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన రాజ్యసభ మాజీ సభ్యుడు జవహర్ సిర్‌కార్ 'ది వైర్' పోర్టల్‌కు అందించిన విశ్లేషణాత్మక కథనం....

నష్టపోయింది ప్రజలే

మోడీ ప్రభుత్వ రుణ మాఫీల కారణంగా నష్టపోయింది ఎవరు? ప్రభుత్వం కాదు. ఎందుకంటే అది ప్రజాధనం కాబట్టి. నష్టపోయింది మనమే లేదా బ్యాంకులు. బ్యాంక్ వినియోగదారులు, డిపాజిట్‌దారులు అయిన సామాన్య ప్రజలే ఎక్కువగా నష్టపోయారు. ఆ విషయం మనకు తెలియడం లేదు. కనీసం మనకు సమాచారం కూడా ఇవ్వరు. మరి నష్టపోయిన ఈ సొమ్మును బ్యాంకులు ఎలా రాబట్టుకుంటున్నాయి? అవి అందించే ప్రతి చిన్న సేవకూ అధికంగా యూజర్ ఛార్జీలు వడ్డిస్తున్నాయి. ఈ ఛార్జీలపై కొన్నిసార్లు సమాచారం ఇస్తున్నాయి. మరికొన్ని సందర్భాలలో అదీ లేదు. రుణాలు తీసుకునే వారి నుండి వసూలు చేస్తున్న వడ్డీ రేటు పెరిగిపోతోంది. కార్పొరేట్ శక్తులు, పారిశ్రామికవేత్తలకు రుణాలు ఇచ్చి మునిగిపోతున్నామని తెలిసి కూడా బ్యాంకులు మళ్లీ మళ్లీ వారికే అప్పులు మంజూరు చేస్తున్నాయి.

రుణాలలో పారు బకాయిలు

గత పది సంవత్సరాల కాలంలో ప్రధాని మోడీ 1,600 చట్టాలను మందబలంతో రద్దు చేశారు. అది కూడా నిమిషాల వ్యవధిలోనే జరిగిపోయింది. కానీ బ్యాంక్ రుణాల రద్దుకు వీలు కల్పిస్తున్న నిబంధనలను మాత్రం సవరించలేదు. పునఃపరిశీలించనూ లేదు. ఇప్పుడు బ్యాంకింగ్ చట్టాలకు సవరణలు చేస్తున్నప్పటికీ ఈ అంశాలను వాటిలో ప్రస్తావించలేదు. రుణాలు మాఫీ చేయడం ద్వారా పాలకులు బ్యాంకుల ఆర్థిక స్థితిగతులను దెబ్బతీస్తున్నారు. రుణాల మాఫీ అనేది చట్టబద్ధమే అయినప్పుడు, సాధారణ బ్యాంకింగ్ కార్యకలాపమే అయినప్పుడు దానిపై ఇంత రాద్ధాంతం ఎందుకు? సాధారణంగా బ్యాంక్ రుణాలలో పారు బకాయిలు 0.5 నుండి 2 శాతం వరకూ ఉంటాయి. దక్షిణ కొరియా, కెనడా, స్కాండినేవియన్ దేశాల్లో ఇది 0.3 శాతమే. స్విట్జర్లాండ్, అమెరికాల్లో బ్యాంక్ రుణాలలో రానిబాకీలు ఒక శాతం కంటే తక్కువగానే ఉన్నాయి. జర్మనీ, జపాన్‌లో ఇది 1.25 శాతంగా ఉంది. అనేక యూరోపియన్ యూనియన్ దేశాలలో కూడా పారు బకాయిలు రెండు శాతం లోపే ఉన్నాయి. ఇటలీలో మాత్రం ఇది 2.8 శాతం. బ్యాంక్ రుణాలలో పారు బకాయిల వాటా విషయానికి వస్తే చైనాలో 1.66 శాతం, మలేసియాలో 1.72 శాతం, ఇండొనేషియాలో 2.15 శాతం, వియత్నాంలో 2.32 శాతం, బ్రెజిల్‌లో 2.64 శాతం, థాయ్‌లాండ్‌లో 2.84 శాతంగా ఉంది. బ్యాంక్ రుణాలలో పారు బకాయిలు అధికంగా ఉన్న దేశాలు కూడా ఉన్నాయి. ఆఫ్రికా, లాటిన్ అమెరికా, తూర్పు యూరోపియన్ దేశాలు ఈ కోవలోకి వస్తాయి. అక్కడ పారు బకాయిల వాటా సుమారు ఐదు శాతంగా ఉంది.

మన దేశంలో మొండి బాకీలు

మరి మన దేశంలో పరిస్థితి ఏమిటి? 2005-2022 మధ్య కాలానికి సంబంధించి ఐఎంఎఫ్ ఓ అధ్యయనం జరిపింది. ఇందులో మోడీ అధికారంలో ఉన్న 2014-2022 మధ్యకాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే భారతీయ బ్యాంకులు ఇచ్చిన మొత్తం రుణాలలో పారు బకాయిల వాటా ఏకంగా 7.85 శాతం ఉంది. ఇది సాక్షాత్తూ ఆర్థిక శాఖ సహాయ మంత్రి ఇచ్చిన సమాచారమే. డిపాజిటర్లు అయిన పేద, మధ్య తరగతి ప్రజలను మోసం చేసి సంపన్నులైన స్నేహితులకు లబ్ది చేకూర్చేందుకే ఇష్టారీతిన రుణ మాఫీలు చేశారు. అయితే ఆ ఎనిమిది సంవత్సరాల తర్వాత పారు బకాయిలు కొంత మేర తగ్గడం మొదలైంది. 2017-18లో పారు బకాయిలు రూ.10,35 లక్షల కోట్లు ఉంటే 2023-24లో రూ.4.75 లక్షల కోట్లకు తగ్గాయి. మోడీ తొలి ఎనిమిది సంవత్సరాల పాలనలో పారు బకాయిలు రూ.72 లక్షల కోట్లకు చేరాయి. మొత్తం రుణాలలో ఇది 6.53 శాతం. ప్రపంచంలోని ఏ గౌరవనీయ దేశం కూడా ఈ గణాంకాలతో సరితూగలేదు.

కార్పొరేట్ వాటాయే అధికం

గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకులు ఇచ్చిన రుణాలు రూ.171 లక్షల కోట్లు. అనేక రాష్ట్రాల వార్షిక బడ్జెట్లను కలిపి చూసినా ఇది ఎక్కువే. బంగ్లాదేశ్, మాల్దీవులలో అవినీతి పాలకుల కారణంగా బ్యాంక్ రుణాలలో పారు బకాయిల వాటా ప్రమాదకరంగా 9 శాతానికి చేరింది. మన దేశంలో పాలక పక్షానికి కొమ్ముకాస్తున్న మీడియా మాత్రం పెరుగుతున్న పారు బకాయిల ప్రమాదాన్ని గుర్తించ నిరాకరిస్తోంది.. ఇప్పటి వరకూ మాఫీ అయిన రూ.16.11 లక్షల కోట్ల రుణాలలో కార్పొరేట్ రంగం వాటా రూ.9.25 లక్షల కోట్లు. రుణాలు సులభంగా పొందేందుకు ఈ రంగానికి సహకరిస్తున్న రాజకీయ నాయకులు, బ్యాంక్ అధికారులకు రివార్డులు ఇవ్వాల్సిందే కదా. ఈ భారీ దోపిడీ గత దశాబ్ద కాలంలో దేశంలో రాజకీయ వ్యవస్థ బలపడడానికి ఉపకరించింది.

'దివాలా' సాకుతో బ్యాంకులకు టోపీ

చాలా మంది బడా బాబులు 'దివాలా' తీసినట్లు ప్రకటించి బ్యాంక్ రుణాలు ఎగవేస్తున్నారు. లేదా ఎంతో కొంత విదిల్చి చేతులు దులుపుకుంటున్నారు. ఉదాహరణకు ఆర్థికంగా ఇబ్బందులలో ఉన్న పది కంపెనీలను పారిశ్రామికవేత్త అదానీ కొనుగోలు చేశారు. అవి అప్పటికే బ్యాంకులకు రూ.62,000 కోట్లు బకాయి పడ్డాయి. అయితే వాటిని అదానీ కొనుగోలు చేసిన తర్వాత బ్యాంకులను ఒప్పించి రూ.16,000 కోట్లకు ఒప్పందం కుదిర్చారు. ఈ లావాదేవీలో బ్యాంకులు తమకు రావాల్సిన బకాయిలలో 74 శాతం కోల్పోయాయి. మోడీ పాలనలో ఇలాంటి లావాదేవీలు అనేకం జరిగాయి.

మోడీ స్నేహితుడైన అనిల్ అగర్వాల్ (వేదాంత) వీడియోకాన్‌ను కొనుగోలు చేశారు. వీడియోకాన్ చెల్లించాల్సిన బ్యాంక్ రుణంలో కేవలం 6 శాతం మాత్రమే బ్యాంకులకు చెల్లించి ఒప్పందం కుదుర్చుకున్నారు. అలాగే ఏబీజీ షిప్‌యార్డ్ రూ.22,800 కోట్లు బకాయి పడితే అందులో ఐదు శాతం మాత్రమే చెల్లించడం జరిగింది. అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ 53 బ్యాంకులకు రూ.49,000 కోట్ల రుణం చెల్లించాల్సి ఉంది. కానీ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ దానిని కేవలం రూ.455 కోట్లకే 'సెటిల్' చేసింది. మొత్తం రుణంలో ఇది 0.92 శాతం మాత్రమే. దివాలా ప్రక్రియ కారణంగా బ్యాంకులు ఏ విధంగా నష్టపోతున్నాయో తెలిపేందుకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయమేమంటే ఖాయిలా పడిన ఈ కంపెనీలన్నీ పాలకులకు సన్నిహితులైన వారి చేతిలోకి వెళుతున్నాయి.

మోడీకి ఒకప్పుడు సన్నిహితులైన నీరవ్ మోడీ, మేహుల్ చోక్సీ, నిషాంత్ మోడీ, అమి మోడీ, నిషాల్ మోడీ, లలిత్ మోడీ, జతిన్ మెహతా, చేతన్, నితిన్ సందేశర, గుజరాత్‌కు చెందిన ఏబీజీ షిప్‌యార్డ్... వీరందరూ బ్యాంకులకు పెద్ద మొత్తంలో కుచ్చుటోపీ పెట్టిన వారే. విజయ్ మాల్యా, డీహెచ్‌ఎఫ్‌ఎల్, యస్ బ్యాంక్, పీఎంసీ బ్యాంక్ సహ పలువురు వ్యక్తులు, సంస్థలు చారిత్రక మోసాలకు పాల్పడ్డాయి.

దారుణమైన క్రూరత్వం !

- గాజాపై ఇజ్రాయిల్ దాడులకు పోప్ ఖండన

వాటికన్ సిటీ : గాజాలో ఇజ్రాయిల్ అడ్డూ అదుపు లేకుండా సాగిస్తున్న ఊచకోతను పోప్ ఫ్రాన్సిస్ తీవ్రంగా ఖండించారు. గాజా చిన్నారులపై బాంబు దాడులను దారుణమైన క్రూరత్వంగా వ్యాఖ్యానించారు. ఈ నెల 20న జాబాలియా శరణార్థ శిబిరంపై ఇజ్రాయిల్ జరిపిన దాడిలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు చిన్నారులతో సహా 12మంది చనిపోయిన ఘటన నేపథ్యంలో పోప్ వ్యాఖ్యలు వెలువడ్డాయి. వాటికన్ సిటీలో ఈ నెల 21న కార్డినాల్స్, బిషప్‌లు, ఫాదర్‌లనుఉద్దేశించి పోప్ ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇది క్రూరత్వం. యుద్ధం కాదు. ఆ విషాదాలు నా హృదయాన్ని కదిలిస్తున్నాయి." అని పోప్ పేర్కొన్నారు. స్కూళ్ళు, ఆస్పత్రులు ఇలా అన్నింటిపై బాంబు దాడులు ముమ్మరంగా జరగడం వల్లనే పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరవలేకపోయారని అన్నారు. పోప్ ప్రసంగించిన మరుసటి రోజు ఆదివారం కేథలిక్ చర్చి ప్రతినిధి కార్డినాల్ పిజాబల్లాను గాజాలోకి ప్రవేశించేందుకు ఇజ్రాయిల్ అనుమతించింది. గాజా నగరంలో ఆయన క్రిస్మస్ వేడుకలు నిరాడంబరంగా నిర్వహించారు.

మతోన్మాద శక్తులపై ఐక్య పోరాటం

- కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పిలుపు

తిరువనంతపురం : కేరళలో క్రిస్మస్ వేడుకల సందర్భంగా సంఘ్ పరివార్ మూకలు విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించిన నేపథ్యంలో మతోన్మాద శక్తులపై పోరాటానికి ప్రజలంతా ఐక్యం కావాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ పిలుపునిచ్చారు. ఇటీవల పాలకల్యాడ్ జిల్లాలోని ఒక పాఠశాలలో క్రిస్మస్ వేడుకలకు స్థానిక విహెచ్‌పి కార్యకర్తలు ఆటంకం కలిగించడాన్ని ఆయన మంగళవారం తీవ్రంగా ఖండించారు. ఇతరుల విశ్వాసాలను అర్థం చేసుకుని, వాటిని ఆమోదించే విశిష్టమైన మనస్తత్వం, పారదర్శకత కేరళ ప్రజలకు వున్నాయని, ఇతరుల సంతోషమే తమదిగా భావిస్తారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రేమను ఇతరులకు పంచడానికి గల అవకాశంగా ప్రతి పండుగను మనం చూడాలన్నారు. పైగా ఒకరి ఉత్సవాలు, వేడుకల్లో మరొకరు పాల్గొనడం కేరళ ప్రజల సాంప్రదాయమని ఆయన తెలిపారు. నేడు కొన్ని మతోన్మాద శక్తులు ఈ సాంప్రదాయాన్ని బలహీనపరచాలని చూస్తున్నాయని, మత విశ్వాసాలను విద్వేష కారణాలుగా మారుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మతోన్మాద శక్తులను ప్రతిఘటించాల్సిన బాధ్యత మనందరిపై వుందన్నారు. మనరాష్ట్ర నిజమైన స్ఫూర్తిని, సాంప్రదాయాన్ని పరిరక్షించాలన్నారు. జీసస్ క్రీస్తు జననమే మానవత్వం, ప్రేమ సందేశాన్ని అందచేస్తున్నాయన్నారు. మనందరం క్రిస్మస్‌ను కలిసి వేడుకగా జరుపుకోవాలన్నారు. కాగా పాలకల్యాడ్ జిల్లాలో పాఠశాలలో చోటుచేసుకున్న మతోన్మాద ఘటనలపై దర్యాప్తునకు ప్రత్యేక పోలీసు బృందాన్ని ప్రభుత్వం నియమించింది.

యుపిలో దళిత బాలుడిపై అమానవీయ దాడి

- పుట్టినరోజు వేడుకకు పిలిచి...అరాచకత్వం
- బట్టలు విప్పించి...చితకబాది...మూత్రం పోసి...
- అవమాన భారంతో బాలుడి ఆత్మహత్య

లక్నో : బిజెపి ఏలుబడిలో ఉన్న ఉత్తరప్రదేశ్‌లో మరో అమానవీయమైన దాడి చోటుచేసుకుంది. తీవ్రమైన కుల వివక్ష, వేధింపుల కారణంగా ఓ దళిత బాలుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. అయితే కేసును నీరుకార్చేందుకు పోలీసులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ఆదిత్య అనే బాలుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని, దీనిపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని, కొన్ని విభేదాల కారణంగా బాలుడు ప్రాణాలు తీసుకున్నాడని వారు చెబుతున్నారు. కానీ మరణానికి ముందు బాలుడు తీవ్రమైన వేధింపులకు గురయ్యాడని అతని కుటుంబం ఆరోపిస్తోంది. బాలుడి బంధువు విజయ్ కుమార్ కథనం ప్రకారం...ఆదిత్యను గ్రామంలో పుట్టినరోజు వేడుకకు పిలిచారు. అక్కడ అతనిని దారుణంగా అవమానించారు. ఇదంతా పథకం ప్రకారం జరిగిందని ఆదిత్యకు తెలియదు. అతని బట్టలు ఊడదీయించి నగ్నంగా చేశారు. తీవ్రంగా కొట్టారు. అతనిపై మూత్రం కూడా పోశారు. ఫిర్యాదు ఇచ్చేందుకు బంధువులు పోలీస్ స్టేషన్‌కు వెళితే వారు దానిని తీసుకోలేదు. ఈ నెల 20 ఘటన జరిగింది. ఆ మరునాడు కానీ జరిగిన దారుణం బంధువులకు తెలియలేదు. రాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత ఆదిత్య ఇంటికి వచ్చాడు. ఉదయం జరిగింది చెప్పాడు. కుటుంబసభ్యులు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ మూడు రోజుల వరకూ పోలీసులు ఫిర్యాదు స్వీకరించలేదు. దీంతో రెచ్చిపోయిన దుండగులు బాలుడిని మరోసారి వేధించారు. దీంతో అవమానం తట్టుకోలేక అతను ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

అమరావతికి అప్పుపై హడ్కో చైర్మన్‌తో మంత్రి చర్చలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజధాని అమరావతి నిర్మాణానికి అప్పుపై హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హడ్కో) చైర్మన్, ఎమ్‌డి సంజయ్ కులశ్రేష్టతో రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి నారాయణ చర్చించారు. మంగళవారం నాడిక్కడ ఆయన హడ్కో కార్యాలయంలో సంజయ్ కులశ్రేష్టతో భేటీ అయిన మంత్రి నారాయణ అమరావతికి రుణ సమీకరణ ప్రక్రియపై చర్చించారు. ఇప్పటికే రాజధాని నిర్మాణం కోసం రూ.11 వేలకోట్ల రుణం ఇచ్చేందుకు హడ్కో అంగీకారం తెలిపింది. అలాగే రాష్ట్రంలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ల ఏర్పాటుపై జిందాల్ సా చైర్మన్ పృధ్వీరాజ్ జిందాల్‌తో చర్చలు జరిపారు. ఇప్పటికే గుంటూరు, విశాఖపట్నంలో రెండు ప్లాంట్‌లను జిందాల్ సంస్థ ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో మరిన్ని ప్లాంట్‌ల ఏర్పాటుపై జిందాల్‌తో మంత్రి నారాయణ చర్చించారు.

ఇళ్లకే పరిమితం కావద్దు

(మొదటి పేజీ తరువాయి)

మహిళలు ఎంతో మంది ఇళ్లలోనే ఉంటున్నారని, ఈ విధానాలను అందుబాటులోకి తీసుకువస్తే అధిక సంఖ్యలో ఉపాధి పొందుతారని చెప్పారు. మహిళల్లో ఎంతో సమర్థత, నైపుణ్యం ఉందని, కుటుంబ వ్యవహారాలు, బాధ్యత కారణంగా చాలా మంది ఇళ్లకే పరిమితం అవుతున్నారని అన్నారు.

వర్క్ ఫ్రం హోమ్, కో-వర్కింగ్ స్పేస్ విధానాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ఆర్థిక కార్యకలాపాలు కూడా పెరుగుతాయన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎంత మంది వర్క్ ఫ్రం హోమ్ విధానంలో పని చేస్తున్నారు, వారి అవసరాలు ఏంటనే సమాచారం కూడా సేకరించాలని ఈ సందర్భంగా అధికారులను సిఎం ఆదేశించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ల ఏర్పాటుకు రాష్ట్రంలో ఐదు ప్రాంతాల్లో భవనాలను గుర్తించాలని కూడా సూచించారు. ఆయా ప్రాంతాల్లోని పరిశ్రమలను, విద్యా సంస్థలను ఇన్నోవేషన్ హబ్‌లకు అనుసంధానం చేయాలని నిర్దేశించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 2025 డిసెంబరు నాటికి 'కో వర్కింగ్ స్పేస్' విధానాన్ని అమలు చేసి 1.50 లక్షల సీట్లు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఒక్కో సీటుకు 50 - 60 చదరపు అడుగుల విస్తీర్ణం అవసరమని, ప్రభుత్వ, ప్రైవేటు భవనాల్లో ఈ వర్కింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇప్పటికే 22 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని గుర్తించామని వెల్లడించారు.

ఆగని కోత

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేశారు. ఇది సముద్ర తీరానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. కాకినాడ పట్టణానికి చెందిన 16 వేల మంది లబ్ధిదారులకు ఇక్కడ ఇళ్లను కేటాయించారు. ప్రస్తుతం ఇక్కడ ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. తీరం కోత ఇదే మాదిరిగా కొనసాగితే, సునామీ లాంటి విపత్తులు సంభవిస్తే ఈ కాలనీ మొత్తం తుడుచిపెట్టుకుపోయే ప్రమాదం ఉంది. దీంతో, కొంతమంది లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతానికి ప్రమాదం లేకపోయినా ప్రకృతి విపత్తులు, భారీ తుపాను వస్తే కాలనీ వరకూ కోతకు గురయ్యే అవకాశముంది.

డ్రెడ్జింగ్ కారణంగానే అలల తాకిడి

కాకినాడ డీప్ వాటర్ పోర్టులో ఎగుమతులు, దిగుమతుల కార్యకలాపాల కోసం నిరంతరం సముద్ర తీర ప్రాంతంలోని కుంభాభిషేకం సమీపంలో జిఎంఆర్ ఎనర్జీ లిమిటెడ్ సంస్థ డ్రెడ్జింగ్‌ను నిర్వహిస్తోంది. దీంతో, ఉప్పాడ వైపు అలల తాకిడి ఎక్కువగా ఉంటోంది. దీనికి తోడు తీర ప్రాంత రక్షణ చర్యలు కూడా లేకపోవడంతో సముద్రం ముందుకు వస్తోందని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు.

సిపిఎం ఒరిస్సా రాష్ట్ర కార్యదర్శిగా సురేష్ పాణిగ్రాహి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం ఒరిస్సా రాష్ట్ర కార్యదర్శిగా సురేష్ పాణిగ్రాహి ఎన్నికయ్యారు. 30 మందితో రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక అయింది. సిపిఎం ఒరిస్సా రాష్ట్ర మహాసభ కటక్‌లో జరిగింది. పార్టీ సైద్ధాంతిక, నిర్మాణ ప్రభావాన్ని క్షేత్ర స్థాయిలో విస్తరించాలనే లక్ష్యాన్ని మహాసభ తీసుకుంది. సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు సూర్యకాంత మిశ్రా, నీలోత్పాల్ బసు, కేంద్ర కమిటీ సభ్యులు అమ్రారామ్, అలీ కిషోర్ పట్నాయక్, ఎమ్మెల్యే లక్ష్మణ్ ముండా తదితరులు ప్రసంగించారు. పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదం ఎదుర్కొంటున్న ప్రపంచ సవాళ్లను వివరించారు. మతోన్మాద శక్తులను ఎదుర్కోవడాని, క్షేత్ర స్థాయిలో ఐక్యతను బలోపేతం చేయాలని పిలుపు ఇచ్చారు. ఎర్ర జెండా కార్మికవర్గానికి ఆశాకిరణంగా ఉందని పునరుద్ఘాటించారు. ఈ మహాసభకు మొత్తం 166 మంది ఎన్నికైన ప్రతినిధులు, 22 మంది పరిశీలకులు హాజరయ్యారు. సంతాప తీర్మానాన్నిసీనియర్ నేత జనార్దన్ పాటి ప్రవేశపెట్టారు. ఈ మహాసభలో 30 మంది సభ్యులతో రాష్ట్ర కమిటీని ఎన్నుకుంది. కొత్త రాష్ట్ర కార్యదర్శిగా సురేష్ పాణిగ్రాహి ఎన్నికయ్యారు.

సిపిఎం ఉత్తరాఖండ్ రాష్ట్ర కార్యదర్శి రాజేంద్ర పురోహిత్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం ఉత్తరాఖండ్ రాష్ట్ర కార్యదర్శి రాజేంద్ర పురోహిత్ ఎన్నికయ్యారు. కర్ణప్రయాగలో ఇటీవల జరిగిన పార్టీ రాష్ట్ర 8వ మహాసభలో 25 మందితో రాష్ట్ర కమిటీ ఎన్నికయింది. 9 మంది రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్నికయ్యారు. కేంద్ర, రాష్ట్ర బిజెపి ప్రభుత్వాల కార్పొరేట్, మతతత్వ విధానాలపై పోరాటాన్ని ఉధృతం చేయాలని మహాసభ పిలుపు ఇచ్చింది. ఈ మహాసభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు తపన్‌సేన్, కేంద్ర కమిటీ సభ్యులు విజూ కృష్ణన్ తదితరులు ప్రసంగించారు. అంతర్జాతీయ, జాతీయ రాజకీయ అంశాలతో పాటు పోరాటాల ప్రాముఖ్యత, పార్టీ నిర్మాణం, విస్తరణ గురించి వివరించారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో 25 మంది సభ్యులతో కూడిన రాష్ట్ర కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. రాజేంద్ర పురోహిత్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

సిపిఎం గోవా రాష్ట్ర కార్యదర్శిగా విక్టర్ సావియో బ్రాగాంకా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం గోవా రాష్ట్ర కార్యదర్శిగా విక్టర్ సావియో బ్రాగాంకా ఎన్నికయ్యారు. పార్టీ గోవా రాష్ట్ర మహాసభ వాస్కోడిగామాలో ఇటీవల నిర్వహించారు. మహాసభకు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మరియం ధావలే తదితరులు హాజరయ్యారు. బిజెపి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలకు పిలుపు ఇచ్చారు. మహాసభలో గోవా రాష్ట్ర కార్యదర్శి విక్టర్ సావియో బ్రాగాంకా రాజకీయ, నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టారు. ఈ నివేదికను చర్చించి మహాసభ ఆమోదించింది. అనంతరం రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. రాష్ట్ర కార్యదర్శిగా విక్టర్ సావియో బ్రాగాంకా ఎన్నికయ్యారు. మహారాష్ట్ర నుండి వివేక్ మొంటెరో, సుగంధి మొంటెరో, కర్ణాటక నుండి కుట్టి మహాసభకు హాజరయ్యారు.

కుంభకర్ణ నిద్రలో కేంద్ర ప్రభుత్వం

- నిత్యావసరాల ధరల పెరుగుదలతో సామాన్యులు విలవిల
- మోడీ సర్కార్‌పై రాహుల్ ఆగ్రహం

న్యూఢిల్లీ : నిత్యావసరాల ధరల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రోజువారీ అవసరాల విషయంలో కూడా వారు రాజీ పడి బతకాల్సి వస్తోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. అధిక ధరలతో ప్రజలు అష్టకష్టాలు పడుతుంటే కేంద్ర ప్రభుత్వమేమో 'కుంభకర్ణుడి'లా నిద్రపోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ ఇటీవల గిరినగర్‌లోని ఓ కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. అక్కడ ఉన్న గృహిణులతో ముచ్చటించారు. ఆహార వస్తువుల ధరల పెరుగుదలతో తాము పడుతున్న ఇబ్బందులను వారు ఆయనకు తెలియజేశారు. ఆ పర్యటనకు సంబంధించిన వీడియోను రాహుల్ మంగళవారం తన సామాజిక మాధ్యమ హ్యాండిల్స్‌లో షేర్ చేశారు.

'కొద్ది రోజుల క్రితం నేను ఓ స్థానిక కూరగాయల మార్కెట్‌ను సందర్శించాను. కస్టమర్లతో కలిసి దుకాణాల వద్దకు వెళ్లినప్పుడు వ్యాపారులతో మాట్లాడాను. సామాన్య ప్రజల బడ్జెట్ ఏ విధంగా క్షీణించిందో, ద్రవ్యోల్బణం ప్రతి ఒక్కరినీ ఎలా ఇబ్బంది పెట్టిందో తెలుసుకున్నాను' అని రాహుల్ ఆ పోస్టులో తెలిపారు. పెరుగుతున్న ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, చిన్న చిన్న రోజువారీ అవసరాలకు సైతం రాజీ పడాల్సి వస్తోందని వివరించారు.

'వెల్లుల్లి, బఠానీ, పుట్టగొడుగులు, ఇతర కూరగాయల ధరలను గురించి మహిళలతో చర్చించాను. ప్రజల అనుభవాలు విన్నాను. కిలో వెల్లుల్లి ధర రూ.400, బఠానీల ధర రూ.120 పలుకుతోంది. ఈ ధరలు ప్రతి ఒక్కరి బడ్జెట్‌ను కుదిపేశాయి' అని రాహుల్ తన పోస్టులో తెలిపారు. ఇలాంటప్పుడు ప్రజలు ఏం తింటారు, ఎంత ఆదా చేస్తారని ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'టీ తాగుతూ మాట్లాడుతుంటే మహిళలు తమ జీవితాలలో ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ప్రజల ఆదాయం ఎదుగూ బొదుగూ లేకుండా ఎలా ఉందో, నియంత్రణ లేకుండా ద్రవ్యోల్బణం ఎలా పెరుగుతోందో అర్థం చేసుకున్నాను. పొదుపు చేయడం అసంభవమని, రిక్షా కోసం పది రూపాయలు ఖర్చు చేసేందుకు కూడా ప్రజలు వెనకాడుతున్నారని, ఆ మొత్తం ఆహారం కోసం వినియోగిస్తున్నారని తెలుసుకున్నాను' అని అన్నారు.

ద్రవ్యోల్బణ ప్రభావాన్ని ఎదుర్కొంటున్న వారు తమ అనుభవాలను తనతో పంచుకోవాలని రాహుల్ కోరారు. 'ఈ సమస్యతో మీరు ఎలా ఇబ్బందులు పడుతున్నారో చెప్పండి. మార్కెట్ పరిస్థితులు మీకు తెలుసు. మీ వ్యక్తిగత అనుభవాలను మీరు కూడా మాతో పంచుకోండి' అని సూచించారు. కిలో వెల్లుల్లి ఒకప్పుడు రూ.40 ఉండేదని, ఇప్పుడు రూ.400 అయిందని రాహుల్ ఆ పోస్టులో ప్రస్తావించారు.

మధ్యప్రాచ్య దేశాలపై అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధోన్మాదం

గాజా : మధ్య ప్రాచ్యంలో ఒకదాని తర్వాత మరొకటి వరుసగా పలు దేశాలు అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధ కాంక్షకు, దాడులకు గురవుతున్నాయి. పాలస్తీనాలో ఇజ్రాయిల్ ఊచకోతను ప్రతిఘటించిన, నిరసించిన దేశాలపై ఇజ్రాయిల్ వరుసగా దాడులకు దిగుతూ వస్తోంది. గాజా, లెబనాన్, సిరియా, తాజాగా యెమెన్‌లపై దాడులకు పాల్పడుతోంది. పశ్చిమాసియావ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి ప్రతిఘటనకు తావు లేకుండా వుండేందుకు అమెరికా అమలు చేస్తున్న కుట్రలో భాగంగానే ఇదంతా జరుగుతోంది. ఆయా ప్రాంతాల్లో గల ప్రగతిశీల ప్రభుత్వాలకు స్వస్తి పలికేలా ఇజ్రాయిల్‌తో కలిసి అమెరికాక చర్యలు తీసుకుంటోంది. గాజాలో మారణహోమానికి పాల్పడి వేల సంఖ్యలో అమాయకుల ప్రాణాలు బలిగొంది. ఆ తర్వాత లెబనాన్‌పై దాడులు మొదలుపెట్టింది. రాజధాని బీరుట్‌లో ఇతర జన సమ్మర్దం గల ప్రాంతాల్లో తీవ్రంగా బాంబు దాడులకు దిగింది. పాలస్తీనాకు ఎల్లప్పుడూ సంఘీభావం తెలుపుతూ వచ్చిన మరో దేశం సిరియాలో భూభాగాలను ఇజ్రాయిల్ ఆక్రమిస్తూ వస్తోంది. దేశంలో కొన్ని ప్రాంతాల్లో అమెరికా బలగాలను సిరియా అడ్డుకోలేకపోయింది. పాలస్తీనా భూభాగంలో పాల్పడినట్లుగా తాజాగా సిరియాపై ఇలాంటి ఆక్రమణలకే దిగుతోంది. ఇక మధ్య ప్రాచ్యంలో నిరుపేద దేశాల్లో ఒకటైన యెమెన్‌పై అమెరికా మిలటరీ బలగాలు దాడులు చేస్తున్నాయి. రాజధాని సానాలో పెద్ద ఎత్తున బాంబు దాడులకు దిగాయి.

హుందాతనానికి ప్రతీక క్యూబా

- అధ్యక్షుడు కానెల్ పునరుద్ఘాటన

హవానా: హుందాతనానికి ప్రతీకగా క్యూబా ఎప్పటికీ నిలుస్తుందని అధ్యక్షుడు మిగుయెల్ డియాజ్ కానెల్ పునరుద్ఘాటించారు. క్యూబా విదేశాంగ మంత్రిత్వ శాఖ 65వ వార్షికోత్సవం, అలాగే క్యూబా విప్లవ 66వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని సోమవారం నాడిక్కడి కన్వెన్షన్ ప్యాలెస్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో కానెల్ ప్రసంగించారు. క్యూబా విదేశాంగ విధాన ప్రతిష్ట, క్యూబా విప్లవ విలువలు విడదీయలేనంతగా మిళితమై ఉంటాయని అన్నారు.

దేశ చరిత్రకు అనుగుణమైన సార్వభౌమత్వ విధానాన్ని కలిగి ఉండే దేశాలు ప్రపంచంలో కొన్నే ఉంటాయని, అందులో క్యూబా ఒకటని క్యూబా ఆర్మీ కమాండర్ ఇన్ చీఫ్ రావుల్ కాస్ట్రో కొస్టారికాలో 2015లో జరిగిన మూడవ సెలాక్ శిఖరాగ్ర సదస్సులో పేర్కొన్న విషయాన్ని కానెల్ ఈ సందర్భంగా ఉటంకించారు. పేద, వర్ధమాన దేశాల ప్రయోజనాలు, హక్కులను పరిరక్షించేందుకు క్యూబా నిర్విరామంగా పోరాడుతుందని కానెల్ ఉద్ఘాటించారు. అత్యంత నైపుణ్యం గల సిబ్బంది, నిస్వార్థంగా, అంకితభావంతో పనిచేసే కామ్రేడ్స్ క్యూబా పతాకం సమున్నతంగా ఎగిరేలా చూడడమే కాదు, దానిని పరిరక్షించుకుంటారని ఆయన చెప్పారు.

ట్రంప్ టారిఫ్‌లతో ద్రవ్యోల్బణానికి రెక్కలు

- నిపుణుల హెచ్చరిక

వాషింగ్టన్ : చైనాతో సహా కొన్ని ఆసియా దేశాలకు చెందిన కంపెనీలను లక్ష్యంగా చేసుకుని అమెరికా విధించాలని భావిస్తున్న కొత్త సోలార్ సెల్ టారిఫ్‌లతో ద్రవ్యోల్బణం పెరుగుతుందని, వినియమ ధరలు కూడా ఆకాశాన్నంటుతాయని అమెరికా మార్కెట్‌లో సరఫరా చెయిన్‌లకు ఆటంకం కలుగుతుందని పలువురు నిపుణులు విశ్లేషిస్తున్నారు.కంబోడియా, మలేసియా, థాయిలాండ్, వియత్నాంలకు చెందిన సోలార్ సెల్స్‌పై 21.31 నుండి 271.2శాతం టారిఫ్‌లు విధిస్తామని అమెరికా వాణిజ్య శాఖ ఈ నెలారంభంలో ప్రకటించింది. తయారీదారు కంపెనీని బట్టి ఈ టారిఫ్‌లు వుంటాయని పేర్కొంది. చైనా నుండి దిగుమతి చేసుకునే సోలార్ సెల్స్ టారిఫ్‌లను 25శాతం నుండి 50శాతానికి రెట్టింపు చేస్తామని డిసెంబరు 11న అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం ప్రకటించింది. ఇవి కొత్త సంవత్సరం జనవరి 1వ తేదీ నుండి అమల్లోకి వస్తాయని తెలిపింది. చైనా సోలార్ సెల్ తయారీ సంస్థలు ఇతర మార్కెట్లలోకి చాలా వేగంగా వ్యాప్తి చెందుతున్నాయని, ఆసియా, ఆఫ్రికా దేశాల వ్యాప్తంగా సౌర విద్యుత్ సంస్థలను విస్తరిస్తున్నాయని హస్టన్ యూనివర్శిటీలో ఇంధన ఫెలో ఇద్ హిర్స్ తెలిపారు. ఈ తరుణంలో అమెరికా కన్నా కూడా ఆ దేశాలు చాలా లాభదాయకమైన మార్కెట్‌ను కలిగివుండే పరిస్థితులు తలెత్తుతున్నాయని ఆయన చైనా డైలీతో వ్యాఖ్యానించారు. ఈ టారిఫ్‌ల వల్ల ముందుగా వినియోగదారుడు ప్రభావితమవుతాడని అన్నారు. ఆ తర్వాత సౌర క్షేత్రాల అభివృద్ధిపై, అమెరికాలో సోలార్ సెల్స్ తయారీపై ప్రభావం చూపుతుందన్నారు. ఈ టారిఫ్‌లు అమల్లోకి వస్తే చాలా వేగంగా ద్రవ్యోల్బణం పెరుగుతుందని హెచ్చరించారు. ప్రస్తుత స్థాయిలోనే ధరలను కొనసాగిస్తూ, అదనంగా వాటికిక 25శాతం టారిఫ్‌లను జోడిస్తే కచ్చితంగా అమెరికాలో సౌరఫలకాల కొనుగోలు మందగిస్తుందని అన్నారు.

గజగజ వణుకుతున్న ఉత్తర భారత్

- హిమాచల్ ప్రదేశ్‌లో భారీ హిమపాతం
- మనాలిలో మంచులో చిక్కుకున్న వందలాది వాహనాలు
- నలుగురు మృతి

షిమ్లా : ఉత్తర భారతావని తీవ్ర చలిలో గజగజ వణికిపోతోంది. హిమాచల్ ప్రదేశ్‌లో భారీ హిమపాతంతో స్థానికులు, పర్యాటకులు అవస్థతలు పడ్డారురాజధాని షిమ్లాతో పాటు కిన్నౌర్, లాహౌల్, స్పితి, కులు, మండి, చంబా, సిర్మౌర్ ప్రాంతాల్లో సోమవారం రాత్రి నుంచి భారీగా మంచుకురుస్తోంది. దీంతో రాష్ట్రం వ్యాప్తంగా 177 రోడ్లు మూసివేశారు. మరోవైపు మనాలిలోనూ హిమపాతం వల్ల పర్యాటకులు ఇబ్బందులు పడ్డారు. వివిధ ప్రాంతాల్లో వందలాది వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. గత 24 గంటల్లో రోడ్లపై మంచుకారణంగా జరిగిన ప్రమాదాల్లో నలుగురు మరణించారు. అనేక మంది గాయపడ్డారు. హిమపాతం కారణంగా నిత్యావసర సరకులు రవాణా, విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అయితే పర్యాటకుల రాక గణనీయంగా పెరుగుతోంది. షిమ్లాలో హోటల్ రూమ్ ఆక్యుపెన్సీ 70 శాతానికి పెరిగింది. ఈ విషయాన్ని సిమ్లా హోటల్ అండ్ టూరిజం స్టేక్‌హోల్డర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎంకె సేథ్ తలిపారు. కాగా అధికారులు పెద్ద ఎత్తున ఆపరేషన్ చేపట్టిన మంచులో చిక్కుకుపోయిన వాహనాలను, పర్యాటకులను రక్షిత ప్రాంతాలకు తరలించారు.

రైతన్న బాట

వే కువ జామున లేచాడు
చేతిన కర్ర పట్టాడు
పశువుల దారిన వెళ్లాడు
మోటలు దండిగా కొట్టాడు
గోజల పేడా తీశాడు
ఒడ్డున గంటలు పూడ్చాడు
గలులు సరిగా చేశాడు
గేదెల పాలు ఇంటికి పంపాడు
నాగలి పట్టి దున్నాడు
గొర్రును చక్కగా తిప్పాడు
నారును మడిలో పంచాడు
నాటును చక్కగా వేయించాడు
ఎరువులు నిండుగా చల్లాడు
కలుపును బాగా తీయించాడు
పచ్చగ పైరును పెంచాడు
గొలుసుల వరిని చూసి మురిసాడు
ధాన్యపు రాసులు పోశాడు
ఎడ్ల బండిలో బస్తాలు తరలించాడు
అవనికి అన్నం పెట్టాడు
రైతన్నని సంబర పడ్డాడు
ఇంటికి పొలానికి బాటలు వేశాడు!

– ఉద్దాళ్ళ రాజేశం, సిద్దిపేట, 99669 46084.

క్రిస్మస్ సంబరాలు

G	Q	C	E	L	V	E	S	Z	L	I	G	H	T	S
D	C	Z	L	F	J	S	R	V	N	U	L	B	Z	B
C	E	L	E	B	R	A	T	E	W	M	J	E	Y	F
Q	F	D	C	W	G	N	R	E	I	N	D	E	E	R
P	F	Z	E	H	J	T	G	C	O	O	K	I	E	S
G	R	A	N	C	R	A	I	R	I	W	B	I	H	C
O	M	E	M	N	O	I	U	K	S	F	V	A	Z	A
R	I	I	S	I	N	R	S	N	D	O	H	J	D	N
N	M	M	S	E	L	E	A	T	E	C	Q	B	W	D
A	G	Z	D	T	N	Y	C	T	M	J	C	P	R	Y
M	I	I	I	U	L	T	T	W	I	A	B	T	E	C
E	V	H	N	Z	W	E	S	S	Q	O	S	B	A	A
N	I	E	N	A	Q	Q	T	F	T	P	N	J	T	N
T	N	G	E	P	Q	I	C	O	P	Y	Z	S	H	E
D	G	A	R	J	W	D	E	Q	E	Y	P	E	B	S

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న ఇంగ్లీషు అక్షరాలలో క్రిస్మస్ సంబరాలకు సంబంధించిన పదాలు ఉన్నాయి. వాటిని కెందనే ఇచ్చాం. అవి ఎక్కడ ఉన్నాయో గుర్తించండి చూద్దాం.

Decorations	Candy Canes	Christmas	Mistletoe
Celebrate	Ornament	Reindeer	Cookies
Lights	Presents	Family	Elves
Giving	Dinner	Wreath	Santa

నేను గీసిన బొమ్మ

ఆలియా,
8వ తరగతి,
జడ్పీ స్కూల్ రాంపూర్, నిజాంపేట,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కళాప్రపంచ దార్శనికుడు



కొందరు చరిత్రలో భాగమవుతారు. మరికొందరు తామే ఒక చరిత్రను సృష్టిస్తారు. అలా చరిత్రను సృష్టించిన భారతదేశ అగ్రశ్రేణి దర్శకుడు, ఎన్నో ప్రత్యేకతల ఆద్యుడు శ్యామ్ బెనెగల్. సమాజాన్ని అత్యంత దగ్గరగా చూపించవచ్చని సినిమా ప్రపంచానికి చూపించారాయన. భూస్వాముల దౌర్జన్యాన్ని, క్రూరత్వాన్ని చూపిస్తూనే, వాళ్ల నీచపు పనులనూ, మహిళల పట్ల వాళ్ల వికృత చేష్టలను ఎత్తిచూపే ధైర్యం చేశారాయన. ఆయన సినిమాల్లో నటించాలంటే నటీనటులు ఎక్కడ నుంచో ఊడిపడక్కర్లేదు. పెద్ద పెద్ద పేర్లతో ఆయనకసలు పనేలేదు. పాత్రల్లో ఒదిగిపోయే తీరుంటే చాలనుకుని నటీనటుల కోసం ఏళ్లకు ఏళ్లు ఎదురుచూసిన సృజనశీలి ఆయన. అంతటి నిరీక్షణ తరువాత తెరకెక్కించిన ప్రతి చిత్రం సినీ జగత్తులో అజరామరంగా నిలిచిపోయింది. ఆయన జీవించింది 90 ఏళ్లయినా.. ఆ చిత్రాలు మాత్రం చరిత్ర ఉన్నంతవరకు విరాజిల్లుతూనే ఉంటాయి.

శ్యామ్ పుట్టింది, పెరిగింది సికింద్రాబాద్ తిరుమలగిరిలో. సినిమా ప్రస్థానం కొనసాగింది మాత్రం ముంబయి నగరవీధుల్లో. తండ్రి శ్రీధర్ బెనెగల్ కర్నాటకకి చెందినవారు. శ్యామ్ మాతృభాష కొంకణి. శ్యామ్‌కి ఇంగ్లీషుపై మంచి పట్టు ఉండేది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్‌లో మాస్టర్ డిగ్రీ చేశారు. తండ్రికి అల్వాల్‌లో ఓ ఫొటోస్టూడియో ఉండేది. అల్వాల్ నుంచి నిజాం కాలేజీ వరకు సైకిల్ మీదే వెళ్లేవారు. ఆ అనుభవంతోనే సైకిల్ పోటీల్లో పాల్గొని ఛాంపియన్‌గా కూడా నిలిచారు. చురుకుగా, చలాకీగా జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్న శ్యామ్‌లో సమాజం పట్ల, అనాదిగా వేళ్లూనుకున్న సాంఘిక వివక్ష పట్ల ఇంతటి నిశిత దృష్టి ఉందని ఆయన సినిమాలు తెరకెక్కించేదాకా ప్రపంచానికి తెలియదు.

హైద్రాబాద్‌లో ఫిలిమ్ సొసైటీ ప్రారంభించేంతగా సినిమాని ఆయన ప్రేమించాడు. సినిమా అంటే కమర్షియల్ ప్రభంజనమే కాదని నిరూపించాడు. కథలకు ప్రాణం పోయడమంటే హంగూ ఆర్భాటాలతో తెరకెక్కించడం కాదని చెప్పాడు. రంగులు వేసుకుని కెమెరా ముందు నటించడమే నటన కాదని, పాత్రల్లో జీవించడమే నిజమైన నటన అని నేర్పించాడు. అందుకే ఆయన సినిమాల్లో నటించాలని పెద్ద పెద్ద స్టార్లు ఎదురుచూసేవారు. సాధారణ వ్యక్తులనే స్టార్లని చేసిన ప్రతిభ ఆయన సొంతం. ఆయన తీసింది 24 చిత్రాలే. అయినా అవన్నీ ప్రభంజనాలు సృష్టించాయి. సమాజాన్ని ఆలోచనల్లో పడేశాయి.

స్నేహితుల సాయంతో ...

సినిమాలపై ఉన్న ఆసక్తితో స్నేహితుల సాయంతో ముంబయి చేరుకున్నారు శ్యామ్. ప్రఖ్యాత నటుడు, దర్శకుడు, నిర్మాత, దగ్గర బంధువు అయిన గురుదత్ ఇంట్లో ఉండి సినిమాలపై మరింత అధ్యయనం చేశారు. మొదట ఓ యాడ్ ఏజెన్సీలో కాపీ రైటర్‌గా పనిచేశారు. ఆ తర్వాత క్రియేటివ్ హెడ్‌గా మారారు. 1962లో తొలిసారిగా గుజరాతీలో 'ఘేర్ బేతాగంగ' పేరుతో ఓ డాక్యుమెంటరీ తెరకెక్కించారు. ఆ తరువాత ఆయన మొదటి సినిమా 'అంకుర్' రూపొందడానికి దాదాపు పదేళ్ల సమయం పట్టింది.

ఆయన తెరకెక్కించిన డాక్యుమెంటరీలు, షార్ట్‌ఫిలిమ్స్ ఒక్కోటి ఒక్కో ఆణిముత్యం. ఆ తరువాత 1974లో తెరకెక్కించిన 'అంకుర్' నుండి 2023 వరకు అంటే ఐదు దశాబ్దాల కాలంలో కేవలం 24 చిత్రాలు తెరకెక్కించారు. ఈ చిత్రాల కోసం ఆయన చేసిన కృషి, సమాజాన్ని దగ్గరగా చూపించేందుకు ఎన్నుకున్న కథ, కథనం అన్నీ ఇప్పటికీ సజీవంగా ఉంటాయి.

'అంకురి'ంచిన సృజన

షబనా ఆజ్మీ, అనంత్‌నాగ్ డెబ్యూ ఫిల్మ్‌గా 'అంకుర్' తెరకెక్కింది. పెత్తందారీ భూస్వామి కోరికకు తలొగ్గిన నిమ్నకుల స్త్రీ దుర్బలత్వాన్ని, ఆమె జీవితంలో ఎదుర్కొన్న అవమానాలు, అవహేళనలు శ్యామ్ తెరకెక్కించిన తీరు భూస్వామ్య వ్యవస్థ దాష్టీకాన్ని కళ్లకి కట్టినట్లు చూపిస్తుంది. ఆ చిత్రంలో మొదటిసారే నటించినా షబనా ఆజ్మీకి జాతీయ ఉత్తమ నటి అవార్డు దక్కేలా చేసింది. అంతలా ఆ పాత్రని తీర్చిదిద్దారు శ్యామ్. ఆయన తెరకెక్కించిన చిత్రాల్లో దాదాపు ఏడు సినిమాల్లో ఆమే ప్రధాన నటి.

రైతుల 'సహకారం'తో ...

1940లో గుజరాత్ పాల రైతుల కోఆపరేటివ్ సొసైటీ గురించి శ్యామ్ తెరకెక్కించిన 'మంథన్' (1976) చిత్రం ప్రజల మధ్య ఐక్యత సృష్టించడం వల్ల ఎంతటి విజయాలు పొందవచ్చో చూపిస్తుంది. గిరీష్ కర్నాడ్, స్మితా పాటిల్, నసీరుద్దీన్ షా, అమ్రీష్‌పురి ఆయా పాత్రల్లో జీవించారు. క్రౌడ్ ఫండింగ్ విధానంలో తెరకెక్కిన చిత్రమిది. సుమారు 5 లక్షల మంది రైతులు, రూ.2 చొప్పున విరాళాలు అందజేశారు. అజ్ఞానం, కులవివక్షతో భిన్న ధృవాలుగా విడిపోయిన ప్రజలను ఏకతాటిపైకి తేవడంలో ఎదురైన సవాళ్లు తెరకెక్కించిన తీరు నేటి సమాజానికీ ప్రతిబింబంగా నిలుస్తాయి. 1976 ఆస్కార్ పురస్కారాలకు ఈ సినిమాకి చోటు కల్పించారు. భారత జాతీయ చలనచిత్రాల పురస్కారాల్లో ఉత్తమ చిత్రం, ఉత్తమ స్క్రీన్‌ప్లే, ఉత్తమ రచయిత అవార్డులు దక్కాయి. 50 ఏళ్ల క్రితమే అంతటి ప్రతిభావంత చిత్రం తెరకెక్కించిన అపార మేధస్సు శ్యామ్ సొంతం.

శ్యామ్ తీసిన చిత్రాల్లో మాస్టర్‌పీస్‌గా 'భూమిక' (1977)ని చెబుతారు. ఈ చిత్రంలో స్మితా పాటిల్ నటించారు. భర్త వేధింపులు, తల్లితండ్రుల నిరాదరణ నుంచి దూరంగా వెళ్లిపోయిన ఓ స్త్రీ, తనను తాను తెలుసుకునే ప్రయత్నంలో ఎదుర్కొన్న పరిస్థితులు, అంతర్గతంగా ఆమె పడిన మానసిక వేదన ఎంతో హృద్యంగా ఈ సినిమాలో చూపిస్తారు. ఈ సినిమా జాతీయ ఉత్తమ నటి, ఉత్తమ స్క్రీన్‌ప్లే అవార్డులతో పాటు ఫిల్మ్‌ఫేర్ అవార్డును సొంతం చేసుకుంది. ఇంకా పలు అంతర్జాతీయ వేదికలపై కూడా సత్తా చాటింది. ఇలా ఆయన తెరకెక్కించిన ప్రతి చిత్రం ఓ క్లాసిక్.

భారతీయత ఆవిష్కరణ

జవహర్‌లాల్ నెహ్రూ రచించిన 'ద డిస్కవరీ ఆఫ్ ఇండియా' (1946)ని 1988లో సినిమాటోగ్రాఫర్ వికె మూర్తితో కలసి టెలివిజన్ సిరీస్‌గా శ్యామ్ తెరకెక్కించారు. 53 ఎపిసోడ్స్‌గా ఈ సిరీస్ నడిచింది. భారతదేశ గొప్ప చరిత్ర, సాంస్కృతిక వైవిధ్యం, ప్రాచీన కాలం నుండి స్వాతంత్య్రం వరకు కొనసాగిన వారసత్వం, అభివృద్ధి వంటి అనేక సామాజిక అంశాలు అందులో చూపించారు. సత్యజిత్‌రేపై ఉన్న అభిమానం ఆయన కెరియర్‌ని ఓ డాక్యుమెంటరీ రూపంలో తీసుకొచ్చేలా శ్యామ్‌ని ప్రేరేపించింది. రెండేళ్ల పాటు రేని ఇంటర్వ్యూ చేసి, 1985లో దాన్ని తెరకెక్కించారు.

శ్యామ్ తీసిన క్లాసిక్ చిత్రాలన్నీ, బాలీవుడ్‌లో పెద్ద పెద్ద ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌ల నుంచి గ్రాడ్యుయేట్ చేసిన దర్శకుల కాలంలోనే తెరకెక్కాయి. కుందన్ షా, విధు వినోద్ చోప్రా, కేతన్ మెహతా, సయీద్ అక్తర్ మీర్జా వంటి ప్రతిభ గల దర్శకుల బ్యాచ్‌తో సరిసమానంగా ఇండస్ట్రీలో ఎటువంటి ఇనిస్టిట్యూట్ బ్యాక్ గ్రౌండ్ లేని శ్యామ్ చిత్రాలు ఉండేవి. విభిన్నమైన కోణంలో తెరకెక్కించి, భారతీయ సినిమా రంగంలో నవతరానికి ఓ దిక్సూచిలా ఆయన చిత్రాలు దోహదపడ్డాయి. ఈ లెజండరీ దర్శకుడు తెలుగులో ఒకే ఒక్క చిత్రం తెరకెక్కించారు. వాణిశ్రీ, అనంత్‌నాగ్, స్మితాపాటిల్, రావుగోపాలరావు ప్రధాన తారాగణంగా 'అనుగ్రహం' పేరుతో ఆ చిత్రం తెరకెక్కింది.

శ్యామ్ బెనెగల్... భారత చలనచిత్రానికి కొత్త చూపును అద్దిన సృజనశీలి. ఆయన పాత్రలను సృష్టించి నడిపించిన దర్శకుడు మాత్రమే కాదు; సినిమా ఎలా ఉండాలో చూపించిన దార్శనికుడు కూడా!

రంగవల్లి

19 చుక్కలు 19 వరుసలు

ఎన్.లలితకుమారి,
కందుకూరు రోడ్డు,
ప్రకాశం జిల్లా.

మా చిరునామా
మెయిల్ ఐడి : jeevanapages@gmail.com
వాట్సాప్ : 83329 25496

27 నుంచి 'ఆర్‌ఆర్‌ఆర్' డాక్యుమెంటరీ ప్రసారం

రామ్‌చరణ్, ఎన్టీఆర్ నటులుగా దర్శకుడు రాజమౌళి తెరకెక్కించిన బ్లాక్‌బస్టర్ మూవీ 'ఆర్‌ఆర్‌ఆర్'. భారీ వసూళ్లతోపాటుగా ఎన్నో రికార్డులు నెలకొల్పిన ఈ సినిమా తెర వెనుక సంగతుల సమాహారం 'ఆర్‌ఆర్‌ఆర్: బి హైండ్ అండ్ బియాండ్'. ఈనెల 27 నుంచి ఓటీటీ 'నెట్‌ఫ్లిక్స్'లో ఈ డాక్యుమెంటరీ ప్రసారం కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ నెట్‌ఫ్లిక్స్ పోస్టర్ విడుదల చేసింది. ఎంపిక చేసిన పలు థియేటర్లలో ఈ డాక్యుమెంటరీ ఈనెల 20న విడుదలైంది. సుమారు మూడేళ్ల ప్రయాణానికి సంబంధించి 20 టీబీ ఫుటేజ్ రాగా దాన్ని ఎడిట్ చేయడానికి ఏడాది పట్టిందట. బెస్ట్ మూమెంట్స్‌ను తీసుకుని 1:38 గంటల నిడివితో ఈ డాక్యుమెంటరీని రూపొందించారు. యాక్షన్ సీక్వెన్స్ షూటింగ్ విజువల్స్, చిత్రబృందం అభిప్రాయం తదితర సంగతులు ఇందులో పొందుపర్చారు.

మహిళల గౌరవాన్ని పెంచే 'నారి'

'అన్ని తరగతుల ప్రేక్షకులకు నచ్చేలా మంచి ఫ్యామిలీ డ్రామా కథతో 'నారి' సినిమాను రూపొందించాం. జనవరి 24న గ్రాండ్‌గా థియేటర్లలోకి తీసుకొస్తున్నాం. ఈ సినిమాకు ప్రముఖ సంగీత దర్శకులు రమణ గోగుల, ఆర్పీ పట్నాయక్ వాయిస్‌ను అందించారు. మహిళా సాధికారతపై రూపకల్పన చేసిన పాటను సింగర్ చిన్మయి అద్భుతంగా పాడారు. సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉన్న సిస్టర్ అనే యువకుడు ఒక మంచి పాట పాడారు. ఆడియో దివో కంపెనీ ద్వారా త్వరలోనే విడుదల చేయబోతున్నాం. మహిళల్ని గౌరవించాలనే గొప్ప కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఈ సినిమా ఘన విజయాన్ని సాధిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు దర్శకుడు సూర్య వంటిపల్లి అన్నారు. ఆమని, వికాస్ వశిష్ఠ, మౌనికరెడ్డి, ప్రగతి, సునయన, కేదార్‌శంకర్, ప్రమోదిని తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. శశి వంటిపల్లి నిర్మాత.

'ప్రేమికుడు' ఫస్ట్‌లుక్ విడుదల

రామ్ వెలుగు దర్శకత్వంలో పండు చిరుమామిళ్ల ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ప్రేమికుడు'. అన్ ఫిల్టర్ అనే ట్యాగ్‌లైన్ కూడా ఉంది. గురుదేవ్ స్టోరీ టెల్లర్స్ బ్యానర్‌పై రామ్ యాదవ్ గొట్టె, చెరుకూరి సాయి కుమార్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్లు మంగళవారం విడుదల చేశారు. ఆదిత్య లొల్ల సినిమాటోగ్రాఫర్, బీజిఎ నాగార్జున రచయిత. మిగతా వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని మేకర్లు ప్రకటించారు.

'నా శ్వాసే నువ్వే' లిరికల్ సాంగ్ రిలీజ్

చరణ్‌సాయి, ఉష్టశ్రీ నటీనటులుగా తెరకెక్కుతున్న సినిమా 'ఇక్స్ ఒకే గురు'. వండర్ బిల్డ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సురేష్ అనపురపు, బస్వ గోవర్ధన్‌గౌడ్ నిర్మిస్తున్నారు. దర్శకుడు మణికంఠ ఎం.రూపొందిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా విడుదల కానుంది. ఈ సినిమా నుంచి హీరో సిద్ధార్థ్ పాడిన 'నా శ్వాసే నువ్వే' లిరికల్ సాంగ్‌ను మేకర్లు విడుదల చేశారు. సంగీతం మోహిత్ రెహ్మానియక్, రాహుల్ లిరిక్స్ అందించారు.

27న డ్రింకర్ సాయి విడుదల

'నా తండ్రి బసవరాజు శ్రీనివాస్‌కు చిరంజీవిగారితో మంచి పరిచయం ఉంది. 'డ్రింకర్ సాయి' సినిమా స్నాప్‌షాట్లో ఉన్నప్పుడు చిరంజీవిని కలిసి కథ గురించి చెప్పాం. ఆయన ఓకే ప్రోసీడ్ అన్నారు. అలా ఆయన ప్రోత్సాహంతో సినిమా ప్రారంభించాం. మా చిత్రంలోని సాంగ్స్‌ను ఆయనకు చూపిస్తే బాగున్నాయంటూ అభినందించారు. 2019లోనే ఈ మూవీ పనులు మొదలు పెట్టాం. కోవిడ్ వల్ల షూటింగ్‌కు బ్రేక్ పడింది. గతేడాది ప్రారంభించాం. మొదట్లో అనుకున్న కథకు కొన్ని మార్పులు చేసి దర్శకుడు కిరణ్ ఈ చిత్రాన్ని రూపొందించారు. హీరోగా ధర్మ, జమ్మూకు చెందిన ఐశ్వర్య హీరోయిన్ అద్భుతంగా నటించారు. ఈనెల 27న సినిమాను విడుదల చేస్తున్నాం. ఏపీలో డిస్ట్రిబ్యూటర్స్‌కు ఇచ్చాం. నైజాంలో సొంతంగా రిలీజ్ చేస్తున్నాం. ఈ లవ్‌స్టోరీలో మంచి మెసేజ్ కూడా ఉంటుంది' అని నిర్మాత బసవరాజు లహరిధర్ తెలిపారు. కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. చిత్రం విడుదల సందర్భంగా నిర్మాత బసవరాజు లహరిధర్ మీడియాతో మాట్లాడారు.

హర్లిన్ సెంచరీ

- టీమిండియా రికార్డు స్కోరు సమం
- రెండో వన్డేలో వెస్టిండీస్‌పై 115పరుగుల తేడాతో గెలుపు
- సిరీస్ 2-0తో కైవసం

వడోదర: వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో హర్లీన్ డియోల్ సెంచరీకి తోడు ఓపెనర్ స్మృతి మంధాన, రావల్, రోడ్రిగ్ అర్ధసెంచరీలతో రాణించారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా మహిళలు 358 పరుగుల రికార్డు స్కోర్‌ను నమోదు చేసింది. వెస్టిండీస్‌తో మంగళవారం జరిగిన రెండో వన్డేలో హర్మన్‌ప్రీత్ సేన విండీస్‌పై 115 పరుగుల తేడాతో నెగ్గింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత నిర్ణీత 50 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 358పరుగుల భారీ స్కోర్‌ను నమోదు చేయగా... అనంతరం వెస్టిండీస్ 7వికెట్ల నష్టానికి 243పరుగులే చేసింది. మాథ్యూస్(106) సెంచరీతో రాణించినా... 243పరుగులకే ఆలౌట్ చేసింది. దీంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ చేజిక్కించుకుంది. హర్లీన్ డియోల్ (115; 103బంతుల్లో 16ఫోర్లు) శతకానికి తోడు ఓపెనర్ స్మృతి మంధాన (53; 47బంతుల్లో 7ఫోర్లు, 2సిక్సర్లు) పరుగులు చేసింది. మరో ఓపెనర్ ప్రతీక రావల్ (76, 86బంతుల్లో 10ఫోర్లు, సిక్సర్) అదరగొట్టింది. జెమీమా రోడ్రిగ్స్ (52; 36బంతుల్లో 6ఫోర్లు, సిక్సర్) కూడా అర్ధసెంచరీతో మెరిసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(22) పరుగులు చేసింది. వన్డేల్లో భారత్ 350కిపైగా స్కోరు చేయడం ఇది రెండోసారి. 2022లో ఐర్లాండ్‌పై కూడా సరిగ్గా 358/5 స్కోరు చేసింది. దీంతో రికార్డు స్కోర్‌ను భారత్ సమం చేసింది. మంధాన, ప్రతీక తొలి వికెట్‌కు 110 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి బలమైన పునాది వేశారు. తర్వాత ప్రతీక, హర్లీన్ జోడీ కూడా రాణించారు. 62 బంతుల్లో అర్ధ శతకం అందుకున్న హర్లీన్... తర్వాత దూకుడు పెంచింది. డాటిన్ వేసిన 45 ఓవర్‌లో మూడు ఫోర్లు బాదేసిన ఆమె 98 బంతుల్లో శతకం పూర్తి చేసుకుంది. జైదా జేమ్స్ వేసిన 46 ఓవర్‌లో జెమీమా నాలుగు బౌండరీలు రాబట్టింది. ఇన్నింగ్స్ ఆఖరి రెండు బంతులకు రిచా ఘోష్ (13బి) ఫోర్లు బాది రికార్డు స్కోరును సమం చేసింది. విండీస్ బౌలర్లలో అఫీ ఫ్లెచర్, జైదా జేమ్స్, కియానా జోసెఫ్, డాటిన్ తలో వికెట్ తీశారు.

మాథ్యూస్ సెంచరీ

359 పరుగుల భారీ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన విండీస్ మహిళలు పోరాడుతున్నారు. కెప్టెన్ మాథ్యూస్ (106బి 109 బంతుల్లో 13x4) సెంచరీతో చెలరేగింది. ఓపెనర్ జోసెఫ్ (15), నెరిస్సా ((13), విలియమ్స్ (0), డాటిన్ (10) తక్కువ స్కోరుకే పెవిలియన్‌కు చేరుతున్నా.. కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడింది. వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు బాదుతూ భారత బౌలర్లను కాస్త కంగారుపెట్టింది. క్యాంప్ బెల్ (38) మినహా పెద్దగా ఎవరూ రాణించలేక పోయారు. 40 ఓవర్ల ముగిసే సరికి విండీస్ జట్టు 7 వికెట్లు కోల్పోయి 202 పరుగులు చేసింది. ఆ తర్వాత భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో విండీస్ జట్టు 46.2ఓవర్లలో ఆలౌటైంది. ప్రియా మిశ్రకు మూడు, దీప్తి, టిటాస్ సద్దు, రావల్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హర్లీన్ డియోల్‌కు లభించగా.. మూడో, చివరి వన్డే శుక్రవారం జరగనుంది.

స్కోర్‌బోర్డు...

ఇండియా మహిళల ఇన్నింగ్స్: మంధాన (సి)హేలీ మాథ్యూస్ (బి)ఫ్లెచర్ 53, ప్రతీక రావల్ (సి)జోసెఫ్ (బి)జేమ్స్ 76, హర్లీన్ డియోల్ (సి)అలియోనే (బి)జోసెఫ్ 115, హర్మన్‌ప్రీత్ (బి)ఫ్లెచర్ 22, రోడ్రిగ్స్ (సి)మాథ్యూస్ (బి)డాటిన్ 52, రిచా ఘోష్ (నాటౌట్) 13, దీప్తి శర్మ (నాటౌట్) 4, అదనం 23. (50ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 358పరుగులు. **వికెట్ల పతనం:** 1/110, 2/172, 3/215, 4/331, 5/341 **బౌలింగ్:** డోటిన్ 7-0-53-1, కానెల్ 4-0-36-0, మాథ్యూస్ 10-0-60-0, అలియనే 4-0-39-0, కరిష్మా 10-0-46-0, ఫ్లెచర్ 6-0-38-1, జేమ్స్ 7-0-57-1, జోసెఫ్ 2-0-27-1.

వెస్టిండీస్ మహిళల ఇన్నింగ్స్: మాథ్యూస్ (సి)రోడ్రిగ్స్ (బి)రావల్ 106, జోసెఫ్ (సి)రావల్ (బి)దీప్తి శర్మ 15, క్రాంబెల్ (సి అండ్ బి)టిటాస్ సద్దు 13, విలియమ్స్ (ఎల్‌బి)ప్రియా మిశ్రా 0, డోటిన్ (బి)రేణుక సింగ్ 10, కాంప్‌బెల్ (సి)మంధాన (బి)టిటాస్ సద్దు 38, అలియనే (సి) సబ్ మిన్ను మణి (బి)దీప్తి 0, జేమ్స్ (సి)రావల్ (బి)ప్రియా మిశ్రా 25, ఫ్లెచర్ (సి)మంధాన (బి)రావల్ 22, కరిష్మా (సి)హర్లీన్ (బి)ప్రియా మిశ్రా 3, కానెల్ (నాటౌట్) 4, అదనం 7. (46.2ఓవర్లలో ఆలౌట్) 243పరుగులు. **వికెట్ల పతనం:** 1/20, 2/36, 3/40, 4/69, 5/181, 6/182, 7/199, 8/227, 9/237, 10/243 **బౌలింగ్:** రేణుక సింగ్ 9-1-41-1, దీప్తి శర్మ 9-1-40-2, టిటాస్ సద్దు 10-0-42-2, ప్రియా మిశ్రా 9.2-0-49-3, సైమా ఠాకూర్ 4-0-33-0, ప్రతీక రావల్ 5-0-37-2.

నాకౌట్‌కు యు ముంబ

- తెలుగు టైటాన్స్ ఆశలు ఆవిరి
- ముగిసిన ప్రొ కబడ్డీ సీజన్-11 లీగ్ పోటీలు

పూణె: బెంగాల్ వారియర్స్-యు ముంబ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌తో ప్రొ కబడ్డీ లీగ్ మ్యాచ్‌లు ముగిసాయి. చివరి లీగ్ మ్యాచ్‌లో యు ముంబ జట్టు బెంగాల్ వారియర్స్‌ను చిత్తుచేసి నాకౌట్‌కు చేరగా.. తెలుగు టైటాన్స్ ఆశలు ఆడియాశలయ్యాయి. ఈ మ్యాచ్‌లో యు ముంబ జట్టు ఓటమిపాలైతే తెలుగు టైటాన్స్ జట్టు టాప్-6లో నిలిచే నాకౌట్ బెర్త్ దక్కేది. మంగళవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లలో యుపి యోధాస్ జట్టు 44-30పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌ను, యు ముంబ జట్టు 36-27 పాయింట్ల తేడాతో బెంగాల్ వారియర్స్‌ను చిత్తుచేశాయి. దీంతో 22 మ్యాచ్‌లు ముగిసేసరికి హర్యానా స్టీలర్స్ 84పాయింట్లతో అగ్రస్థానంతో ముగించింది. ఇక టాప్-6లో నిలిచిన హర్యానా, ఢిల్లీ, యుపి, పాట్నా, జైపూర్, యు ముంబ జట్లు నాకౌట్‌కు చేరాయి. గురువారం ఎలిమినేటర్ మ్యాచ్‌లు జరగనుండగా.. శుక్రవారం సెమీస్, ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరగనున్నాయి.

లీగ్ దశ ముగిసిన అనంతరం పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	టై	పా.వ్య	పా
1. హర్యానా స్టీలర్స్	22	6	6	0	112	84
2. దబాంగ్ ఢిల్లీ	22	13	5	4	85	81
3. యుపి యోధాస్	22	13	6	3	97	79
4. పట్నా పైరేట్స్	22	13	7	2	93	77
5. యు ముంబ	22	12	8	2	16	71
6. జైపూర్ పింక్‌ప్యాంథర్స్	22	12	8	2	55	70
7. తెలుగు టైటాన్స్	22	12	10	0	-40	66
8. పుణేరి పల్టాన్స్	22	9	10	3	61	60
9. తమిళ్ తలైవాస్	22	8	13	1	16	50
10. బెంగాల్ వారియర్స్	22	5	14	3	-116	41
11. గుజరాత్ జెయింట్స్	22	5	14	3	-152	38
12. బెంగళూరు బుల్స్	22	2	19	1	-227	19

(నోట్: మ్యా=మ్యాచ్‌లు; గె=గెలుపు; ఓ=ఓటమి; పా.వ్య=పాయింట్ల వ్యత్యాసం; పా=పాయింట్లు)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68